సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 15 సంచిక: 322

SUNDAY Special ఆదివారం 12-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే. ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'




వధువు కోసం పాదయాత్ర

కర్ణాటకలో ఫిబ్రవరి 23న 200 మంది పల్లెటూరి యువకులు పాదయాత్ర చేయనున్నారు. దాని పేరు 'బ్రహ్మచారుల పాదయాత్ర' - 11లో



స్పిన్‌తో 'విన్ ఇండియా'

తొలి టెస్టులో ఆస్ట్రేలియాపై ఇన్నింగ్స్ 132 పరుగులతో భారత్ భారీ విజయం. ఐదు వికెట్లతో ఆసీస్‌ను దెబ్బ కొట్టిన అశ్విన్ - 12లో



సౌర కిరీటం

సూర్యుడి నుంచి ఓ ప్లాస్మా పోగు విడిపోవడమేమిటి. ధ్రువ ప్రాంతంలో రింగులా చక్కర్లు కొట్టడమేమిటని ఆశ్చర్యపోతున్నారా? నాసా శాస్త్రవేత్తలూ ఇలాగే ఆశ్చర్యపోయారు.

- వివరాలు 6లో▶



దుమ్ము రేపిన చాట్‌జీపీటీ

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ చాట్‌బాట్ చాట్‌జీపీటీ మరో ఘనత సాధించింది. అత్యంత కఠినమైన యూఎస్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జాం (యూఎస్ఎంఎల్ఈ) పాసైంది.

- వివరాలు 6లో▶



హైదరాబాద్ 'ఫార్ములా' అదిరింది

'ఇ' రేస్ విజయవంతం... నిర్వాహకుల నుంచి ప్రశంసలు



భారత్‌లో తొలిసారిగా నిర్వహించిన ఎలక్ట్రిక్ కార్ రేసింగ్ ఫార్ములా 'ఇ' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. హైదరాబాద్ వేదికగా శనివారం జరిగిన ఈ రేసుకు ప్రేక్షకుల ఆదరణతోపాటు... ఇటు నిర్వాహకుల నుంచి ప్రశంసలు లభించాయి. ఒకవైపు వీఐపీ బాక్స్‌లో నుంచి సెలబ్రిటీలు రేస్‌ను ఆస్వాదిస్తుండగా... మరోవైపు గ్యాలరీల్లో ఉన్న సాధారణ అభిమానుల హోరుతో హుస్సేన్ సాగర్ పరిసరాలు దద్దరిల్లాయి. రెప్పపాటులో ట్రాక్‌పై రయ్‌మంటూ జనరేషన్ '3' కార్లు పరుగులు తీయగా... దాదాపు గంట పాటు హుస్సేన్ సాగర్ తీరం ప్రపంచ పటంపై కనువిందు చేసింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్టాత్మక ఫార్ములా 'ఇ' రేస్‌లకు ఆతిథ్యం ఇస్తున్న న్యూయార్క్, బెర్లిన్, బీజింగ్, రోమ్, జ్యూరిక్ నగరాల సరసన ఇప్పుడు హైదరాబాద్ కూడా చేరింది. ఈ హోరాహోరీ సమరంలో చివరకు డీఎస్ పెన్‌స్కే జట్టు డ్రైవర్ జీన్ ఎరిక్ వెర్నే విజేతగా నిలిచాడు. భారత్‌కు చెందిన మహీంద్రా జట్టు డ్రైవర్లలో రోలండ్ ఆరో స్థానంలో, డి గ్రాసి 14వ స్థానంలో నిలిచారు. - 12లో



విజేతగా నిలిచిన డీఎస్ పెన్‌స్కే జట్టు డ్రైవర్ జీన్ ఎరిక్ వెర్నే

ఏది నిజం?



బాబూ.. జవాబుందా..

వైఎస్ వివేకానందరెడ్డి కేసులో దర్యాప్తును మొదటి నుంచీ నడిపిస్తున్నది ఎల్లో మీడియానే. పోలీసులు, సీబీఐ ఏం చేయాలో కూడా ఎల్లో మీడియానే చెబుతోంది. అప్పట్లో టీడీపీ అధికారంలో ఉంది కాబట్టి... వివేకా అనుచరులే డబ్బు లావాదేవీల్లో భాగంగా ఆయన్ను హత మార్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తం చేసింది 'ఈనాడు'. ఇప్పుడు చంద్రబాబు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి ప్లేటు ఫిరాయించింది. బాబుకు లబ్ధి కలిగేలా ఎంపీ అవినాశ్‌ను టార్గెట్ చేస్తూ కథనాలు వండి వారుస్తోంది.

అసలు హత్య జరిగిన ఆ రోజు నిరంతరం స్థానిక పోలీసులతో నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు ఏం మాట్లాడారు? నిమిష నిమిషానికీ చంద్రబాబుతో ఏం చెప్పారు? ఈ కోణంలో చంద్రబాబును విచారించలేదెందుకు? మొత్తంగా ఈ కేసులో దర్యాప్తు ఎలా పక్కదోవ పడుతోందో వివరించే కొన్ని అంశాలివిగో...

- వివరాలు 4లో▶

రాష్ట్రంపై 'శత్రు' వైఖరి

తెలంగాణపై పగ పెంచుకున్నట్టుగా కేంద్రం వ్యవహరిస్తోంది.. అసెంబ్లీలో మంత్రి కేటీఆర్

- 'మెట్రో'కు సహకరించడం లేదు
- బెంగళూరు, చెన్నై, గుజరాత్, యూపీకి సాయం.. తెలంగాణకు నిల్
- పాతబస్తీతోపాటు శంషాబాద్, బీహెచ్ఈఎల్ వరకు మెట్రోను పొడిగిస్తాం
- ఎస్ఎన్‌డీపీ ద్వారా హైదరాబాద్‌లో నాలాల సమస్యకు పరిష్కారం
- చార్మినార్ పాదచారుల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడి
- శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురి ప్రశ్నలకు జవాబిచ్చిన కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రాజెక్టులకు కేంద్ర సహకారం కోసం ఎన్ని ప్రతిపాదనలు పంపినా పట్టించుకోవడం లేదని మంత్రి కె.తారక రామారావు విమర్శించారు. హైదరాబాద్‌లో మెట్రోరైలు విస్తరణకు ఉన్న డిమాండ్‌పై ఏమాత్రం స్పందించడం లేదని.. మరోవైపు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని నగరాలలో మెట్రో ప్రాజెక్టులకు కేంద్ర వాటాతో పాటు సావరిన్ గ్యారంటీల పేరిట పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని మండిపడ్డారు. అయినా హైదరాబాద్ ప్రజల ఆకాంక్ష, పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వమే మెట్రో ప్రాజెక్టు విస్తరణ కోసం కృషి చేస్తోందని చెప్పారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా

మిగతా 2వ పేజీలో ▶

ప్రతిపాదనలన్నీ వెనక్కే..

కోటీ 20లక్షల మంది నివసిస్తున్న హైదరాబాద్‌కు నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం శత్రుదేశంపై పగబట్టినట్టుగా తెలంగాణపై కక్ష గట్టి వ్యవహరిస్తోంది. హైదరాబాద్‌లో మెట్రో పొడిగింపు కోసం కేంద్ర ప్రభుత్వ వాటా ఇవ్వాలని కేంద్ర మంత్రిని కలుద్దామంటే అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. అధికారులను పంపించినా సానుకూల స్పందన రాలేదు. ఢిల్లీ మెట్రో అధికారులతో హైదరాబాద్ మెట్రో ఆడిటింగ్ చేయించాం. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వ సాయం కోరితే వయబిలిటీ లేదని, ఇతర కారణాలు చూపుతూ నిధులు కేటాయించడం లేదు. వడ్డించేవాళ్లు మనవాళ్లయితే అన్నట్టుగా కేంద్రం వ్యవహరిస్తోంది. బెంగళూరు మెట్రోకు కేంద్రం 20 శాతం వాటాతోపాటు రూ.29వేల కోట్లకు పైగా సావరిన్ గ్యారెంటీ ఇచ్చింది. చెన్నై మెట్రోకు కేంద్రం వాటా, సావరిన్ గ్యారంటీ కలిపి రూ.58,795 కోట్లు కేటాయించింది. యూపీ లోని ఆరు పట్టణాలకు 20 శాతం వాటాతో పాటు సావరిన్ గ్యారంటీ ఇస్తోంది.

- మంత్రి కేటీఆర్

అసెంబ్లీ సమావేశాలకు నేటితో తెర

- బడ్జెట్ పద్దులపై ముగిసిన 3 రోజుల చర్చ
- 37 పద్దులు ఆమోదం... నేడు ఉభయసభల్లో చర్చకు రానున్న ద్రవ్య వినిమయ బిల్లు - 2లో

సాంకేతికతపై పట్టుండాలి

సామాన్యుడికి న్యాయం చేసినప్పుడే పోలీసింగ్‌కు అర్థం

- యువ పోలీసు అధికారులు అంకితభావంతో పనిచేయాలి
- ఐపీఎస్‌ల దీక్షాంత్ పరేడ్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- 195 మంది ప్రొబేషనరీ ఐపీఎస్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరణ



దీక్షాంత్ పరేడ్‌లో ప్రసంగిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

సాక్షి, హైదరాబాద్: మారుతున్న పరిస్థితుల్లో పోలీసింగ్‌లోనూ అనేక కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. సైబర్ నేరాలు, నార్కో టెర్రరిజం, సాంకేతికత ఆధారంగా పెరుగుతున్న ఇతర నేరాల కట్టడికి పోలీసులు కూడా సాంకేతికతపై పట్టు సాధించాలని సూచించారు. పోలీస్‌శాఖలోని కానిస్టేబుల్ నుంచి డీజీపీ ర్యాంకు వరకు అధికారులంతా సాంకేతికతపై అవగాహన పెంచుకోవడంతోనే ఇది సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. శనివారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో నిర్వహించిన 74వ రెగ్యులర్ రిక్రూటీ బ్యాచ్ ఐపీఎస్ అధికారుల దీక్షాంత్ పరేడ్‌కు అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన 195 మంది ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ట్రోఫీలను అందజేశారు. అనంతరం

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

మండలి డిప్యూటీ చైర్మన్‌గా బండ ప్రకాశ్



శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ పదవికి ఒకే నామినేషన్ దాఖలు కావడం, బీఆర్ఎస్‌కు మండలిలో భారీ మెజారిటీ ఉండటంతో ప్రకాశ్ ఏకగ్రీవ ఎన్నిక లాంఛనం కానుంది.

- వివరాలు 2లో▶

బుల్లెట్‌పై రాజాసింగ్



గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బుల్లెట్‌పై అసెంబ్లీకి వచ్చారు. బుల్లెట్‌ప్రూఫ్ వాహనం మొరాయిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ, ఇప్పటికైనా దానికి మరమ్మతు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

- వివరాలు 2లో▶

ఇదండీ సంగతి



పాత బడ్జెట్‌లోని తీర్మానాలు ఇంకా అమలు కాలేదా అని ప్రతిపక్షాలు గొడవచేస్తున్నాయ్‌సార్!

ఆ 'ప్రాజెక్టుల'ను మీ ఖాతాలో వేసుకుంటే ఎలా?

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ హయాంలో జూరాల, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను నిర్మిస్తే, వాటి ద్వారా వచ్చే నీటిని తామే అందిస్తున్నట్టు అధికార పార్టీ నేతలు చెప్పుకోవటం ఏంటని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ''కాళేశ్వరం ప్రాజెక్టు కింద 18 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు వస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. కానీ, డిస్ట్రిబ్యూటరీ కాలువలు పూర్తి చేయకుండానే నీళ్లు ఎలా ఇస్తున్నారో అర్థం కావటం లేదు. భారీ ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టు విషయంలో వాస్తవాలను జనం ముందుంచేందుకు మేం వెళ్తే అరెస్టు చేస్తారు. వేరే దేశాల నుంచి వచ్చేవారిని మాత్రం అనుమతిస్తారు. ఏంటీ దారుణం''అంటూ ప్రభుత్వతీరును తప్పుపట్టారు. అందులోని లోపాలను జనం ముందుంచుతామన్న భయంతోనే తమను అరెస్టు చేశారని ఆరోపించారు. పద్దులపై చర్చలో భాగంగా శనివారం ఆయన శాసనసభలో మాట్లాడుతూ పలు ఆరోపణలు చేశారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీల వెనుక ఉన్న భూములు ముంపునకు గురై

మిగతా 2వ పేజీలో ▶

మీరు నీళ్లిస్తే వలసలు ఆగలేదేం?

భట్టి ఆరోపణలకు సమాధానమిచ్చిన మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ''కాంగ్రెస్ హయాంలోనే నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి ప్రాజెక్టులు పూర్తయి లక్షల ఎకరాలకు నీళ్లందితే పాలమూరు జిల్లాలో వలసలు ఎందుకు కొనసాగాయో ఆ పార్టీనే చెప్పాలి. ఆ ప్రాజెక్టుల కింద కాంగ్రెస్ హయాంలో 27,300 ఎకరాలకే నీళ్లందాయి. పంప్‌హౌస్‌లు పూర్తి చేయకుండా, కాలువలు తవ్వకుండా బిల్లులు తీసుకున్నారు. మా ప్రభుత్వం వచ్చాక రూ.3,663 కోట్లతో మొత్తం పనులు పూర్తి చేసి 5,69,506 ఎకరాలకు నీళ్లు అందించాం. జూరాల కింద లక్ష ఎకరాల ఆయకట్టు పెంచాం. మిషన్ కాకతీయతో వలస వెళ్లిన వారు తిరిగి వచ్చారు'' అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. పద్దుల పై చర్చలో సీఎల్పీ నేత భట్టి సాగునీటి ప్రాజెక్టులపై చేసిన ఆరోపణలకు ఆయన ఘాటుగా బదులిచ్చారు.

'కాళేశ్వరం' ఇప్పుడు వెళ్లండి...: గతేడాది భారీ వరదల వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాంతం బురదమయమై ఉండటంతో ప్రమాదాలు నివారించేందుకే ప్రాజెక్టు సందర్శనకు అనుమతి ఇవ్వలేదని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. అందుకే అప్పుడు కాంగ్రెస్ నేతల ప్రాజెక్టు సందర్శనను

మిగతా 2వ పేజీలో ▶

సచివాలయ ప్రారంభోత్సవం వాయిదా

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీఎంవో నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న జరగాల్సిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన సచివాలయ భవన సముదాయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసుకుంది. రాష్ట్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి అనుమతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కేంద్ర ఎన్నికల సంఘంతో సంప్రదింపులు జరిపారు. వారి నుంచి వచ్చిన ప్రతి స్పందన ఆశాజనకంగా లేకపోవడంతో ఇప్పటికే ప్రకటించిన రాష్ట్ర సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు ముఖ్యమంత్రి కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రారంభోత్సవ తదుపరి తేదీని తిరిగి ప్రకటిస్తామని పేర్కొంది.

బహిరంగ సభ కూడా వాయిదా

కాగా, సచివాలయం ప్రారంభోత్సవం వాయిదా పడిన నేపథ్యంలో... జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ కూడా వాయిదా పడింది. సచివాలయ ప్రారంభోత్సవానికి తమిళనాడు సీఎం స్టాలిన్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్, బిహార్ సీఎం నితీష్ కుమార్ తరఫున జేడీయూ జాతీయ అధ్యక్షుడిని ఆహ్వానించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసుకోవడంతో ఈ సభ కూడా వాయిదా పడినట్టు తెలిసింది.

బోగస్ స్కీంలు.. చిత్తశుద్ధి లేని బడ్జెట్లు

హాథ్ సే హాథ్ జోడో యాత్రల్లో భాగంగా నాలుగో చార్జిషీట్ విడుదల చేసిన కాంగ్రెస్



- బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ వరుసగా నాలుగో చార్జిషీట్ దాఖలు చేసింది. ఆర్థికరంగంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, బడ్జెట్ కేటాయింపుల్లో లోపించిన చిత్తశుద్ధిని ఎత్తిచూపుతూ 12 అంశాలతో దీన్ని రూపొందించింది. శనివారం హాథ్ సే హాథ్ జోడో యాత్రల సమన్వయ కమిటీ సమావేశం అనంతరం ఆ చార్జిషీట్‌ను ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చార్జిషీట్ విడుదల చేశారు.

2 లో

అమెరికా గగనతలంలో మరో కలకలం

- చైనా భారీ నిఘా బెలూన్‌ను అమెరికా కూల్చేసిన ఘటన మరువకముందే అగ్రరాజ్యంలో మరో గగనతల ఉల్లంఘన ఉదంతం చోటుచేసుకుంది. అలాస్కాలో కారు పరిమాణమున్న అత్యంత ఎత్తులో ఎగురుతున్న ఒక వస్తువును యుద్ధవిమానంతో కూల్చేసినట్టు వైట్‌హౌస్ తెలిపింది.

6 లో

మద్యం కేసులో మరొకరి అరెస్ట్



ఆశలు సమాధి?

- తుర్కియే, సిరియాలో భూకంపం వచ్చి అయిదు రోజులు దాటిపోవడంతో కనిపించకుండా ఉన్న తమ సన్నిహితులు క్షేమంగా తిరిగి వస్తారన్న విశ్వాసం అందరిలోనూ సన్నగిల్లుతోంది. ఇప్పటివరకు 26 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. - 6లో

ఎన్నికల 'బండి'పై కసరత్తు

సంస్థాగతంగా పార్టీలో మార్పు చేర్పులకు బండి సంజయ్ మొగ్గు...

- పనితీరు సరిగా లేని పదాధికారులతో పాటు సగానికి పైగా జిల్లా అధ్యక్షుల మార్పు
- ఇలా ముందుకెళ్లేందుకు షా గ్రీన్‌సిగ్నల్
- అధ్యక్షుడిగా పదవీకాలం పూర్తవుతున్నందున త్వరలోనే కొనసాగింపు రావొచ్చునని సంకేతాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాజకీయంగా సానుకూల పరిస్థితులున్నా ఇప్పటికీ బీజేపీ ఎన్నికల సన్నద్ధత , స్పీడ్ సరిపోవడం లేదని పార్టీ అగ్రనాయకత్వం భావిస్తోంది. మరో 9 నెలల్లోపే అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున రాష్ట్ర పార్టీ సంస్థాగతంగా మరింత దృఢంగా తయారుకావడంతో పాటు పూర్తిస్థాయిలో ఎన్నికలకు సంసిద్ధం కావాలని స్పష్టం చేస్తోంది. అందు కోసం పార్టీని యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాలని ఆదేశించింది. రాష్ట్ర పదాధికారుల్లో చురుకుగా లేని వారిని, జిల్లా అధ్యక్షుల్లో క్రియాశీలకంగా లేని వారిని, నాయకత్వం ఇచ్చే ప్రోగ్రామ్స్‌ను మొక్కుబడిగా నిర్వహిస్తూ పనితీరు సరిగా లేని సగం మందికి పైగా ప్రక్షాళన చేయాలని సూచించింది. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటలకు పైగా రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలతో కూడిన కోర్ కమిటీతో బీజేపీ అగ్రనాయకుడు, కేంద్రహోం మంత్రి అమిత్‌షా భేటీ అయినప్పుడు ఈ అంశాలనే స్పష్టం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. గత సెప్టెంబర్ తర్వాత జరిగిన ఈ కోర్ కమిటీ సమావేశంలో తెలంగాణలో బీఆర్ఎస్ సర్కార్‌పై, సీఎం కేసీఆర్ తీరుపై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడిందని, ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించని పరిస్థితులు నెలకొన్న విషయం తమకు నివేదికల రూపంలో అందిందని షా స్పష్టంచేశారు.

ఆ స్థాయిలో ఎన్నికల తయారీ ఉందా?

బీఆర్ఎస్‌కు బీజేపీనే సరైన ప్రత్యామ్నాయం అని తాము భావిస్తున్నామని, మిషన్ 90లో భాగంగా 90 సీట్లు గెలుపొందే లక్ష్యంతో ముందుకు

మిగతా 5వ పేజీలో ▶

అధ్యక్షుల మార్పుపై సంకేతాలు...

ఈ నెల 25 వరకు 119 అసెంబ్లీ స్థానాల్లో నిర్వహించాల్సిన ప్రజా గోస– బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్‌పై సునీల్ బన్సల్ సమీక్షించారు. ఉప్పల్, బెల్లంపల్లి, పెద్దపల్లి నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం సాగకపోవడంపై సీరియస్ అయ్యారు. ''యూపీలో 9 జిల్లాల అధ్యక్షులను మార్చాము...ఆ తర్వాత అంతా సెట్ అయింది. ఎలాంటి మొహమాటాలూ వద్దు.'' అని ఈ సందర్భంగా వ్యాఖ్యానించినట్టు సమాచారం. స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్ ఆధారంగా జిల్లా అధ్యక్షుల పనితీరు సమీక్షించి, సరిగా పనిచేయని వారిని మార్చే అవకాశం ఉందంటూ ఈ సందర్భంగా సంకేతాలిచ్చారు.

క్లుప్తంగా...

14న కొండగట్టుకు కేసీఆర్?



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆలయాన్ని ఈ నెల 14న సందర్శించనున్నారు. సీఎం పర్యటన షెడ్యూల్‌పై ఆదివారం పూర్తి స్పష్టత వస్తుందని అధికార వర్గాలు వెల్లడించాయి. కొండగట్టు ఆలయాభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయించడం తెలిసిందే. ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధికి ప్లాన్ ఇచ్చిన ఆర్కిటెక్ట్ ఆనంద్ సాయి.. కొండగట్టు అభివృద్ధికి కూడా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తారని సమాచారం.

సంగారెడ్డి అభివృద్ధికి నిధులివ్వండి: జగ్గారెడ్డి



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులివ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆర్థిక మంత్రి హరీశ్‌రావును కోరారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ గుప్తా, జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు తోపాజి హరీశ్‌గుప్తాలతో కలిసి శనివారం అసెంబ్లీలో హరీశ్‌ను కలిసిన జగ్గారెడ్డి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పనుల కోసం రూ.5.5 కోట్లు, సంగారెడ్డి ఫతేఖాన్ దర్గా అభివృద్ధి కోసం రూ.3 కోట్లు, ఈద్గా అభివృద్ధికి రూ.5 కోట్లు, దీన్‌దార్‌ఖాన్ ఫంక్షన్ హాల్ అభివృద్ధి కోసం రూ.5 కోట్ల నిధులతోపాటు సంగారెడ్డి పట్టణంలో ఖబరస్థాన్ కోసం 5 ఎకరాల భూమి కేటాయించాలని, క్రైస్తవుల శ్మశానవాటిక కోసం 5 ఎకరాలివ్వాలని, సీఎస్ఐ చర్చి అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య జిల్లా సంఘం భవనం కోసం రెండెకరాల భూమి, రూ.3 కోట్లు కూడా కేటాయించాలని వినతిపత్రంలో కోరారు.

అసెంబ్లీకి బుల్లెట్ 'రాజా'

బుల్లెట్‌పై వచ్చిన ఎమ్మెల్యే రాజాసింగ్

సాక్షి, హైదరాబాద్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ శనివారం బుల్లెట్‌పై అసెంబ్లీకి వచ్చారు. తన గన్‌మెన్‌తో కలిసి అసెంబ్లీ గేటు వద్దకు వచ్చిన ఆయన్ను అక్కడి పోలీసులు ఆపేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే రాజాసింగ్‌గా గుర్తించి.. ఎమ్మెల్యేలు వెళ్లే దారిలో లోపలికి వెళ్లేందుకు అనుమతించారు. వాస్తవానికి, ఆయనకు ప్రభుత్వం బుల్లెట్‌ప్రూఫ్ వాహనం ఏర్పాటు చేసింది. కానీ ఆ వాహనం తరచూ మొరాయిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాజాసింగ్ ఆరోపిస్తున్నారు. ఇందుకు నిరసనగా తన వాహనంతో శుక్రవారం ప్రగతి భవన్‌లోకి వెళ్లేందుకు ఆయన ప్రయత్నించడం తెలిసిందే. ఇప్పటికైనా తనకు సమకూర్చిన బుల్లెట్‌ప్రూఫ్ వాహనానికి మరమ్మతులు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆ నేతల వ్యాఖ్యలపై పార్టీలు స్పందించాలి



సాక్షి, హైదరాబాద్: ప్రగతిభవన్‌ను పేల్చేస్తాం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు మీద నిర్మించిన సచివాలయాన్ని కూల్చేస్తాం ..అని రెండు పార్టీల రాష్ట్ర అధ్యక్షులు చేసిన వ్యాఖ్యలకు ఆయా పార్టీల నేతలు ముందు శాసనసభలో సమాధానం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. వ్యవ సాయ శాఖ పద్దులపై శనివారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ప్రగతి భవన్‌ను పేల్చేస్తామని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, కొత్త సచివాలయం గుమ్మటాలను కూల్చివేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు.

ట్రాఫిక్ చలాన్లతో పోలీసులు వేధిస్తున్నారు

అసెంబ్లీలో ఎంఐఎం నేత అక్బరుద్దీన్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో పోలీసులు వాహనదారులను ట్రాఫిక్ చలాన్లతో వేధిస్తున్నారని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ శాసనసభలో ఆరోపించారు. శనివారం బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ పోలీసులు ఎక్కడో చాటుగా ఉండి ఫొటోలు తీసి, చలాన్లు వేస్తున్నారని తెలిపారు. కృష్ణానదీ జలాల పంపిణీ సమస్య పరిష్కారానికి అన్ని పార్టీలతో చర్చించాలని సూచించారు. వర్షాలొస్తే కుంటలు ఉప్పొంగి పాత బస్తీలో చాలా ప్రాంతాలు జలమయమతున్నాయని, ఈ నేపథ్యంలో జలాశయాలకు మరమ్మతులు చేయాలని కోరారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు వివిధ బోర్డుల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీలో మైనార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆరోగ్య శ్రీ కార్డులను కార్పొరేట్ ఆసుపత్రుల్లో అనుమతించడం లేదని, ఈ పథకం కింద చికిత్సలకు నిధులు పెంచాలని కోరారు. వివిధ కారణాలతో తొలగించిన హోంగార్డులను మానవీయకోణంలో తిరిగితీసుకోవాలన్నారు.

రాష్ట్రంపై 'శత్రు' వైఖరి

▶ మొదటి పేజీ తరువాయి

శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో మెట్రో రైలు ప్రాజెక్టు పొడిగింపు అంశంపై సభ్యులు అరికపూడి గాంధీ, దానం నాగేందర్, ప్రకాశ్‌గౌడ్, భట్టి విక్రమార్క.. చార్మినార్ పాదచారుల ప్రాజెక్టు (సీపీపీ)పై ఎంఐఎం సభ్యులు.. ఎస్ఎన్‌డీపీపై దానం నాగేందర్, వివేకానంద అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానాలు ఇచ్చారు. కోటీ 20 లక్షల మంది నివసిస్తున్న హైదరాబాద్‌కు నిధులు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి మనసు రావడం లేదని, శత్రుదేశంపై పగబట్టినట్టుగా తెలంగాణపై కక్షగట్టి వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీలో కేటీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''కాంగ్రెస్ హయాంలో చేపట్టిన మెట్రో ప్రాజెక్టు ఒప్పందం మేరకే ప్రస్తుతం మూడు కారిడార్లలో ఎల్అండ్‌టీ సంస్థ ద్వారా నిర్వహణ ప్రక్రియ కొనసాగుతోంది. రూ.6,250 కోట్లతో ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో విస్తరణకు శ్రీకారం చుట్టాం. రాయదుర్గ్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు ఈ ఎక్స్‌ప్రెస్ మెట్రోను మూడేళ్లలో పూర్తిచేయనున్నాం. హైదరాబాద్ మెట్రో ఉద్యోగాల్లో 80 శాతం వరకు తెలంగాణ వాళ్లే ఉన్నారు. కాంగ్రెస్ హయాంలో కుదిరిన ప్రైవేట్, పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ ఒప్పందంలో భాగంగా మెట్రో టికెట్ ధరలను పెంచుకునే అధికారాన్ని నిర్వహణ సంస్థకే ఇచ్చారు. అయినా ఇష్టానుసారం ధరలు పెంచకూడదని ప్రభుత్వం తరపున చెప్పాం. ఆర్టీసీ ధరలతో పోల్చి మెట్రో టికెట్ ధరలు ఉండాలన్నాం. పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్టును పొడిగించే విషయంలో ఇటీవలే ఎంఐఎం నేత అక్బరుద్దీన్‌తో సమావేశమయ్యాను. ముందుగా రూ.100 కోట్లతో రోడ్ల విస్తరణ పూర్తిచేసి పనులు చేపట్టనున్నాం.

9 నెలల్లో పిల్లలు వస్తారు.. మీరు రారు!

సభలో మొదట సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో మెట్రోరైలు ప్రాజెక్టు వచ్చిందని, కానీ ఇప్పుడు ఆదాయాన్ని మొత్తంగా నిర్వహణ సంస్థకే దోచిపెడుతున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. ''60 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆమాత్రం చేయలేరా?'' అని నవ్వుతూ అంటూనే.. ''మాట్లాడితే తొమ్మిది నెలల్లో మేం వస్తాం అంటున్నారు. తొమ్మిది నెలల్లో పిల్లలు వస్తారు. మీరు రారు'' అని వ్యాఖ్యానించారు. దీనితో సభలో అంతా ఒక్కసారిగా ఘొల్లుమన్నారు. ఇక సంగారెడ్డి మెట్రో ప్రాజెక్టు గురించి జగ్గారెడ్డి అడుగుతున్న విషయాన్ని కేటీఆర్ ప్రసంగం తర్వాత గుర్తుచేయగా నవ్వుతూ.. ''9 నెలల్లో వస్తారుగా.. అప్పుడు చూసుకోండి'' అని పేర్కొన్నారు. అప్పటికే మైక్ ఆపేయడంతో ఆ మాటలు రికార్డులకు ఎక్కలేదు.

హైదరాబాద్ ఆత్మ ఎప్పటికీ చెదిరిపోదు

హైదరాబాద్ సాంస్కృతిక వైభవాన్ని కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది. చార్మినార్ సంరక్షణ కోసం పాదచారుల ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. ఎన్ని అధునాతన భవంతులు వెలిసినా హైదరాబాద్ ఆత్మ ఎప్పటికీ చెదిరిపోదు. మూసీనదిపై అఫ్జల్‌గంజ్ వద్ద ఐకానిక్ పెడస్ట్రియన్ బ్రిడ్జి నిర్మాణం కోసం టెండర్లు పిలిచాం. మరో పెడస్ట్రియన్ బ్రిడ్జిని నయాపూల్ వద్ద నిర్మించే యోచనలో ఉన్నాం. గుల్జార్‌హౌస్, మీరాలం మండి, ఆషుర్ ఖానాకు పూర్వవైభవం తీసుకొస్తున్నాం. మదీనా నుంచి పత్తర్‌ఘట్టి వరకు పనులు పూర్తికావొచ్చాయి. పాతబస్తీలో సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాం. చార్మినార్ నుంచి దారుల్-ఉలం స్కూల్ వరకు రోడ్డు వెడల్పు పనులు పూర్తయ్యాయి. హుస్సేనీ ఆలం నుంచి దూద్‌బౌలి వరకు విస్తరణ పనులు జరుగుతున్నాయి. హెరిటేజ్ భవంతుల పూర్వవైభవం కోసం ఎంత ఖర్చయినా వెనుకాడబోం.


ఎస్ఎన్‌డీపీ ఏ నగరంలోనూ లేదు

హైదరాబాద్‌లో రూ.985.45 కోట్లతో వ్యూహాత్మక నాలాల అభివృద్ధి (స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్ఎన్‌డీపీ)) చేపట్టాం. జీహెచ్ఎంసీ పరిధిలో 35 పనులకు 11 పూర్తిచేశాం. పరిసర మున్సిపాలిటీల్లో 21 పనులకుగాను 2 పూర్తిచేశాం. నగరంలో వందేండ్ల క్రితం నిర్మించిన నాలాలే ఉన్నాయి. పలుచోట్ల నాలాలపై 28 వేల మంది పేదలు ఇండ్లు కట్టుకున్నారు. ప్రస్తుతం ఎస్ఎన్‌డీపీ ఫేజ్-2కు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పలు కాలనీల్లో గత వర్షాకాలంలో ముంపు సమస్య కొంతమేర తగ్గింది..'' అని కేటీఆర్ వివరించారు.

అసెంబ్లీ సమావేశాలకు నేటితో తెర

- బడ్జెట్ పద్దులపై ముగిసిన మూడు రోజుల చర్చ
- వివిధ విభాగాలకు చెందిన 37 పద్దులకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వార్షిక బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శనివారం జరిగిన ఎనిమిదో రోజు పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పద్దులపై చర్చ జరిగింది. ఈ నెల 9న శాఖల వారీగా ప్రభుత్వ పద్దులపై చర్చ ప్రారంభం కాగా, మొత్తం 37 పద్దులను ఆమోదించారు. నీటిపారుదల, గవర్నర్, మంత్రిమండలి, సాధారణ పాలన, వాణిజ్య పన్నుల నిర్వహణ, వైద్య, ఆరోగ్యం, పశు, మత్స్య పరిశ్రమ, హోం, జైళ్లు, వ్యవసాయ, సహకార, పంచాయతీరాజ్, గ్రామీణ శాఖలకు సంబంధించిన పద్దులను శాసనసభ ఆమోదించింది. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన శాసనసభ నేరుగా ప్రశ్నోత్తరాలను చేపట్టింది. '2023 ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (సవరణ) బిల్లు'తో పాటు పంచాయతీరాజ్ సవరణ బిల్లును ఆమోదించింది. విరామం అనంతరం తిరిగి సమావేశమైన శాసనసభ అర్ధరాత్రి వరకు కొనసాగింది. కాగా ఆదివారం వార్షిక బడ్జెట్ 2023-24 ద్రవ్య వినిమయ బిల్లు ఉభయసభల్లో చర్చకు రానున్నది. ఈ బిల్లును ఉభయ సభలు ఆమోదించిన తర్వాత నిరవధికంగా వాయిదా పడనుంది. ఆదివారం ఉదయం శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగే చర్చకు ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం ఇచ్చే అవకాశముంది. ఈ బిల్లును శాసనసభ ఆమోదించిన తర్వాత శాసనమండలికి పంపుతారు. శాసనమండలిలోనూ ఈ బిల్లును ఆమోదించిన తర్వాత వాయిదా పడుతుంది.



అర్ధరాత్రి వరకు కొనసాగిన అసెంబ్లీ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో శనివారం రాత్రి 11.48వరకు వార్షిక బడ్జెట్ పద్దులపై చర్చ జరిగింది. ఆదివారం ఉదయం 10 గంటలకు శాసనసభ ముందుకు ద్రవ్య వినిమయ బిల్లు చర్చకు రానుండటంతో పద్దుల ఆమోదానికి చర్చ కొనసాగింది. సుమారు 14 గంటల పాటు సమావేశం జరగ్గా శనివారం సాయంత్రం ఐదున్నర వరకు పద్దులపై సభ్యులు ప్రసంగించారు. మంత్రులు హరీష్ రావు, నిరంజన్ రెడ్డి, మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ తమ శాఖలపై జరిగిన చర్చకు సుదీర్ఘంగా సమాధానాలు ఇచ్చారు. ప్రజలకు అవసరమైన ముఖ్య పద్దులపై చర్చ జరుగుతున్నా మూడు రోజులుగా బీజేపీ సభ్యులు గైర్హాజరు కావడంపై శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. పద్దులపై ఇచ్చిన కోత తీర్మానాలపై స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఓటింగ్ నిర్వహించారు. పద్దులను ఆమోదించినట్లు ప్రకటిస్తూ సభను ఆదివారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

ఆ 'ప్రాజెక్టుల'ను మీ ఖాతాలో వేసుకుంటే ఎలా?

▶ మొదటి పేజీ తరువాయి

పంటనష్టం జరుగుతున్నందున సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తిచేసి నీరు అందిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకొంటున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ముందుకు సాగటం లేదని, దాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటింపచేసేందుకు కేంద్రంతో పోరాడి నిధులు తేవాలని అన్నారు.

ఎకరాకు రూ.24 లక్షలు ఇవ్వాలి

దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయకపోవడం వల్ల దాదాపు 8 లక్షల ఎకరాలకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాజీవ్ సాగర్, ఇందిరసాగర్ ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి సీతారామ ప్రాజెక్టుగా మార్చి 8 ఏళ్లు అవుతున్నా పూర్తి కాలేదన్నారు. సీతమ్మ ప్రాజెక్టు భూ పరిహారం కింద కనీసం ఎకరాకు రూ. 24 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం చేట్టిన రాయలసీమ ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. శివన్నగూడెం రిజర్వాయర్‌ను ఎప్పుడు పూర్తి చేస్తారో, డిండి ప్రాజెక్టుకు ఎక్కడి నుంచి నీళ్లు ఇస్తారో స్పష్టత ఇవ్వాలన్నారు. మల్లన్న సాగర్ నుంచి సంగారెడ్డికి ఎప్పటిలోగా నీళ్లు ఇస్తారో చెప్పాలన్నారు. 1996 పోలీస్ బ్యాచ్‌లో కొందరికి పదోన్నతులు ఇచ్చి కొందరికి ఆపటానికి కారణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. హోంగార్డులకు పే స్కేల్ అమలు చేయాలని పేర్కొన్నారు.

మీరు నీళ్లిస్తే వలసలు ఆగలేదేం?

▶ మొదటి పేజీ తరువాయి

పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు. ఇప్పుడు సమావేశాలు పూర్తయ్యాక వెళ్తానంటే అధికారులను ఇచ్చి పంపుతామని, కడుపునిండా భోజనం కూడా పెట్టిస్తామన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించామని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై గతేడాదే కృష్ణా బోర్డు భేటీలో అభ్యంతరం తెలిపామన్నారు. ఈ ప్రాజెక్టు పనులు ఆపాలని ఎన్జీటీ, కృష్ణా బోర్డు ద్వారా ఏపీ ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇప్పించగలిగామని చెప్పారు.

17 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తెచ్చాం...

పదేళ్ల కాంగ్రెస్ పాలనలో జలయజ్ఞంలో కొత్తగా వచ్చిన ఆయకట్టు 5.71 లక్షల ఎకరాలు మాత్రమేనని, స్థిరీకరించింది కేవలం 93 వేల ఎకరాలేనని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ తమ ప్రభుత్వం 17.23 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 30.56 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించిందన్నారు. గుజరాత్‌లోని సర్దార్ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి 56 ఏళ్లు పట్టిందని, మధ్యప్రదేశ్‌లో ఇందిరాసాగర్ ప్రాజెక్టు పూర్తికి 21 ఏళ్లు పట్టిందన్న హరీశ్‌రావు... తాము మూడున్నరేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి 817 చెరువులు, 66 చెక్‌డాంలు నింపామని వివరించారు.

అనుమతి రాగానే పాలమూరు పనులు..

ఎస్ఎల్‌బీసీని ఏడాదిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్ కేంద్రానికి పంపామని మంత్రి హరీశ్ తెలిపారు. వట్టెం నుంచి డిండికి నీళ్లు తీసుకుంటామని ప్రతిపాదించామని అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

కేసీఆర్ వల్లే తెలంగాణ సస్యశ్యామలం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రంలో బీడు వారిన తెలంగాణ నేలను సస్యశ్యామలం చేసిన మహనీయుడు సీఎం కె.చంద్రశేఖరరావు.. అని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రశంసించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి చేను సాగులోకి వచ్చిందని, ప్రతి చేతికి పని కల్పించిన ఘనత సీఎంకే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీలో శనివారం బడ్జెట్ బిల్లులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 65లక్షల మంది రైతులకు రైతుబంధు పథకం అమలు చేస్తున్నామని, ఏకంగా కోటిన్నర ఎకరాలకు సాయం అందిస్తున్నామని వివరించారు. రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలతో ప్రతి రైతు సంతోషంగా సాగు చేసుకుంటున్నాడని తెలిపారు.

పలు బిల్లులకు ఆమోదం

రాష్ట్ర బడ్జెట్‌పై చర్చలో భాగంగా శనివారం వివిధ శాఖల బిల్లులపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సవరణ బిల్లు, తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లులతో పాటు సాగునీరు, ఆయకట్ల అభివృద్ధి, సాధారణ పరిపాలన, వాణిజ్య పన్నులు, వైద్య, ఆరోగ్యం, పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమాభివృద్ధి, సినిమాటోగ్రఫీ, హోం, జైళ్లు, అగ్నిమాపక సేవలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మార్కెటింగ్, రవాణా శాఖలకు సంబంధించిన బిల్లులకు సభ ఆమోదం తెలిపింది.

నగరం చుట్టూ 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు

- కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా..
- ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీతో నాణ్యమైన, అత్యాధునిక వైద్యసేవలు
- శాసనసభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: మెరుగైన, నాణ్యమైన వైద్యాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి టి.హరీశ్‌రావు స్పష్టం చేశారు. రోగానికి చికిత్స అందించడం ఒక కోణమైతే... అసలు రోగాల బారిన పడకుండా ఆరోగ్య సమాజాన్ని నిర్మించడం మరో కోణమని, ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శనివారం బిల్లులపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తూ అత్యాధునిక వైద్య సేవలను ప్రజల ముంగిట్లోకి తీసుకొస్తున్నామని, ఒక్క ఏడాదిలోనే 8 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని, అతి త్వరలో మరో 9 కాలేజీలను అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. వీటితో పాటు ప్రస్తుతమున్న గాంధీ, ఉస్మానియా, ఎంఎన్‌జే, నీలోఫర్, నిమ్స్ ఆస్పత్రుల్లో పడకల సంఖ్యను పెంచుతూ సేవలు మెరుగుపరుస్తున్నామన్నారు. మరోవైపు నగరం చుట్టూ 4 చోట్ల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రతి పౌరుడికి అత్యంత సమీపంలో ఉత్తమ వైద్య సేవలు అందుతాయని, కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వీటిని నిర్వహిస్తామన్నారు. వైద్య సేవల కల్పనలో దేశంలో తెలంగాణ మూడో స్థానంలో ఉందని, మొదటి స్థానానికి చేరుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.

త్వరలో ఆరోగ్యశ్రీ బకాయిల విడుదల..

ఆరోగ్యశ్రీ బకాయిలను అతి త్వరలో విడుదల చేస్తామని, రైతుబంధులాంటి ప్రతిష్టాత్మక పథకాల నేపథ్యంలో ఆర్థిక సర్దుబాటులో భాగంగా ఈ బిల్లులు నిలిచిపోయాయన్నారు. వీలైనంత త్వరగా ఈ నిధులు ఇస్తామన్నారు. కేన్సర్ చికిత్సకు సంబంధించి త్వరలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, కంటి వెలుగు కార్యక్రమం విజయవంతమైందని, పొరుగు రాష్ట్రాలు సైతం ఈ పథకాన్ని అనుసరిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలు, అమలు చేస్తున్న కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో పొగుడుతోందని, కానీ గల్లీ లీడర్లు మాత్రం పనిగట్టుకుని దూషిస్తున్నారని మంత్రి విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో బీజేపీ పాలిత రాష్ట్రాలకు పలు వైద్య కళాశాలలను మంజూరు చేసినప్పటికీ తెలంగాణకు మాత్రం మొండిచేయి చూపిందన్నారు. కనీసం ఇక్కడున్న ఎయిమ్స్‌లో సైతం సౌకర్యాలను మెరుగుపర్చలేదన్నారు. కానీ ఇక్కడున్న కేంద్ర మంత్రి మాత్రం గొప్పలు చెప్పుకుంటూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శాసనసభ పక్షనేత భట్టి విక్రమార్క ఇతర సభ్యులు లేవనెత్తిన పలు అంశాలకు మంత్రి వివరణ ఇచ్చారు.



అసెంబ్లీ కార్యదర్శికి నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న బండ ప్రకాశ్. చిత్రంలో మంత్రులు సత్యవతి, హరీశ్‌రావు, ఎర్రబెల్లి, వేముల, మహమూద్ అలీ, కేటీఆర్ తదితరులు

మండలి డిప్యూటీ చైర్మన్‌గా బండ ప్రకాశ్

- నామినేషన్ దాఖలు.. ఎన్నిక లాంఛనమే
- నేటి మధ్యాహ్నం 12 గంటలకు ఏకగ్రీవ ఎన్నికపై ప్రకటన

సాక్షి, హైదరాబాద్: శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. శనివారం ఉదయం ఆ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. రెండు రోజుల క్రితమే డిప్యూటీ చైర్మన్ పదవికి బండ ప్రకాశ్ పేరును బీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేసిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం ప్రకాశ్‌తో ఫోన్‌లో మాట్లాడిన కేసీఆర్ అభినందనలు తెలపడంతో పాటు నామినేషన్ దాఖలు చేయాల్సిందిగా సూచించారు. ఈ నేపథ్యంలో నామినేషన్ దాఖలు చేస్తూ సంబంధిత పత్రాలను అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులుకు అందజేశారు. మంత్రులు కేటీ రామారావు, టి.హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఫారూక్ హుస్సేన్, వీజీ గౌడ్, తాతా మధు, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తదితరులు నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో ఎమ్మెల్సీ ప్రకాశ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి 2021 జూన్ 3 వరకు నేతి విద్యాసాగర్ శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా కొనసాగారు. ఎమ్మెల్సీగా ఆరేళ్ల కాలపరిమితి పూర్తి కావడంతో పదవి నుంచి వైదొలిగారు. అప్పటి నుంచి ఆ పదవి ఖాళీగా ఉంది. 40 మంది సభ్యులు కలిగిన శాసన మండలిలో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 36, ఎంఐఎంకు ఇద్దరు, కాంగ్రెస్‌కు ఒక్కరితో పాటు మరో స్వతంత్ర సభ్యుడు ఉన్నారు.

ఎన్నిక లాంఛనమే

డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు ఒకే నామినేషన్ దాఖలు కావడం, సంఖ్యాపరంగా బీఆర్ఎస్‌కు శాసనమండలిలో భారీ మెజారిటీ ఉండటంతో ప్రకాశ్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం లాంఛనమే. ఆదివారం ఉదయం 12 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభం కానుండగా చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి డిప్యూటీ చైర్మన్‌గా ప్రకాశ్ ఎన్నికైనట్లు ప్రకటించడంతో పాటు ఆయనను సభా స్థానంలో కూర్చోబెడతారు.

కౌన్సిలర్ నుంచి కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్‌గా..

హనుమకొండకు చెందిన బండ ప్రకాశ్ (63) 1981లో మున్సిపల్ కౌన్సిలర్‌గా రాజకీయరంగంలోకి అడుగుపెట్టారు. 1981లో ఎం.ఏ (పబ్లిక్ అడ్మిస్ట్రేషన్)లో యూనివర్సిటీ మొదటి ర్యాంకుతో బంగారు పతకం పొందారు. ప్రపంచ బ్యాంకు గ్రామీణాభివృద్ధి అనే అంశంపై పరిశోధన చేసి 1995లో డాక్టరేట్ సాధించారు. 1981-84 వరకు వరంగల్ మున్సిపల్ కౌన్సిలర్‌గా, వైస్ చైర్మన్‌గా, 1982-83, 1984-85 వరకు 'కుడా' సభ్యులుగా కూడా పని చేశారు. పలు స్వచ్ఛంద, విద్యా, కార్మిక, జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా సంస్థలకు గౌరవ అధ్యక్షునిగా, అధ్యక్షునిగా వ్యవహరించారు. పలు విద్యాసంస్థలను స్థాపించారు. 2017లో తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం బీఆర్ఎస్) ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆయన 2018 మార్చి 23న రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2018 - 2019 వరకు ప్రాచీన స్మారక కట్టడాలపై రాజ్యసభలో సెలెక్ట్ కమిటీ సభ్యుడిగా, 2019లో రాజ్యసభలో కార్మిక చట్టాలు - సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఉన్నాడు. 2019 జూన్‌లో రాజ్యసభలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పక్ష ఉపనాయకుడిగా నియమితులయ్యారు. 2021లో జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా ఎన్నియ్యారు. అదే ఏడాది డిసెంబర్4న ఎంపీ పదవికి రాజీనామా చేశారు.

ప్రభుత్వ చీఫ్ విప్‌గా భానుప్రసాద్

మండలిలో విప్‌లుగా కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజు



భానుప్రసాద్ శంభీపూర్ రాజు కౌశిక్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ చీఫ్ విప్‌తో పాటు మరో రెండు విప్ పదవులు భర్తీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు, విప్‌లుగా ఎమ్మెల్సీలు పాడి కౌశిక్‌రెడ్డి, సుంకరి (శంభీపూర్) రాజు నియమితులయ్యారు. సుమారు ఏడాదిన్నరగా శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్‌తో పాటు మరో రెండు విప్ పదవులు ఖాళీగా ఉన్నాయి. మండలిలో చీఫ్ విప్‌తో పాటు, ముగ్గురు విప్‌లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ మాత్రమే ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నారు. కాగా, శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఇప్పటికే ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ నామినేషన్ దాఖలు చేశారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి శాసన మండలిలోకి అడుగు పెట్టిన భానుప్రసాద్‌రావు వరుసగా మూడు పర్యాయాలు గెలిచి ప్రస్తుతం కరీంనగర్ స్థానిక సంస్థల కోటా స్థానం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. గతంలో ప్రభుత్వ విప్‌గా పనిచేసిన భానుప్రసాద్‌కు శాసన మండలిలో ఆయన సీనియారిటీని దృష్టిలో పెట్టుకుని చీఫ్ విప్ పదవికి నామినేట్ చేసినట్లు సమాచారం.

కౌశిక్‌రెడ్డికి ప్రాధాన్యం..

2021 హుజూరాబాద్ ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కౌశిక్‌రెడ్డిని 2021 ఆగస్టు 2న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా కేసీఆర్ నామినేట్ చేశారు. అయితే గవర్నర్ ఈ ప్రతిపాదనను తిరస్కరించడంతో 2021 నవంబర్‌లో ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా కౌశిక్‌రెడ్డి ఎన్నికయ్యారు. పార్టీ కార్యకలాపాల్లో క్రియాశీలంగా పనిచేస్తున్న కౌశిక్‌రెడ్డిని ఇటీవల హుజూరాబాద్‌లో జరిగిన ఓ సభలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఈ ఏడాది చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ అభ్యర్థిగా ఉంటారని పరోక్ష సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో కౌశిక్‌రెడ్డి ప్రస్తుతం శాసన మండలిలో విప్‌గా నియమితులు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కీలక బాధ్యతల్లో శంభీపూర్ రాజు

రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల కోటా నుంచి రెండోసారి శాసన మండలిలో ప్రాతినిధ్యం వహిస్తున్న శంభీపూర్ రాజు తెలంగాణ ఉద్యమ కాలం నుంచి క్రియాశీలంగా పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడిగా, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కీలకనేతగా వ్యవహరిస్తున్నారు. మంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన శంభీపూర్ రాజుకు విప్ పదవి దక్కుతుందని పార్టీ వర్గాల్లో చాలా రోజులనుంచే ప్రచారంలో ఉంది.

బోగస్ స్కీంలు.. చిత్తశుద్ధి లేని బడ్జెట్లు

- 12 అంశాలతో నాలుగో చార్జిషీట్ రూపొందించిన కాంగ్రెస్
- జోడో యాత్రల్లో భాగంగా చార్జిషీట్ విడుదల చేసిన ఏలేటి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి. చిత్రంలో నిరంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ వరుసగా నాలుగో చార్జిషీట్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికరంగంలోనూ విఫలమైందని పేర్కొంటూ ఈ చార్జిషీట్ విడుదల చేసింది. ఆర్థికరంగంలో రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలు, బడ్జెట్ కేటాయింపుల్లో లోపించిన చిత్తశుద్ధిని ఎత్తి చూపుతూ 12 అంశాలతో చార్జిషీట్‌ను రూపొందించింది. శనివారం హాథ్ సే హాథ్ జోడో యాత్రల సమన్వయ కమిటీ సమావేశం అనంతరం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చార్జిషీట్ విడుదల చేశారు. బోగస్ పథకాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసగిస్తోందని, చిత్తశుద్ధిలేని బడ్జెట్‌లను పెట్టి కేటాయింపుల్లోనూ నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. ఎనిమిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలన వైఫల్యాలమయమని, ఆర్థికరంగంలో రాష్ట్ర పరిస్థితి అధ్వానంగా ఉందని, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని చార్జిషీట్‌లో పేర్కొన్నారు.

భజన తప్ప బడ్జెట్‌లో వాస్తవాల్లేవు

చార్జిషీట్ విడుదల చేసిన అనంతరం జోడో యాత్రల సమన్వయ కమిటీ సభ్యులు జి. నిరంజన్, రాములు నాయక్, కైలాశ్ తదితరులతో కలిసి మహేశ్వర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్థికమంత్రి చేసిన భజన తప్ప వాస్తవాల్లేవని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, రూ.5 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని ఆరోపించారు. ఈ బడ్జెట్‌లో రైతు రుణమాఫీ, విద్య, వైద్య రంగాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సొంత జాగా ఉన్నవారికి ఇళ్లు కట్టుకునేందుకు ఆర్థికసాయం వంటి పథకాలకు అరకొర కేటాయింపులు చేశారని వెల్లడించారు. బడ్జెట్ ప్రతిపాదనలకు, అంచనాల బడ్జెట్‌కు పొంతన లేకుండా పోతోందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందనేందుకు ప్రభుత్వం ఈ ఏడాది పెట్టిన బడ్జెటే నిదర్శనమని ఎద్దేవా చేశారు.

క్లుప్తంగా...

నిబద్ధతతో పనిచేస్తే ఉన్నతస్థాయికి వెళ్లొచ్చు

గురుకుల సొసైటీలో కారుణ్య నియామక పత్రాలు అందించిన మంత్రి కొప్పుల



సాక్షి, హైదరాబాద్: నిబద్ధతతో పనిచేసి ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి చేరుకుంటారని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో శనివారం పలువురికి కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని, అలసత్వం లేకుండా ప్రజలకు తక్షణ సేవలందించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారుడికి అందించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి రోనాల్డ్ రాస్, అదనపు కార్యదర్శి హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 1 నుంచి టీఎస్ సెట్ హాల్‌టికెట్ల జారీ

నేడు, రేపు ఎడిట్ ఆప్షన్స్


ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 10న ముగిసింది. దరఖాస్తుల్లో తప్పులను ఆది, సోమవారాల్లో సరిచేసుకోవాలని టీఎస్‌సెట్ సభ్య కార్యదర్శి ప్రొ.మురళీకృష్ణ తెలిపారు. మార్చి 13, 14, 15 తేదీలలో 29 సబ్జెక్టులకు జరిగే పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మార్చి 1 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. తెలంగాణతో పాటు ఏపీలో 4 కేంద్రాలలో జరిగే టీఎస్‌సెట్‌కు 50,237 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. గత టీఎస్‌సెట్ కంటే ఈ సారి 8 వేల మంది అభ్యర్థులు అధికంగా దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

ఇంటర్ పరీక్షలకు డీఈసీ కమిటీలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ పరీక్షల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఈసారి పకడ్బందీగా జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ)లను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్ ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు మొదలయ్యే మూడు రోజుల ముందు ఈ కమిటీలను నియమించడం ఆనవాయితీ. ఈ నెల 15 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఈసారి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ఎక్కడా కీలకమైన బాధ్యతలు ఇవ్వకుండా మిత్తల్ జాగ్రత్త పడ్డారు. కార్పొరేట్ కాలేజీలతో కుమ్మక్కయినట్లు విమర్శలున్న వారిని పక్కన బెట్టారు. ప్రతీ జిల్లాలో డీఐఈవో, నోడల్ అధికారి కన్వీనర్‌గా ఈ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు.

మూడు లాంగ్వేజ్‌లు రాసుకునే ఆప్షన్ ఇవ్వండి

హైకోర్టులో అంధుల సంఘం పిటిషన్



సాక్షి, హైదరాబాద్: 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అంధ విద్యార్థులు రెండు లాంగ్వేజ్‌లు మాత్రమే రాసుకునే అవకాశం ఇస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 27ను సవాల్ చేస్తూ అంధుల అభివృద్ధి, సంక్షేమ సంఘం హైకోర్టును ఆశ్రయించింది. మూడు లాంగ్వేజ్‌లు రాయాలా.. రెండు లాంగ్వేజ్‌లు రాయాలా.. అనేది అంధులకు ఆప్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్ఎస్ అర్జున్‌కుమార్ వాదనలు వినిపించారు. లాంగ్వేజ్‌లు విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ముఖ్యమని.. రెండు లాంగ్వేజ్‌లు మాత్రమే చదివితే.. ముందుముందు పోటీ పరీక్షలకు, ఉద్యోగాలకు ఇబ్బందిగా మారుతుందని నివేదించారు. విద్యార్థులు ఇప్పటికే మూడు లాంగ్వేజ్‌లు చదివారని, తుది పరీక్షల్లో వారిని రెండు మాత్రమే రాయాలని ఒత్తిడి చేయడం సరి కాదని, ప్రభుత్వ జీవోను కొట్టివేయాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మూడు లాంగ్వేజ్‌లు రాసుకునే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని, వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దీంతో న్యాయమూర్తి.. తదుపరి విచారణను మార్చి 12కు వాయిదా వేశారు.

స్థాయికి మించి కవిత విమర్శలు



సాక్షి, హైదరాబాద్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల చెన్నైలో ప్రధాని మోదీపై స్థాయికి మించిన విమర్శలు చేశారని బీజేపీ తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి మండిపడ్డారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సుపరిపాలనకు చిహ్నంగా ఉన్న మోదీపై, ఎన్డీఏ సర్కార్‌పై కవిత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు తెలిపారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో పీకల్లోతు మునిగిపోయిన ఆమెకు.. పచ్చ కామెర్ల రోగిలా లోకమంతా పచ్చగానే కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ ఓడిపోతుందని కవిత పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. 1200 మంది అమరవీరుల బలిదానాలను కల్వకుంట్ల కుటుంబం అపహాస్యం చేసి, అవినీతిని సర్వవ్యాప్తం చేసి ప్రజా తెలంగాణకు తూట్లు పొడిచిందని ధ్వజమెత్తారు.

ఆదర్శ రైతు ఇంట.. 'ఆర్గానిక్' పెళ్లంట

తళుకుబెళుకులు, ప్లాస్టిక్‌కు దూరంగా వివాహ తంతు

- ఫంక్షన్ హాల్ బదులు ఇంటి వద్దే కుమారుడి పెళ్లి
- అరిటాకులు, కొబ్బరాకులతో మండపం ముస్తాబు
- సొంత పొలంలో పండించిన సేంద్రియ కాయగూరలతో అతిథులకు విందు భోజనం
- ఖమ్మం జిల్లాకు చెందిన రైతు రామారావు ఆదర్శం



తాటాకులు, కొబ్బరిబోండాలు, అరటికాయలతో సిద్ధం చేసిన మండపం



వివిధ ప్రాంతాల ఆదర్శ రైతులతో వధూవరులు

నేటి ఆధునిక కాలంలో పెళ్లిళ్ల తంతు అంతా కృత్రిమమే... ఫంక్షన్ హాళ్లు, సెట్టింగ్‌లు మొదలు పందిళ్లు, తోరణాలు, చివరకు గ్లాసులు, విస్తళ్ల వరకు అన్నీ ప్లాస్టిక్‌మయమే... కానీ ఆ ఇంట మాత్రం కొబ్బరాకులు, అరిటాకులు, అరటికాయలు, పూలతో తయారు చేసిన పెళ్లి మండపం.. పింగాణి ప్లేట్ల స్థానంలో మోదుగు, అడ్డాకుల ప్లేట్లలో భోజనం, కూల్‌డ్రింక్‌ల స్థానంలో చెరకు, ద్రాక్ష రసం.. చికెన్, మటన్ బదులు సేంద్రియ ఎరువులతో పండించిన కాయగూరల భోజనం.. ఇదీ ఓ ఆదర్శ రైతు ఇంట జరిగిన 'ఆర్గానిక్' వివాహం. ఒంటికి ఆరోగ్యం, కంటికి ఆహ్లాదం కలిగేలా నిర్వహించిన ఈ వివాహం ప్రత్యేకంగా నిలవడమే కాక ఆ రైతుకు ప్రకృతిపై ఉన్న ప్రేమను చాటిచెప్పింది.

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కోయచెలక గ్రామానికి చెందిన ఆదర్శ రైతు చెరుకూరి రామారావు తన కుమారుడు కిరణ్ వివాహాన్ని సైతం అందరికీ ఆదర్శంగా నిర్వహించాడు. పెళ్లి ప్రక్రియలో ఆసాంతం ప్రకృతికి పెద్దపీట వేశాడు. రామారావుకు తల్లిదండ్రులు రంగమ్మ, సత్యం, భార్య రమణతోపాటు ఇద్దరు కుమారులు కిరణ్, సురేశ్ ఉన్నారు. పెద్ద కుమారుడు కిరణ్ కోయంబత్తూరులో మెకానికల్ ఇంజనీరింగ్ చేసి నాలుగేళ్లుగా ఖమ్మంలో ఆర్గానిక్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. ఆయన వివాహం బంధువుల అమ్మాయి ఉదయశ్రీతో నిశ్చయమైంది. శుక్రవారం జరిగిన ఈ వివాహాన్ని మధురమైన జ్ఞాపకంగా చేసుకోవడంతోపాటు ఆశీర్వదించడానికి వచ్చిన అతిథులకు మంచి ఆహారం అందించాలని రైతు రామారావు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఎక్కడా ప్లాస్టిక్ వాడకుండా, ఫంక్షన్ హాల్‌లో కాకుండా ఇంట్లోనే పెళ్లి చేశాడు. పెళ్లి మండపాన్ని జమ్మిగడ్డి, కొబ్బరికాయలు, అరటిగెలలు, పూలతో చూపరులను ఆకట్టుకునేలా అలంకరించారు. భోజనాలకు బెంగళూరు నుంచి అడ్డాకు ప్లేట్లు, ఇతర ప్రాంతాల నుంచి మోదుగు ఆకు ప్లేట్లు తెప్పించారు. ఇక వంటలకు తమ పొలంలో ఎటువంటి రసాయన ఎరువులను వాడకుండా పండించిన కూరగాయలనే వాడారు. వంటకాల కోసం చెక్కగానుగ నూనె, రాక్ సాల్ట్, దేశీయ స్వచ్ఛమైన దేశీ ఆవు నెయ్యి, సహజంగా తయారు చేసిన బెల్లం, పెనగంచిప్రోలు నుంచి ఎండుమిర్చి కారం, ఏలూరు నుంచి కొబ్బరిబోండాలు, అరటిగెలలు, దమ్మపేట నుంచి కొబ్బరి మొక్కలు తెప్పించారు.

ఇంటికి తాళం వేయొద్దని..



ఫంక్షన్‌హాల్‌లో వివాహం చేసుకుంటే హడావుడి తప్ప ఆనందం ఉండదు. అదే ఇంటి వద్ద అయితే రెండు, మూడు రోజులు ఇల్లంతా సందడిగా ఉంటుంది. ఇక ఫంక్షన్ హాల్‌లో పెళ్లయితే ఇంటికి తాళం వేసి అంతా వెళ్లాలి. అలా చేయడం నాకు, మా నాన్నకు ఇష్టం లేదు. అందుకే ఇంటి వద్ద వివాహం చేసుకున్నా.

– చెరుకూరి కిరణ్, పెళ్లి కుమారుడు

ప్రకృతికి విరుద్ధంగా ఉండొద్దనే..



ప్రకృతి మనకు ఎన్నో ఇచ్చింది. అలాంటి ప్రకృతికి విరుద్ధంగా వ్యవహరించొద్దనే ఉద్దేశంతోనే పెళ్లి ప్రక్రియలో ఎక్కడా ప్లాస్టిక్‌ను వాడలేదు. అతిథులు మరిచిపోలేని విధంగా సేంద్రియ ఆహారం వడ్డించాం.

– చెరుకూరి రామారావు, ఆదర్శ రైతు

పెళ్లి వంటకాలు ఇవే..

పెళ్లిలో మాంసాహారానికి బదులు ముద్దపప్పు, నెయ్యి, వడియాల చారు, గోంగూర పచ్చడి, నాటుదోసకాయ పచ్చడి, వంకాయ, నాటు చిక్కుడుకాయ కూరలు, మష్రూమ్ ధమ్ బిర్యానీ, ఖద్దూకా ఖీర్, చెరుకు రసం, ద్రాక్ష జ్యూస్ ఏర్పాటు చేశారు. ఈ వివాహానికి బంధువులతోపాటు వ్యవసాయ శాస్త్రవేత్త పురుషోత్తం, ఏలూరు, అనంతపురం, జహీరాబాద్, చిక్‌బళ్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి 300 మంది ఆదర్శ రైతులు, కేవీకే, జేడీఏ, హార్టికల్చర్ అధికారులను ఆహ్వానించారు. వారంతా నూతన వధూవరులను ఆశీర్వదించారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

సాంకేతికతపై పట్టుండాలి

▶ మొదటి పేజీ తరువాయి

హోం మంత్రి మాట్లాడుతూ, గత ఎనిమిదేళ్లలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని, నక్సలిజాన్ని కట్టడి చేయడం.. జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతల సమస్యలను సమర్థంగా ఎదుర్కొన్నామన్నారు. 2047లో భారత దేశం వందవ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోబోతోందని, ఈ అమృతకాలంలో విధుల్లోకి వస్తున్న యువ అధికారులంతా దేశాన్ని పటిష్టంగా తీర్చిదిద్దడంలో తమవంతు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. గత ఏడు దశాబ్దాలలో దేశం అంతర్గత భద్రతలో అనేక సవాళ్లను ఎదుర్కొందన్నారు. ఈ కాలంలో 36,000 మంది పోలీసు సిబ్బంది దేశం కోసం తమ ప్రాణాలను అర్పించారన్నారు. యువపోలీసు అధికారులంతా అమరుల స్ఫూర్తితో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలని అన్నారు. సామాన్యుడి హక్కులను కాపాడటమే పోలీసింగ్‌కు నిజమైన అర్థం అని.. దీనిని ప్రతి యువ అధికారి గుర్తించాలని చెప్పారు.

అకాడమీ డైరెక్టర్ ఏఎస్ రాజన్ మాట్లాడుతూ, అకాడమీలో అందించిన అత్యుత్తమ శిక్షణ ఐపీఎస్ అధికారుల వృత్తి జీవితంలో ఉపయోగపడుతుందని తాను భావిస్తున్నట్టు తెలిపారు. పరేడ్ కమాండర్ షెహన్‌షా నాయకత్వంలో ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు నిర్వహించిన పరేడ్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్‌భల్లా, కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డేకా, డీజీపీ అంజనీకుమార్, ఇతర ఉన్నతాధికారులు, ట్రైనీ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తండ్రీ కొడుకుల ప్రభుత్వాన్ని సాగనంపుదాం

- అబద్ధాల్లో వారికి నోబెల్ బహుమతి వస్తుంది
- రెండు సార్లు అధికారం ఇచ్చినా కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బౌద్ధనగర్: రాష్ట్రంలో తండ్రీ కొడుకుల కుటుంబ ప్రభుత్వాన్ని సాగనంపి బీజేపీ ఆధ్వర్యంలో నిజమైన ప్రజాస్వామ్య బంగారు తెలంగాణా సాధించుకునే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం వారాసీగూడ చౌరస్తాలో ప్రజాగోస, బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. 1200 మంది ప్రాణ త్యాగాలు చేసి తెలంగాణా రాష్ట్రాన్ని సాధించుకుంటే అది కల్వకుంట్ల కుటుంబం పాలైందన్నారు. ఉదయం లేచింది మొదలు తండ్రీ కొడుకులు అబద్ధాలతో పాలన సాగిస్తున్నారని, అబద్ధాల్లో తండ్రీ కొడుకులకు నోబెల్ బహుమతి వస్తుందని ఎద్దేవా చేశారు. రెండు సార్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే తొమ్మిదేళ్లలో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోయారని, పింఛన్లు, రేషన్ కార్డులు కూడా ఇవ్వలేక పోయారని ఆయన విమర్శించారు. రాష్ట్రానికి 80 శాతం నిధులను అందిస్తున్న హైదరాబాద్ నగరంలోనే రోడ్లు, డ్రైనేజీ పరిస్థితి ఘోరంగా ఉందని, తాగేందుకు మంచినీళ్లు అందించలేని దుస్థితి ఉందన్నారు. ఏపీలో మోదీ ప్రభుత్వం 30 లక్షల ఇళ్ల నిర్మాణం చేసిందని, ఇక్కడ కడతామని అడిగితే రేపు, మాపు అంటూ దాటవేస్తూ వస్తున్నారని విమర్శించారు. పేద ప్రజలకు ఇళ్లు కట్టించకపోగా వేల కోట్ల దోపిడీ చేసిన డబ్బుతో విమానాలు కొంటున్నారని, ఆ డబ్బును బీఆర్ఎస్ పేరుతో అన్ని రాష్ట్రాల్లో పంచుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్, జిల్లా పరిశీలకులు నామోజీ, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వ్యవహారాల ఉపకమిటీలో ఉత్తమ్‌కు చోటు

- ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ప్లీనరీకి పలు కమిటీల ఏర్పాటు
- ముసాయిదా కమిటీలో రఘువీరారెడ్డి, కొప్పుల రాజుకు అవకాశం
- ఈ నెల 24 నుంచి 3 రోజులపాటు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ 85వ ప్లీనరీ



సాక్షి, న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ వేదికగా ఈ నెల 24 నుంచి మూడు రోజులపాటు జరగనున్న ఆలిండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) 85 వప్లీనరీ సమావేశాలకు ముసాయిదా కమిటీతో పాటు వివిధ అంశాల్లో ఉపకమిటీలను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజకీయ వ్యవహారాల ఉపకమిటీకి చైర్మన్‌గా వీరప్పమొయిలీ, కన్వీనర్‌గా అశోక్ చవాన్‌తోపాటు 20 మంది సభ్యులు ఉన్నారు. ఈ కమిటీలో ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డితోపాటు మాణిక్యం ఠాగూర్‌కు చోటుకల్పించారు. ముసాయిదా కమిటీ చైర్మన్‌గా జైరాం రమేశ్, కన్వీనర్‌గా పవన్ ఖేరాతోపాటు మరో 21 మంది సభ్యులు ఉన్నారు. కాగా, ఇందులో ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డితోపాటు సీనియర్ నేత కొప్పుల రాజుకు అవకాశం కల్పించారు. ఆర్థిక వ్యవహారాల ఉపకమిటీకి చైర్మన్‌గా చిదంబరం, కన్వీనర్‌గా గౌరవ్ వల్లభ్‌తోపాటు 14 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో సంజీవరెడ్డి, జేడీ శీలంకు అవకాశం ఇచ్చారు. అంతర్జాతీయ వ్యవహారాల ఉపకమిటీకి చైర్మన్‌గా సల్మాన్ ఖుర్షీద్, కన్వీనర్‌గా శశిథరూర్‌తోపాటు 11 మంది సభ్యులు ఉన్నారు. కేంద్ర మాజీమంత్రి పల్లంరాజుకు ఈ కమిటీలో చోటు కల్పించారు. రైతులు–వ్యవసాయ వ్యవహారాల ఉపకమిటీకి చైర్మన్‌గా భూపేందర్ సింగ్ హుడా, కన్వీనర్‌గా రఘువీరారెడ్డితోపాటు 14 మంది సభ్యులు ఉన్నారు. సామాజిక న్యాయం సాధికారత వ్యవహారాల ఉపకమిటీకి చైర్మన్‌గా ముకుల్ వాస్నిక్, కన్వీనర్‌గా కొప్పుల రాజుతో పాటు 16 మంది సభ్యులు ఉన్నారు.

త్వరలో హైదరాబాద్‌లో నీరా కేఫ్: మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కల్లు గీత కార్మికుల సంప్రదాయక జీవనోపాధిని పెంపొందించడంతో పాటు ఆరోగ్య పానీయాన్ని హైదరాబాద్ వాసులకు అందించేందుకు నీరా పాలసీని తీసుకొస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆల్కహాల్ లేని నీరాను దాని ఉప ఉత్పత్తులను శుద్ధి చేసి హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో నీరా కేఫ్ ద్వారా విక్రయించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శాసన సభలో సభ్యులు ప్రకాశ్‌గౌడ్, ఆత్రం సక్కు, మెతుకు ఆనంద్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానంగా ఆయన మాట్లాడుతూ...రూ.12.20 కోట్లతో నీరా కేఫ్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. రోమ్‌నగరానికి చెందిన రచయిత కొన్ని శతాబ్దాల క్రితమే ఈ సంప్రదాయ చెట్లకు సంబంధించి రాసిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రదర్శించారు. త్వరలోనే నూతన క్రీడా విధానాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 12,076 క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వికారాబాద్ అనంతగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి లేదు: వేముల



సాక్షి, హైదరాబాద్: వాణిజ్య పన్నులు, పశుసంవర్థక శాఖ, పాడిపరిశ్రమ, మత్స్య శాఖ తదితర శాఖలకు సంబంధించి బడ్జెట్ బిల్లులపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతున్న సమయంలో ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ సభ్యులు సభలో లేకపోవడంపై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కలుగజేసుకున్నారు. ప్రజా సమస్యల పట్ల ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి లేదని, అందుకే కీలక శాఖలపై చర్చ జరుగుతున్నా.. ఒక్క సభ్యుడు కూడా సభలో లేరని ఆయన తప్పుబట్టారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని వేముల స్పీకర్‌ను కోరారు. సభలో వారికి సమయం ఇచ్చినప్పుడు రాజకీయాలు మాట్లాడి వెళ్లి పోతున్నారని, ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించి పొరపాట్లుంటే చూపాలని, సలహాలు, సూచనలివ్వాలని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల సభ్యులను పిలిచి మాట్లాడాలని వేముల స్పీకర్‌కు విన్నవించారు.

చేనేత రంగానికి చేయూత ఉత్తిదే: ఆలె భాస్కర్



సాక్షి, హైదరాబాద్: మంత్రి కేటీఆర్ చేనేత రంగానికి ఎన్నో ఇస్తున్నట్లు చెప్పినవన్నీ అసత్యాలేనని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్ విమర్శించారు. తెలంగాణ ఏర్పడ్డాక 9 ఏళ్లలో ఎన్నడూ చేనేత రంగం ఇంతగా నష్టపోలేదన్నారు. శనివారం భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రం చేనేత దినోత్సవం నిర్వహించి గుర్తింపు తీసుకొస్తే, రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన చేనేత మిత్ర వట్టి బూటకమని విమర్శించారు. ఈ స్కీమ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి ఒక్కసారి 40% సబ్సిడీ ఇస్తే.. కేంద్రం ప్రతి 45 రోజులకు 15% సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. టెస్కోను నిర్వీర్యం చేసిన ఘనత కేటీఆర్‌దేనన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదో, కార్పొరేషన్‌కు నిధులు ఎందుకు కేటాయించడం లేదో చెప్పాలని భాస్కర్ డిమాండ్ చేశారు.

పోడు పట్టాలు ఇవ్వకుంటే చెట్టుకు కట్టేయండి

ప్రజలు కాంగ్రెస్ వెంట ఉన్నారని సీఎంకు భయం: రేవంత్‌రెడ్డి

- అందుకే పోడు భూముల అంశం ముందుకు తెచ్చారు
- కాంగ్రెస్ సభలకు వెళితే పట్టాలు ఇవ్వబోమంటూ బెదిరిస్తున్నారు
- మా పార్టీ అధికారంలోకి వస్తే అర్హులందరికీ పోడు పట్టాలిస్తామని వెల్లడి
- ఇల్లెందులో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడిన టీపీసీసీ చీఫ్



జవహర్ ఖని గని వద్ద తట్టా, చెమ్మస్‌తో రేవంత్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా ఓట్లు అడగడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వస్తే చెట్లకు కట్టేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు కాంగ్రెస్ వెంట ఉన్నారనే భయం సీఎం కేసీఆర్‌కు పట్టుకుందని.. అందుకే ఇప్పుడు 11.5 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు జారీ చేస్తామని మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. 'హాథ్‌సే హాథ్ జోడో'యాత్రలో భాగంగా శనివారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు జగదాంబ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. అధికారం చేపట్టిన తొమ్మిదేళ్లలో పోడు రైతులు, ఆదివాసీలపై దాడులు చేయడం తప్ప పట్టాలు ఇచ్చే విషయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. పోడు భూముల అంశంపై అసెంబ్లీలో ఎమ్మెల్యే సీతక్క మాట్లాడితే.. ఆదివాసీ మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా కేసీఆర్ ఆమెపైకి దూసుకొస్తూ రంకెలు వేశారని వ్యాఖ్యానించారు. పోడు సాగుచేస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నామే తప్ప.. ఫాంహౌజ్ భూములు, బ్యాంకులోని డబ్బులు రాసి ఇవ్వాలని ఏమీ అడగటం లేదని పేర్కొన్నారు.

ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలి

మాయమాటలు చెప్పడంలో, ప్రజలను మోసం చేయడంలో సీఎం కేసీఆర్‌ను మించిన వారు ఎవరూ లేరని రేవంత్‌రెడ్డి విమర్శించారు. వాల్మీకి బోయ వర్గానికి చెందిన గట్టు భీముడికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ఆశ చూపి, చివరికి ఎగ్గొట్టారని ఆరోపించారు. వాల్మీకి బోయతోపాటు మరికొన్ని కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. రిజర్వేషన్ల పెంపు, కొత్త కులాల చేర్పు వంటి అంశాలను కేంద్రం మీద నెట్టేస్తూ తప్పు కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.

సింగరేణిలో అవినీతిపై విచారణ చేస్తాం

కాంగ్రెస్ సభలకు వెళ్తున్న వారికి పోడు పట్టాలు ఇవ్వబోమంటూ ప్రభుత్వం బెదిరింపులకు గురిచేస్తోందని రేవంత్ ఆరోపించారు. జవహర్‌ఖని గనిని సందర్శించిన రేవంత్‌రెడ్డి కార్మికులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సింగరేణిలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేయిస్తామని.. సింగరేణి సీఎండీ శ్రీధర్, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కవితపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అర్హులందరికీ పోడు పట్టాలిస్తాం

2024 జనవరిలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. ఆ వెంటనే అర్హులైన అందరికీ పోడు పట్టాలు జారీ చేస్తామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆహార, వాణిజ్య పంటన్నింటికీ గిట్టుబాటు ధర కల్పిస్తామని, రూ.5 లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తామని ప్రకటించారు. రూ.ఐదువేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రూ.800 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిల విడుదల, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ హామీలు ఇచ్చారు.

త్వరలో లాల్‌దర్వాజా ఆలయ విస్తరణ పనులు



మాట్లాడుతున్న మంత్రి తలసాని, చిత్రంలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్

చాంద్రాయణగుట్ట: చారిత్రక లాల్‌దార్వాజా సింహవాహిని మహంకాళి ఆలయాన్ని త్వరలోనే విస్తరిస్తామని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ మేరకు మజ్లిస్ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ, మలక్‌పేట ఎమ్మెల్యే బలాలతో కలిసి శనివారం అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలో భాగంగా ఆలయాన్ని 1100 గజాల విస్తీర్ణంలో రూ.9 కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు.

గ్రూప్‌–1 మెయిన్స్ ఎంపిక నిష్పత్తిపై పరిశీలన..

హోం మంత్రి మహమూద్ అలీ



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలన్న శాసనసభ సభ్యుల సూచనను పరిశీలించి టీఎస్‌పీఎస్సీకి ప్రతిపాదిస్తామని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శనివారం బిల్లులపై చర్చలో ఆయన మాట్లాడారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క లేవనెత్తిన అంశంపై ఆయన స్పందిస్తూ గ్రూప్–1 మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో టీఎస్‌పీఎస్సీ అభ్యర్థులను ఎంపిక చేసిందని వివరించారు. నిష్పత్తిలో మార్పులు చేసి 1:100గా ఎంపిక చేయాలన్న సభ్యుల సూచనను పరిశీలించి టీఎస్‌పీఎస్సీకి సూచిస్తామని తెలిపారు. కొత్త స్టేషన్ల ఏర్పాటు, కొత్త భవనాలపై సభ్యులు సూచనలు చేయగా..చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.



తక్కువలోనే అతి ఎక్కువ సంతృప్తిని పొందే వ్యక్తి లోకంలోనే అత్యంత సంపన్నుడు.
– బౌద్ధ ధర్మం

అధికారం కోసం ఎంతకైనా తెగించడం... ఎవరితోనైనా చేతులు కలపటం చంద్రబాబు నైజం. సొంత మామ ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చినపుడు గానీ... ఆగర్భ శత్రువైన కాంగ్రెస్‌తో గత ఎన్నికల్లో జతకట్టడం కానీ ఈ నైజానికి ఓ రెండు మేలిమి ఉదాహరణలు మాత్రమే. వంగవీటి రంగాను పట్టపగలు నడిరోడ్డుపై హతమార్చిన నారాసుర రక్త చరిత్ర ఎవరికి తెలియదని? టీడీపీలో ఈయనకు పోటీగా ఎదిగిన ప్రతి నాయకుడూ... రోడ్డు ప్రమాదం లోనో, నక్సల్స్ చేతుల్లోనో ప్రాణాలు కోల్పోయారంటే ఆ రక్తపు మరకలకు కారకులెవరో తెలియదా?

అలాంటి చంద్రబాబు... మాటకు కట్టుబడే... మనుషులకు అత్యంత విలువిచ్చే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సైతం తన రక్తపు చేతులు అంటించే ప్రయత్నం చేస్తున్నారు. వివేకా హత్యకేసుకు సంబంధించి 'జగనాసుర రక్త చరిత్ర' అంటూ తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన పుస్తకం ఈ కోవలోనిదే!!. మొదటి నుంచీ సీబీఐ దర్యాప్తు ఎలా సాగాలో తన రాతలతో చెబుతున్న ఎల్లో మీడియా... షరా మామూలుగా ఈ టీడీపీ కరపత్రాన్ని కూడా పతాక శీర్షికల్లో అచ్చేసింది. కానీ ఈ కేసులో చంద్రబాబు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు చాలానే ఉన్నాయి. మరి ఆయన గానీ... ఆయన తరఫున రామోజీరావు గానీ వాటికి సమాధానం చెబుతారా?

వివేకా పీఏ కృష్ణారెడ్డికి అక్కడో లేఖ దొరికింది. డ్రైవర్ తనను తీవ్రంగా కొట్టాడంటూ వివేకా రాసిన లేఖను, ఆయన ఫోన్‌ను... కృష్ణారెడ్డి ఎవ్వరికీ ఇవ్వలేదు. వివేక కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర రెడ్డి ఆదేశాలతోనే లేఖను దాచిపెట్టారు. ముందే లేఖ ఇస్తే అది సహజ మరణం కాదని తెలిసి ఎవ్వరూ మృత దేహాన్ని తాకేవారే కాదు. ఆ లేఖ తన తండ్రి రాసిందేనని సాక్షాత్తూ డీఐజీకి సునీత చెప్పారు. ఆ లేఖను ముందే ఇవ్వకపోవటంపై గానీ... వాట్సాప్ మెసేజీలతో సహా ఫోన్లో సగం డేటాను డిలీట్ చేయటంపై గానీ ఎందుకు ప్రశ్నించటం లేదు? ఆ లేఖను దాచిపెట్టిన కృష్ణారెడ్డిని సిట్ అరెస్ట్ చేసింది. కానీ ఆ లేఖ దాచిపెట్టమన్న వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదు?

వైఎస్ వివేకాను గొడ్డలితో నరికి హత్య చేశానని నిందితుడు దస్తగిరి అంగీకరించాడు. కానీ తనను ఈ కేసులో అప్రూవర్‌గా చేసుకుని... తనచేత వేరేవాళ్ల పేర్లు చెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారెందుకు? దస్తగిరి బెయిల్ పిటిషన్‌ను సీబీఐ వ్యతిరేకించకపోవడమేంటి? హత్య చేసిన వ్యక్తి జైల్లో కాకుండా... దర్జాగా బయట తిరుగుతున్నాడెందుకు?



నారాసుర రక్తచరిత్రలో ప్రతిపేజీ హత్యలు, కుట్రలే...

1

వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు అధికారంలో ఉన్నది చంద్రబాబు నాయుడే కదా? అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేసినా చంద్రబాబు నో చెప్పారెందుకు? 'సిట్'తో సరిపెట్టారెందుకు?

2

ముఖ్యమంత్రి కుటుంబానికి ఎంపీ అవినాశ్ నుంచి అర్ధరాత్రే ఫోన్ వెళ్లినట్లు తెలుగుదేశం ఓ అభూత కల్పనను సృష్టించింది. ఎవరు చెప్పారిది? సీబీఐ కూడా చెప్పలేదుగా? పోనీ... అప్పుడు అధికారంలో ఉన్నది మీరే కదా? దీన్ని నిరూపించే కాల్ డేటాను చూపించగలరా? ఉదయం 6.10కి వివేకా పనిమనిషి ఇంటి తలుపు తీసేదాకా ఆయన మృతి గురించి ఎవ్వరికీ తెలియదన్నది పచ్చి నిజం కాదా? ఆమె చెప్పాకే బంధువులకు, బయటి ప్రపంచానికి తెలిసిందన్నది వాస్తవం కాదా?

3

అవినాశ్‌రెడ్డి అప్పటికే ఎంపీ. కడప లోక్‌సభ ఇన్‌చార్జి కూడా. వివేకానంద రెడ్డిని జమ్మలమడుగు అసెంబ్లీ ఇన్‌చార్జిగా ప్రకటించారు జగన్. ఎన్నికల షెడ్యూలు వెలువడటంతో అవినాశ్ గెలుపు కోసం వివేకా ప్రచారాన్ని ప్రారంభించారు. ముందురోజు రాత్రి జమ్మలమడుగులో ప్రచారం చేశారు కూడా. అలాంటిది ఎంపీ సీటు కోసం ఆయనపై కుట్ర పన్నాల్సిన అవసరం అవినాశ్‌కు ఎందుకుంటుంది?

4

మార్చి 15, 2019న ఉదయాన్నే జమ్మలమడుగు ప్రచారానికి వెళుతుండగా అవినాశ్‌కు వివేకా బావమరిది శివప్రకాశ్‌రెడ్డి ఫోన్ చేసి వివేకా మరణించినట్లు చెప్పటంతో ఆయన హడావుడిగా అక్కడకు చేరుకున్నారు. ఆ ఫోన్ రాకపోయి ఉంటే ఆయన వచ్చి ఉండేవారే కాదు. వచ్చిన వెంటనే ఆయన విషయం తెలుసుకుని మొదట సీఐకి ఫోన్ చేశారు. అప్పుడున్నది తెలుగుదేశం సర్కారు. సీఐ కూడా టీడీపీ నేతలు కోరి తెచ్చుకున్న వ్యక్తి. అలాంటిది సీఐకి ఫోన్ చేశాక.. బంధువులకు ఫోన్లు చేశారు అవినాశ్‌రెడ్డి. ఇందులో ఆయన చేసిన తప్పేంటి?

బాబూ.. జవాబుందా?

- అవినాశ్ ఫోన్ కాల్స్‌పై ఎందుకీ అభూత కల్పనలు?
- అర్ధరాత్రి ఫోన్ చేసినట్లు రుజువులు చూపించగలరా?
- అప్పట్లో మీరే సీఎం... పోనీ కాల్ డేటా బయటపెట్టండి?
- సీబీఐ సైతం చెప్పని అంశాలతో ఎందుకీ రాజకీయ దిగజారుడు?
- ఆ రోజు చంద్రబాబు– ఏబీ వెంకటేశ్వరరావు మధ్య ఏం జరిగింది?
- స్థానిక పోలీసులతో నిరంతరం టచ్‌లో ఉంటూ ఏబీ చేసిందేంటి?
- వివేకాకు ఎమ్మెల్సీగా జగన్ అవకాశమిస్తే కుట్రపన్ని ఓడించింది టీడీపీయే
- స్థానిక నేతల్ని ప్రలోభపెట్టి వివేకాపై గెలిచింది బీటెక్ రవి
- అలాంటి బీటెక్ రవితో హత్య జరిగినప్పటి నుంచీ వివేకా కుమార్తె, అల్లుడికి సాన్నిహిత్యం
- నరికి చంపింది నేనే... అని చెప్పిన నిందితుడు దస్తగిరి దర్జాగా బయట
- అప్రూవర్‌గా మార్చుకుని, వేరే వాళ్ల పేర్లు చెప్పించేందుకు సీబీఐ ప్రయత్నం
- వివేకా ఫోన్లో కావాల్సిన సమాచారాన్ని డిలీట్ చేసి... కొంతే ఉంచిన తీరు
- మరణించే ముందు లేఖ రాసిన వివేకా... దాన్ని ధ్రువీకరించిన సునీత
- తామొచ్చే వరకూ ఆ లేఖను ఎవరికీ ఇవ్వవద్దని పీఏ కృష్ణారెడ్డికి చెప్పిన సునీత
- ఈ విషయాన్ని ఆమె డీఐజీకి చెప్పినట్లు స్వయంగా వెల్లడించిన ఎస్పీ
- ఈ కోణాలన్నీ వదిలి... ముఖ్యమంత్రిని అప్రదిష్ట పాలు చేసేందుకు బాబు కుట్ర

ఈ కేసులో దర్యాప్తును మొదటి నుంచీ నడిపిస్తున్నది ఎల్లో మీడియానే. పోలీసులు, సీబీఐ ఏం చేయాలో కూడా ఎల్లో మీడియానే చెబుతోంది. అప్పట్లో టీడీపీ అధికారంలో ఉంది కాబట్టి... వివేకా అనుచరులే డబ్బు లావాదేవీల్లో భాగంగా ఆయన్ను హతమార్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తం చేసింది 'ఈనాడు'. ఇప్పుడు చంద్రబాబు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి ప్లేటు ఫిరాయించింది. బాబుకు లబ్ధి కలిగేలా ఎంపీ అవినాశ్‌ను టార్గెట్ చేస్తూ కథనాలు వండి వారుస్తోంది. వీరి వల్ల ఈ కేసులో దర్యాప్తు ఎలా పక్కదోవ పడుతోందో వివరించే కొన్ని అంశాలివిగో...

ఏది నిజం?

హత్య జరిగిన రోజు నిరంతరం స్థానిక పోలీసులతో నాటి ఇంటలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు ఏం మాట్లాడారు? నిమిష నిమిషానికీ చంద్రబాబుతో ఏం చెప్పారు? ఈ కోణంలో చంద్రబాబును విచారించ లేదెందుకు?

1 ? అవినాశ్ రెడ్డికి వివేకా మృతి గురించి తెలిసిందెప్పుడు? ఉదయం 6.30 ప్రాంతంలో... అది కూడా వివేకానందరెడ్డి బావమరిది శివప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి చెబితేనే!!. దీంతో జమ్మలమడుగులో ఎన్నికల ప్రచారానికి వెళుతూ అవినాశ్ తిరిగి వెనక్కొచ్చారు. అప్పటికే అక్కడ జనం పోగయి ఉన్నారు. వచ్చాక విషయం తెలుసుకుని ఆయన తొలుత సీఐ శంకరయ్యకి, తరవాత కొందరు బంధువులకు ఫోన్లు చేశారు. ఏ ఫోన్ అయినా 6.30 తరవాతే. కానీ అర్ధరాత్రే ఫోన్ చేసినట్లు నిరాధార ఆరోపణలెందుకు చేస్తున్నారు? జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా ఉన్న వైఎస్ వివేకానందరెడ్డి... మార్చి 10నే ఎన్నికల షెడ్యూలు రావటంతో హత్యకు ముందురోజు రాత్రి కూడా (మార్చి 15) ఎంపీ అవినాశ్ కోసం ప్రచారం చేశారు కదా? ఇందులో అవినాశ్–వివేకా మధ్య రాజకీయ వైరుధ్యాలకు అవకాశమెక్కడుంది? మృతి గురించి శివప్రకాశ్‌రెడ్డే తనకూ చెప్పారన్నది జమ్మలమడుగు టీడీపీ నేత ఆదినారాయణ రెడ్డి మాట. గుండెపోటుతో మృతి చెందారని, సిగరెట్లు ఎక్కువ తాగటం వల్ల కావచ్చునని చెప్పినట్లు ఆదినారాయణ రెడ్డి వెల్లడించారు. మరి అందరికీ శివప్రకాశ్ రెడ్డే చెప్పినపుడు అవినాశ్‌నే ఎందుకు టార్గెట్ చేస్తున్నట్లు?

2 ? అవినాశ్‌రెడ్డి వెళ్లేసరికే అక్కడ వివేకా పీఏ కృష్ణారెడ్డితో సహా అంతా ఉన్నారు. రక్తపు మరకలతో ఉన్న లేఖ కూడా కృష్ణా రెడ్డి దగ్గరుంది. లేఖ, వివేకా ఫోన్ గురించి ఆయన కుమార్తె సునీతకు కృష్ణా రెడ్డి చెప్పారు. వాటిని వెంటనే పోలీసులకు ఇవ్వాలని చెప్పాల్సిన సునీత... తాము వచ్చేవరకూ ఎవరికీ ఇవ్వవద్దని ఎందుకు చెప్పారు? లేఖలో డ్రైవర్ తనను కొట్టాడని వివేకా స్వయంగా రాసిన విషయాన్ని ముందే బహిర్గతం చేస్తే ఎవ్వరూ మృతదేహం వద్దకు వెళ్లి ఉండే వారు కాదుగా? ఆ లేఖ తన తండ్రి రాసిందేనని సునీత కూడా సాక్షాత్తూ డీఐజీ దగ్గర ధ్రువీకరించారు. మరి ఆ లేఖలోని కోణాన్ని ఎందుకు విచారించటం లేదు? పైపెచ్చు ఫోన్లోని డేటా కూడా ఎడిటెడ్ వర్షన్ మాదిరిగా కొంత డిలీట్ అయి ఉంది. దీన్నెందుకు సీబీఐ ప్రశ్నించటం లేదు?

3 ? నవీన్ అనే వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంట్లో అటెండర్. ఇంట్లో ఎవరైనా ఫోన్ తీయనప్పుడు ఆ ఇంట్లో ఉండే డ్రైవర్‌కో, అటెండర్‌కో ఫోన్‌చేసి... మెసేజీ చెప్పమనటం ఎవరైనా చేసేదే. అవినాశ్‌రెడ్డి ఓఎస్‌డీకి ఫోన్ చేయగా ఆయన లిఫ్ట్ చేయలేదు. దీంతో నవీన్‌కు ఫోన్ చేసి మెసేజీ సమాచారం అందించమనటాన్ని సీబీఐ ఎందుకు భూతద్దంలో చూపిస్తోంది? టీడీపీ ఎందుకు దీన్ని రాజకీయం చేస్తోంది? ఉద్దేశాలు స్పష్టం కావటం లేదా?

4 ? వైఎస్ వివేకా కుమార్తెకు, ఆయన రెండో భార్యకు మధ్య విభేదాలున్నాయనేది బహిరంగ రహస్యం. వాళ్లిద్దరి మధ్య ఫోన్లో నడిచిన దారుణమైన మెసేజీలే ఇందుకు సాక్ష్యం. మరి వాటిని పూర్తిగా బయటపెట్టకుండా ఫోన్లో కొన్ని ఉంచి–కొన్ని సందేశాలను మాత్రమే ఎందుకు డిలీట్ చేశారు? ఆ విషయంపై ఎందుకు సీబీఐ ప్రశ్నించటం లేదు? వివేకానందరెడ్డికి ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరి అత్యంత సన్నిహితులు కదా? వీరికి వివేకా అల్లుడితోనూ అత్యంత సన్నిహిత సంబంధాలున్నపుడు వాళ్లనెందుకు అనుమానించడం లేదు? వాళ్లలో ఒకరిని అప్రూవర్‌గా చేసుకుని తనచేత కావాల్సిన వాళ్ల పేర్లు చెప్పించటం ఎంత దుర్మార్గం? దర్యాప్తు ఎంత పక్షపాతంతో వెళుతోందో చెప్పటానికి ఇది చాలదా?

5 ? బీటెక్ రవితో వివేకా అల్లుడు కమ్ బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఎందుకంత సాన్నిహిత్యం? కడప జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ వివేకానందరెడ్డిని కుట్రపూరితంగా ఓడించింది చంద్రబాబే కదా!. వైఎస్సార్ మరణానంతరం భార్య, కుమార్తె ఒత్తిడితో వివేకానందరెడ్డి మంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీలోనే ఉండిపోయారు. వైఎస్ విజయమ్మపై పులివెందులలో పోటీ చేశారు కూడా. అయినా సరే అనంతర పరిణామాల్లో పార్టీలోకి వస్తానంటే గౌరవాభిమానాలతో చిన్నాన్నకు స్వాగతం పలికారు వైఎస్ జగన్. కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా అవకాశమిచ్చారు. అక్కడ గెలిచే బలం వైఎస్సార్‌సీపీకే ఉంది. కానీ నాటి సీఎం చంద్రబాబు వైఎస్సార్ సీపీ ఎమ్పీటీసీ, జెడ్పీటీసీలను ప్రలోభానికి గురి చేసి వివేకాను ఓడించారు. బీటెక్ రవిని గెలిపించారు. మరి అలాంటి రవితో సునీత, నర్రెడ్డి నిరంతరం టచ్‌లో ఉండటాన్ని ఏమనుకోవాలి? బాబును ప్రశ్నించరెందుకు?

6 ? హత్య జరిగిన రోజున నిమిష నిమిషానికీ చంద్రబాబుకు సమాచారం చేరవేయాల్సిన అవసరం ఏమొచ్చింది? నాటి ఇంటిలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు పది నిమిషాల వ్యవధిలో రెండుసార్లు చంద్రబాబుకు ఫోన్లు చేసి పరిస్థితిని వివరించాల్సిన అవసరం ఏమొచ్చింది? మరి చంద్రబాబును ఎందుకు విచారించకూడదు? బాబు కాల్ రికార్డులు, ఏబీవీ కాల్ రికార్డులు పరిశీలించి దర్యాప్తు చేయాలి కదా? చంద్రబాబు నాయుడు కుట్ర పన్ని... ఒక పద్ధతి ప్రకారం ఇదంతా చేయించారని స్పష్టం కావటం లేదా? మరి వాళ్లనెందుకు విచారించటం లేదు?

7 ? ఎన్నికల్లో కడప ఎంపీ టికెట్ పై సందిగ్ధత ఉందనే అభూత కల్పనలతో... ప్రజలను పక్కదారి పట్టించేందుకు టీడీపీ నానా పాట్లూ పడుతోంది. కానీ వాస్తవం ఏమిటన్నదీ అందరికీ తెలుసు. 2019 ఎన్నికల్లో కడప ఎంపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందే ఖరారు చేశారు. కడప లోక్‌సభ ఇన్‌చార్జ్‌గా అవినాశ్‌ను, జమ్మలమడుగు అసెంబ్లీ ఇన్‌చార్జిగా వైఎస్ వివేకానంద రెడ్డిని నియమించారు. అవినాశ్ రెడ్డి గెలుపు కోసం వివేకా అప్పటికే ప్రచారం ప్రారంభించారు. వివేకాందరెడ్డి హత్య తరువాత ఆయన కుమార్తె వైఎస్ సునీత అదే విషయాన్ని మీడియా సమావేశంలో కూడా చెప్పారు. ఎంపీ టికెట్‌పై ఇంత స్పష్టత ఉన్న తరువాత కూడా అదేదో ఎంపీ టికెట్ కోసం వైఎస్ కుటుంబంలో పోటీ నెలకొందని అవాస్తవాలను టీడీపీ ప్రచారం చేస్తుండటాన్ని ఏమనుకోవాలి?

8 ? ఈ కేసులో అరెస్టయిన శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ సీబీఐ దర్యాప్తు తీరును తప్పుబడుతూ కోర్టులో ఓ పిటిషన్ వేశారు. వివేకాను ఎవరు హత్య చేసి ఉంటారో సహేతుక ఆధారాలతో ఆమె నివేదించారు. వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలు... రెండో భార్య కుమారుడికి ఆస్తిలో వాటా ఇస్తానని ఆయన చెప్పడంతో మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత విభేదించడాన్ని బయటపెట్టారు. అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివప్రకాశ్ రెడ్డి పాల్పడిన కుట్రలనూ వివరించారు. పులివెందులలో రాజకీయ ఆధిపత్యంపై కన్నేసిన టీడీపీ నేత బీటెక్ రవి అందుకు అడ్డుగా ఉన్న వివేకానందరెడ్డిపై కక్ష పెంచుకోవడాన్ని బయటపెట్టారు. వివేకాపై ఆర్థిక విభేదాలతో అనుచరుడు కొమ్మారెడ్డి పరమేశ్వరరెడ్డి... రాజకీయ విభేదాలతో తాడిపత్రి నేత రాజేశ్వరరెడ్డి ఎలా కక్ష పెంచుకున్నారో వివరించారు. వీరందరి పాత్రపై దర్యాప్తు జరపాలని కోరారు. కానీ ఎల్లో మీడియా పర్యవేక్షణలో సాగుతున్న సీబీఐ దర్యాప్తు ఈ కీలకాంశాల దిశగా మాత్రం సాగటమే లేదు!!.



చంద్రబాబూ నిరాధార ఆరోపణలు కట్టిపెట్టు... ఇవిగో నిజాలు...

అవాస్తవ ఆరోపణలతో టీడీపీ విడుదల చేసిన పుస్తకం పూర్తిగా కట్టుకథల పుట్టని ఇట్టే తేలిపోయింది. ఆ పుస్తకంలో టీడీపీ చేసిన నిరాధార ఆరోపణలకు సమాధానాలు ఇవిగో...

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును విచారిస్తోంది సీబీఐనా...!? చంద్రబాబా..!?

వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన రాత్రి 3గంటలకు ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వైఎస్ భారతి పీఏ నవీన్‌కు ఎందుకు ఫోన్ చేశారని టీడీపీ ఓ అవాస్తవ విషయాన్ని ప్రచారంలోకి తేవడం విడ్డూరంగా ఉంది. అసలు ఆ రోజు రాత్రి 3గంటలకు ఎంపీ అవినాశ్ రెడ్డి నవీన్‌కు ఫోన్ చేశారని ఎవరు చెప్పారు చంద్రబాబూ...? ఎంపీ అవినాశ్ రెడ్డి కాల్ డేటా మీ దగ్గర ఉందా... ఉంటే మీ పుస్తకంలో ఎందుకు ప్రచురించలేదు? ఎందుకంటే వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన అర్ధ రాత్రి 3గంటల సమయంలో వైఎస్ అవినాశ్‌రెడ్డి ఎవరికీ ఫోన్ చేయనే లేదు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకు గురైనప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది టీడీపీ ప్రభుత్వం. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, అప్పటి రాష్ట్ర ఇంటలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావే ఈ కేసు దర్యాప్తును స్వయంగా పర్యవేక్షించారు. మరి అప్పుడు ఏబీ వెంకటేశ్వరరావు ఆ కేసు రికార్డులన్నీ కూడా కరకట్ట మీదున్న చంద్రబాబు నివాసానికి తరలించారా...?ఈ కేసులో టీడీపీ నేతల పాత్రను కప్పిపుచ్చేందుకే అలా చేశారా?

మతి భ్రమించిందా చంద్రబాబూ...!

అధికారం కోల్పోవడంతో చంద్రబాబుకు మతిభ్రమించినట్టు ఉంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య గురించి ముందు రోజు రాత్రే తెలిసినా వైఎస్ జగన్ పులివెందులకు సాయంత్రం వరకు ఎందుకు వెళ్లలేదంటూ టీడీపీ ప్రశ్నించడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనం. 2019 మార్చి 15 ఉదయం 6.10గంటలు అయినా సరే వివేకానందరెడ్డి నిద్ర లేవకపోవడంతో పీఏ కృష్ణారెడ్డి చాలాసేపు బయటే వేచి ఉన్నారు. ఆ తరువాత వాచ్‌మ్యాన్ రంగన్న, వంటమనిషి కుమారుడు ప్రకాశ్‌లతో కలసి వెనక ద్వారం నుంచి వెళ్లి చూడగా బాత్రూమ్‌లో వివేకానందరెడ్డి మృతిచెంది ఉండడాన్ని గుర్తించారు. ఆ వెంటనే హైదరాబాద్‌లో ఉన్న వివేకానందరెడ్డి భార్య, కుమార్తె, అల్లుడికి సమాచారం అందించారు. వారు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో పులివెందుల వచ్చే సరికి మధ్యాహ్నం 1గంట అయ్యింది. హైదరాబాద్‌లో ఉన్న అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన భద్రతా సిబ్బంది అనుమతించిన తరువాత రోడ్డు మార్గంలో బయలుదేరి సాయంత్రంలోపు పులివెందుల చేరుకున్నారు. కానీ ఈ అంశానికి కూడా మసిపూసి మారేడు కాయ చేయాలని చూడటం చంద్రబాబు రాజకీయ నైచ్యమే..

సీబీఐ అధికారులపై కేసు పేరిట మరో అబద్ధం

అంతఃపుర ఆదేశాలతోనే అంటే ముఖ్యమంత్రి నివాసం నుంచి వచ్చిన ఆదేశాలతోనే సీబీఐ అధికారులపై పోలీసులు కేసు నమోదు చేశారని టీడీపీ మరో నిరాధారణ ఆరోపణ చేసింది. సీబీఐ అధికారులపై పోలీసులు తమకు తాముగా కేసు నమోదు చేయలేదు. ఉదయ్‌కుమార్ అనే వ్యక్తిని సీబీఐ అధికారులు విచారణ పేరిట పదే పదే పిలిచి తీవ్రంగా కొడుతుండడంతో ఫిర్యాదుచేసినా పోలీసులు స్పందించకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీబీఐ అధికారులను ఒక్క రోజు కూడా విచారణకు పిలవనే లేదు. సీబీఐ అధికారులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఈ కేసులో స్టే మంజూరైంది. ఇక ఈ కేసు విషయంలో ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యం ఎక్కడ ఉంది?..

సీబీఐ విచారణకు సహకరిస్తున్న ప్రభుత్వం

ప్రతిపక్ష నేతగా సీబీఐ విచారణ కోరిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను సీఎం అయ్యాక ఎందుకు వద్దనుకున్నారని టీడీపీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. ఆనాడు చంద్రబాబు ప్రభుత్వంపై నమ్మకం లేకే వైఎస్ జగన్ సీబీఐ విచారణను కోరారు. తాను ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వాధినేతగా తమ పోలీసు శాఖపై ముఖ్యమంత్రి నమ్మకం ఉంచారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ నిచ్చి కేసు దర్యాప్తును వేగవంతం చేశారు.దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని హైకోర్టు తీర్పు ఇచ్చాక రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతగా పూర్తి సహకారం అందిస్తోంది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో సీబీఐని నిషేధించారు.అలాంటి చంద్రబాబు అధికారం కోల్పోగానే మళ్లీ సీబీఐపై నమ్మకం ప్రదర్శిస్తుండటం రాజకీయ అవకాశవాదమే. వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు సీబీఐ చేపట్టకూడదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించి ఉంటే ఆయన కూడా సీబీఐకి రాష్ట్రంలో నిషేధించి ఉండేవారు కదా. ఆయన అలా చేయలేదు. అంటే వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐ దర్యాప్తు చేసినా తనకు అభ్యంతరంలేదని చెప్పినట్టే కదా.

ఎంపీ టికెట్ అవినాశ్‌కే ఖరారు చేశారు బాబూ

వైఎస్ అవినాశ్ రెడ్డి ఎంపీ టికెట్ కోసమే వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేయించినట్టు సీబీఐ సందేహం వ్యక్తం చేస్తూ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసిందని ఆరోపించడం టీడీపీ కుతంత్రాలకు పరాకాష్ట. సీబీఐ అఫిడవిట్ మీరు చూశారా చంద్రబాబు..! అసలు 2019 ఎన్నికల్లో కడప ఎంపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుగానే ఖరారు చేశారు. కడప లోక్‌సభ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌గా వైఎస్ వివేకానందరెడ్డిని నియమించారు. అవినాశ్ రెడ్డి గెలుపు కోసం వివేకానందరెడ్డి అప్పటికే ప్రచారం ప్రారంభించారు కూడా. వివేకాందరెడ్డి హత్య తరువాత కూడా ఆయన కుమార్తె వైఎస్ సునీత అదే విషయాన్ని మీడియా సమావేశంలో చెప్పారు కూడా.

చార్జ్‌షీట్‌కు సీబీఐ 17 నెలల సమయం ఎందుకు తీసుకుంది?

ఈ కేసులో ఏ–1గా ఉన్న ఎర్ర గంగిరెడ్డికి బెయిల్ ఎందుకు వచ్చింది... పోలీసులు ఆయనపై చార్జ్‌షీట్ ఎందుకు వేయలేదని టీడీపీ సంధించిన ప్రశ్న హాస్యాస్పదంగా ఉంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురైనప్పటి నుంచి 75రోజులపాటు చంద్రబాబే అధికారంలో ఉన్నారు. మరి అప్పుడు ఎందుకు చార్జ్‌షీట్‌వేయలేదు? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సిట్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేసింది. నిందితులను గుజరాత్‌లోని నార్కో అనాలిసిస్ ల్యాబరేటరీకి తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించింది. కేసు దర్యాప్తు చురుగ్గా సాగుతుండగానే న్యాయస్థానం ఆదేశాలతో ఈ కేసు దర్యాప్తును 2020, జూలై 9న సీబీఐకి అప్పగించింది. సీబీఐ 2021, అక్టోబరు 26న తొలి చార్జ్‌షీట్ దాఖలు చేసింది. తొలి చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు సీబీఐ 17 నెలల సమయం తీసుకుంది. చార్జ్‌షీట్ దాఖలకు 17 నెలల సమయం తీసుకున్న సీబీఐనిగానీ ప్రధానమంత్రి నరేంద్రమోదీనిగానీ టీడీపీ ఎందుకు ప్రశ్నించడం లేదు?

వ్యక్తిగత కారణాలతోనే డిప్యుటేషన్‌పై వెళ్లిన అభిషేక్ మహంతి

చంద్రబాబు గాలిపోగేసి చేసిన మరో ఆరోపణ... ఈ కేసులో గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డిని అప్పటి కడప ఎస్పీ అభిషేక్ మహంతి విచారణకు తీసుకువెళ్తుంటే హఠాత్తుగా నవీన్ నుంచి ఫోన్ వచ్చింది...దాంతో ఆయన్ని విచారించకుండా విడిచిపెట్టారని అవాస్తవ ఆరోపణలు చేశారు. పైగా అభిషేక్ మహంతి సుదీర్ఘ సెలవుపై ఎందుకు వెళ్లారని ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. ఏమయ్యా చంద్రబాబూ... ఎస్పీ అభిషేక్ మహంతికి నవీన్ నుంచి ఫోన్ రావడం నువ్వు చూశావా...? పోనీ ఆయన కాల్ డేటా నీ దగ్గర ఉందా? ఇక అభిషేక్ మహంతి తన కుటుంబపరమైన కారణాలతోనే ఆయన తెలంగాణకు డిప్యుటేషన్ కోరుకునివెళ్లారు. అందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదన్నది రెండు రాష్ట్రాల్లోని పోలీసు శాఖలకు తెలుసు.

ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ అంశంపై టీడీపీ అసత్య ఆరోపణలు చేసింది. ఎర్రగంగిరెడ్డి వైఎస్ వివేకానందరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు అత్యంత సన్నిహితుడు. ఎర్ర గంగిరెడ్డి జైలులో ఉన్నప్పుడు కూడా వివేకానంద రెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి తరచూ ఆయన్ని కలిసేవారు. ఎర్ర గంగిరెడ్డికి న్యాయవాదులను కూడా సునీతే ఏర్పాటు చేశారు. ఆయనకు బెయిల్ రావాలని సునీత, ఆమె భర్త ఎన్.రాజశేఖరరెడ్డి కోరుకున్నారు. తీరా ఇప్పుడు ఆయనకు బెయిల్ రావడం వెనుక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హస్తముందని టీడీపీ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉంది.

రెండేళ్ల ఐదు నెలలు సస్పెన్షన్‌లోనే సీఐ శంకరయ్య

సీఐ శంకరయ్య వాంగ్మూలం ఇచ్చి వెనక్కితగ్గారని ... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసిందని టీడీపీ ఆరోపించడం విడ్డూరంగా ఉంది. తాను చెప్పని విషయాలను చెప్పినట్టుగా సీబీఐ వాంగ్మూలం నమోదు చేయడాన్ని శంకరయ్య తప్పుబట్టారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన మర్నాడే శంకరయ్య సస్పెండ్ అయ్యారు. 2019 మేలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత కూడా రెండేళ్ల ఐదు నెలలపాటు శంకరయ్య సస్పెన్షన్‌లోనే ఉన్నారు. కుటుంబ పోషణ కోసం తనకు పోస్టింగ్ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శంకరయ్యపై అభియోగాలు ఇంకా విచారణ దశలోనే ఉన్నాయి. సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగానే ఆయనపై సస్పెన్షన్‌ను ఎత్తివేసి పోస్టింగ్ ఇచ్చారు. ఆయనకు ఏమీ ప్రాధాన్యమున్న పోస్టింగ్ ఇవ్వ లేదు. దాంతో కేసు దర్యాప్తు ప్రభావితమయ్యేది ఏముంది? టీడీపీ తప్పుబట్టాల్సింది ఏముంది...?

తప్పుడు వాంగ్మూలం ఇవ్వాలని గంగాధర్‌రెడ్డిపై టీడీపీ నేతల ఒత్తిడి

వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షులు కె.శ్రీనివాసరెడ్డి, గంగాధర్ రెడ్డి అనుమానాస్పదంగా మృతిచెందారంటూ వక్రీకరిస్తూ టీడీపీ ఆరోపణలు చేయడం ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. ఈ కేసులో కె.శ్రీనివాసరెడ్డి అసలు సాక్షి కాదు. ఈ కేసు దర్యాప్తును సీబీఐ చేపట్టడానికి ముందే శ్రీనివాసరెడ్డి మృతి చెందారు. ఆయన సోదరుడు పరమేశ్వరరెడ్డి ఈ కేసులో అనుమానితుడు. అతను టీడీపీ నేత బీటెక్ రవికి సన్నిహితుడు కూడా. వివేకానందరెడ్డి హత్యకు ముందు పరమేశ్వరరెడ్డి తనకు ఎలాంటి అనారోగ్యం లేనప్పటికీ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రిలో ఉన్న అతను బయటకు వచ్చి టీడీపీ నేత బీటెక్ రవితో సమావేశమయ్యారు. వివేకానందరెడ్డి ఉన్నంతవరకు తాను పులివెందులలో పట్టు సాధించలేనని బీటెక్ రవికి తెలుసు. తాను ఎంపీగా గెలవలేనని ఆదినారాయణ రెడ్డికి తెలుసు. ఇక పరమేశ్వరరెడ్డికి వివేకానందరెడ్డితో ఆర్థిక వివాదాలు ఉన్నాయి. అందుకు బీ.టెక్ రవి, ఆదినారాయణరెడ్డి, పరమేశ్వరరెడ్డి కలసి వివేకానందరెడ్డి హత్యకు కుట్రపన్ని ఉండొచ్చని వైఎస్సార్‌సీపీ మొదటి నుంచి చెబుతోంది. ఈ విషయాలన్నీ శ్రీనివాసరెడ్డికి తెలుసు. అతను జీవించి ఉంటే బీ.టెక్ రవి, ఆదినారాయణ రెడ్డిలకే ముప్పు. అందుకే అతన్ని అంతం చేసే అవకాశం వారికే ఉంది. ఇప్పటికైనా సీబీఐ వారిని విచారించాలి. అలానే గంగాధర్ రెడ్డి మృతి విషయంలోనూ టీడీపీ అసత్య ఆరోపణలతో కేసును తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తోంది. వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా తప్పుడు వాంగ్మూలం ఇవ్వాలని వైఎస్ సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, టీడీపీ నేతలు బీటెక్ రవి, ఆదినారాయణ రెడ్డి, సీబీఐ అధికారులు తనను వేధిస్తున్నారని గంగాధర్ రెడ్డి ఆరోపించారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదుచేశారు కూడా. ఆ తరువాత అనారోగ్య కారణాలతో ఆయన మృతి చెందారు. గంగాధర్‌రెడ్డి వైఎస్ అవినాశ్‌రెడ్డికి అనుకూలంగా ఉన్నారు. ఆయన వాంగ్మూలం టీడీపీ నేతలకు వ్యతిరేకంగా ఉంది. మరి ఆయన అనుమానాస్పదంగా మృతిచెందితే...అందుకు టీడీపీ నేతలనే శంకించాల్సి ఉంటుంది కదా.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.సప్తమి తె.5.12 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి అష్టమి, **నక్షత్రం:** స్వాతి రా.10.34 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** తె.4.08 నుండి 5.43 వరకు (తెల్లవారితే సోమవారం), **దుర్ముహూర్తం:** సా.4.25 నుండి 5.11 వరకు, **అమృతఘడియలు:** ప.1.43 నుండి 3.23 వరకు.

సూర్యోదయం : 6.33
సూర్యాస్తమయం : 5.56
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

క్లుప్తంగా...

న్యాయమైన ప్యాకేజీ చెల్లించాలి



సీతమ్మసాగర్ వద్ద పనులను అడ్డుకుంటున్న నిర్వాసిత రైతులు

మణుగూరు టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని సీతమ్మసాగర్ బ్యాక్‌వాటర్‌తో నిర్వాసితులయ్యే తమకు మెరుగైన ప్యాకేజీ ప్రకటించే వరకు పనులు చేయొద్దని శనివారం పలువురు రైతులు అడ్డుకున్నారు. మండలంలోని చినరాయిగూడెం, పద్మగూడెం, కమలాపురం, అన్నారం ప్రాంతాల్లో రైతుల పంట పొలాలు సీతమ్మసాగర్ బ్యాక్ వాటర్ కింద పూర్తిగా నీట మునిగే అవకాశముంది. ఈ విషయమై సర్వే చేపట్టిన అధికారులు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్యాకేజీ చెల్లించనున్నట్లు తెలిపినా.. ప్రస్తుత ప్యాకేజీతో తమకు తీరని అన్యాయం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఈమేరకు న్యాయమైన ప్యాకేజీ చెల్లించాకే పంట పొలాల్లో పనులు చేయాలనే డిమాండ్‌తో శనివారం కరకట్ట నిర్మాణ పనులను అడ్డుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయండి





సాక్షి, హైదరాబాద్: బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పంజగుట్టలో ఏర్పాటు చేయాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు (వీహెచ్) మంత్రి కేటీఆర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలో కేటీఆర్‌ను కలిసిన ఇరువురు నేతలు విజ్ఞప్తి చేశారు. శనివారం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో వచ్చిన వీహెచ్ కొద్దిసేపు సీఎల్పీ కార్యాలయంలో కూర్చున్నారు. ఆ తర్వాత భట్టితో కలిసి కేటీఆర్ వద్దకు వెళ్లి మాట్లాడి వెళ్లిపోయారు.

'ఆ ఇద్దరినీ పిచ్చాస్పత్రిలో చేర్పించాలి'

సాక్షి, హైదరాబాద్: సచివాలయం, ప్రగతి భవనాలను పేల్చేస్తామని, కూల్చి వేస్తామని పిచ్చోళ్లలా మాట్లాడుతున్న బండి సంజయ్, రేవంత్ రెడ్డిలను తక్షణమే ఎర్రగడ్డ ఆసుపత్రిలో చేర్పించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, సుంకే రవిశంకర్, దుర్గయ్య చిన్నయ్యలు డిమాండ్ చేశారు. వారు శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఇప్పటికైనా ఇద్దరు నేతలు నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.

సర్వీసు పోలీసులకు అన్యాయం



సాక్షి, హైదరాబాద్: పోలీసు శాఖలో వివిధ పోస్టులను పదోన్నతి పొందిన వారితో నింపడం వల్ల.. సర్వీసులో ఉన్న పోలీసులకు అన్యాయం జరుగుతోందని బీజేపీ శాసనసభ్యుడు రఘునందన్‌రావు శనివారం శాసనసభ దృష్టికి తీసుకొచ్చారు. పోలీసు విభాగంలో యాగ్జిలరీ పదోన్నతుల అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని, దీనిపై అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. గతంలో జై తెలంగాణ అన్నందుకో, ఇతర కారణాలతోనో తొలగించిన 800 మంది హోంగార్డులను తిరిగి తీసుకోమంటే, కొత్తగా పోటీపడే యువకులతో సమానంగా లాంగ్‌జంప్ చేయమనడం అన్యాయమన్నారు.

అంతర్ పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దేవీందర్ శర్మ తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): జీ 20 దేశాల సదస్సుకు ఈ ఏడాది ప్రాతినిధ్యం వహిస్తున్న భారత్ ఈ సదస్సులో 'చిరుధాన్యాల అంతర్ పంటలు(కొంత ప్రాంతంలో రకరకాల ధాన్యాల సాగు)ను ప్రధాన అంశంగా తీసుకోవాలని చండీగఢ్ రాష్ట్ర ఆహార, వ్యాపార విధాన విశ్లేషకుడు దేవీందర్ శర్మ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని ఝరాసంగం మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామ శివారులో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 23వ పాత పంటల జాతర శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవీందర్‌శర్మ మాట్లాడుతూ...నాలుగు దశాబ్దాలుగా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ పాత పంటలను కాపాడుతున్నారని, ఇక్కడి రైతులు రసాయన ఎరువులు వాడకుండా చిరుధాన్యాల పంటలను సాగు చేయడం దేశానికే ఆదర్శనీయమన్నారు. పాత పంటలను కాపాడటం అంటే ప్రపంచాన్ని బ్రతికించడమే అన్నారు. ప్రధానమంత్రి నిర్వహించే 'మన్‌కీ బాత్'కార్యక్రమంలో చిరు ధాన్యాల ప్రాధాన్యం గురించి ప్రస్తావించాలని కోరారు. ఇక్కడి సాగు పద్ధతుల గురించి ప్రధానికి లేఖ పంపించాలన్నారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీడీఎస్ డైరెక్టర్ సతీశ్ పాల్గొన్నారు.

తెలంగాణ టు యూఎస్



రాష్ట్రం నుంచి ఎగుమతులు ఎక్కువగా అమెరికాకే..

మొత్తం ఎగుమతుల్లో 28 శాతం అక్కడికే..

ఫార్మా ఉత్పత్తులే ఎక్కువగా ఎగుమతి



2021-22లో రూ.2.65 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు

ఎక్స్‌పోర్ట్ ఇండెక్స్‌లో రాష్ట్రానికి 5వ స్థానం

సాక్షి, హైదరాబాద్


మన రాష్ట్రం నుంచి ఎగుమతులు ఎక్కువగా అమెరికా సంయుక్త రాష్ట్రాలకే జరుగుతున్నాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణ నుంచి ఎగుమతులు జరుగుతున్న టాప్ 10 దేశాల్లో అమెరికా, చైనా, సింగపూర్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలతో పాటు ఇటీవలే భూకంపం సంభవించి అల్లాడిపోతున్న తుర్కియే కూడా ఉండడం గమనార్హం. అయితే మొత్తం ఎగుమతుల్లో 28.13 శాతం అమెరికా సంయుక్త రాష్ట్రాలకే వెళుతున్నాయని తాజా సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడయింది. అన్నింటికంటే ఎక్కువగా ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన మొత్తం ఎగుమతుల్లో ఫార్మా రంగం వాటా 33.9 శాతం కాగా, ఆ తర్వాతి స్థానంలో ఆర్గానిక్ కెమికల్స్ (23.41 శాతం) ఉన్నాయి. ఇక, వ్యవసాయ ఉత్పత్తులైన పత్తి కూడా మన రాష్ట్రం నుంచి ఎగుమతుల జాబితాలో చోటు సాధించింది. మొత్తం ఎగుమతుల్లో పత్తి 3.72, కాఫీ, టీ ఉత్పత్తులు 2.36, ధాన్యాలు 1.81 శాతం ఉన్నాయి. ఇక ఒకప్పుడు ముత్యాల నగరంగా హైదరాబాద్ ప్రసిద్ధిగాంచగా, ముత్యాలు, ఇతర విలువైన వస్తువులు కూడా మన రాష్ట్రం నుంచి ఎగుమతి అవుతున్నాయని లెక్కలు చెబుతున్నాయి. మొత్తం ఉత్పత్తుల్లో ముత్యాల ఎగుమతి 2.07 శాతంగా నమోదయింది. నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం 2021-22 ఎక్స్‌పోర్ట్స్ ఇండెక్స్‌లో తెలంగాణ ఐదో స్థానంలో నిలిచింది. ఎగుమతుల ప్రోత్సాహక విధానాల రూపకల్పనలో మాత్రం 12వ స్థానంలో నిలిచింది.

జీఎస్‌డీపీలో 7 శాతంగా సరుకుల ఎగుమతుల విలువ

ప్రభుత్వ లెక్కల ప్రకారం 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.2,65,510 కోట్ల విలువైన ఎగుమతులు రాష్ట్రం నుంచి జరిగాయి. ఇందులో సర్వీసెస్ రంగం నుంచి అత్యధికంగా 69.13 శాతం ఎగుమతి కాగా, సరుకుల ఎగుమతులు 30.87 శాతం మాత్రమే. కానీ ఒక్క సరుకుల ఎగుమతుల విలువ రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో 7.10 శాతంగా నమోదు కావడం గమనార్హం. సరుకుల ఎగుమతుల్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాలే ఎక్కువగా ఉన్నాయి. మొత్తం సరుకుల ఎగుమతుల్లో 85 శాతం వరకు కేవలం 5 జిల్లాల నుంచే జరుగుతున్నాయి.

రంగాల వారీగా ఎగుమతుల వివరాలు (శాతాల్లో)

ఫార్మా 33.9	ఆర్గానిక్ కెమికల్స్ 23.41	
ఎలక్ట్రికల్ 5.47	పత్తి 3.72	న్యూక్లియర్ మెషీన్లు 4.72
కాఫీ, టీ 2.36	మినరల్స్ 2.19	ముత్యాలు, విలువైన వస్తువులు 2.07
ధాన్యాలు 1.81	ఏరోస్పేస్ 1.7	
ఇతర రంగాలు 18.65		



2015-16 నుంచి రాష్ట్రం ఎగుమతి చేసిన ఉత్పత్తులు (శాతాల్లో)	2015-16	2016-17	2017-18	2018-19	2019-20	2020-21	2021-22
ఫార్మా	36.2	32.6	27.3	29.1	32.0	33.4	33.9
ఆర్గానిక్	33.2	34.4	31.1	30.0	30.5	31.1	23.4
ఎలక్ట్రికల్	4.1	3.4	4.0	4.1	4.5	4.7	5.5
మెకానికల్	3.8	3.5	4.3	4.9	5.3	5.4	4.7
మినరల్స్	2.0	2.4	3.7	3.5	3.2	2.8	2.2

ఎన్నికల 'బండి'పై కసరత్తు

▶ మొదటి పేజీ తరువాయి

సాగాల్సి ఉండగా ఆ స్థాయిలో ఎన్నికల తయారీ కనిపించడం లేదని అమిత్ షా వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఈ పరిస్థితుల్లో వెంటనే మార్పు తీసుకొచ్చేలా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక, వ్యూహంతో 'ఎన్నికల రోడ్‌మ్యాప్' సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఇందులో భాగంగా పార్టీపరంగా టీమ్‌ను సిద్ధం చేసుకుని ఇప్పటి నుంచే ఎన్నికల కదనరంగంలోకి దూకాలని దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ ముందస్తు ఎన్నికలకు సన్నద్ధమవుతోందనే లీకులు ఇటీవల ఎక్కువయ్యాయని ఒకనేత ప్రస్తావించగా, ముందస్తు ఎన్నికలు వచ్చినా రాకపోయినా ఎప్పుడు ఎలక్షన్లు జరిగినా వెంటనే వాటిని ఎదుర్కొనేలా



ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని అమిత్‌షా సూచించారు. ఇక శనివారం పార్టీ కార్యాలయంలో రాష్ట్రముఖ్యనేతలతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ విడివిడిగా సమావేశమై పార్టీ పరిస్థితి, ఎన్నికల నేపథ్యంలో ఎలా ముందుకెళ్లాలి అన్న దానిపై అభిప్రాయాలు తీసుకున్నారు.

భారీగా మార్పులు.. చేర్పులు

ఇక తాజాగా చోటుచేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో...వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర పార్టీలో భారీగా మార్పు, చేర్పులు చేపట్టేందుకు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. సంస్థాగతంగా పార్టీకి 38 జిల్లాలు ఉండగా, వీటిలో సగానికి పైగా జిల్లా అధ్యక్షులు, అందులోని కమిటీ నాయకుల పనితీరు సరిగా లేదని నివేదికలు అందినట్టు తెలుస్తోంది. దీంతో దాదాపు 20–25 జిల్లాల అధ్యక్షులను మార్చే అవకాశాలున్నాయనే ఊహాగానాలు సాగుతున్నాయి. ఇక మంత్రి శ్రీనివాస్‌ను పంజాబ్‌కు బదిలీ చేశాక రాష్ట్ర పార్టీకి సంస్థాగత ప్రధానకార్యదర్శి కూడా లేనందున, మరో ప్రధాన కార్యదర్శిని నియమించుకునే అవకాశముంది. అదే విధంగా పనిచేయని ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధులను కూడా మార్చాలనే అభిప్రాయంతో సంజయ్ ఉన్నట్టు తెలుస్తోంది. త్వరలోనే బండిసంజయ్ అధ్యక్షుడిగా మూడేళ్ల పదవీకాలాన్ని పూర్తిచేసుకోనున్నారు. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది మొదట్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నందున ఆయనకు అధ్యక్షుడిగా మరో ఏడాదిన్నర ఎక్స్‌టెన్షన్ రావడమనేది ఖాయంగా చెబుతున్నారు. అధికారికంగా ఈ పొడిగింపు వచ్చిన వెంటనే రాష్ట్ర పార్టీలో సంస్థాగత మార్పులు చేపట్టి ఎన్నికల బృందంతో ముందుకెళతారని పార్టీ వర్గాల సమాచారం



పులుకుర్తి సమీపంలో ఎగసిపడుతున్న దేవాదుల నీరు

దేవాదుల పైప్‌లైన్ లీకేజీ

- ఎగసిపడిన నీరు..
- నీట మునిగిన వరిచేను

దామెర: దేవాదుల పైప్‌లైన్ లీకేజీతో ఒక్కసారిగా నీరు నింగిని తాకే విధంగా పైకి ఎగజిమ్మింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పులుకుర్తిలోని దేవాదుల పంప్ హౌజ్ నుంచి భీంఘన్‌పూర్ పంప్‌హౌజ్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పులుకుర్తి శివారులో శనివారం ఉదయం గేట్‌వాల్వ్ లీకేజీ కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు నీరు ఎగిసిపడింది. దీంతో సమీపప్రాంతం మొత్తం జలమయమైంది. పులుకుర్తి గ్రామానికి చెందిన రైతు పండుగ రవి తన రెండెకరాల పొలంలో ఇటీవల నాట్లు వేయగా పొలం పూర్తిగా మునిగిపోయింది. లీకేజీ విషయమై సంబంధిత అధికారులకు, సిబ్బందికి సమాచారం అందించినప్పటికీ ఎవరూ స్పందించడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలోనూ పైప్‌లైన్ లీకేజీతో రెండెకరాల పత్తి పూర్తిగా మునిగి నష్టం వాటిల్లిందని రవి వాపోయారు.

చంపుతాడని చంపేశాడు

- అన్నని చంపిన తమ్ముడు
- వదినతో వివాహేతర సంబంధమే కారణం

నిజాంసాగర్: అన్న భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం బయటికి తెలియడంతో తనను ఎక్కడ చంపేస్తాడోనన్న భయంతో అన్ననే మట్టుపెట్టాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని అంతాపూర్‌లో జరిగింది. బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాలిలా.. అంతాపూర్ గ్రామనికి చెందిన మక్కల్ వాడి గంగాధర్(27).. తల్లి చిన్నప్పుడే చనిపోవడంతో చిన్నమ్మ వద్దనే పెరిగాడు. చిన్నమ్మ కుమారుడు గంగాధర్, మక్కల్‌వాడి గంగాధర్ సొంత అన్నదమ్ముళ్లలా పెరిగారు. మక్కల్‌వాడి గంగాధర్‌కు వివాహమైంది. భార్య రేణు, ఇద్దరు సంతానం ఉన్నారు. ఇతను కూలి పనుల కోసం వేరే ప్రాంతానికి వలస వెళ్లాడు. ఈ క్రమంలో వరుసకు వదిన అయిన రేణుతో గంగాధర్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. వారం క్రితం ఇంటికి వచ్చిన మక్కల్‌వాడి గంగాధర్.. ఇది గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో తనను అన్న చంపేస్తాడేమోనని భయపడి ముందుగా అతడినే చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 9న మధ్యాహ్నం 2 గంటలకు మక్కల్‌వాడి గంగాధర్ వంట చెరుకు కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లగా.. తమ్ముడు గంగాధర్ బైక్‌పై అతడి వద్దకు



వివరాలు తెలుపుతున్న బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి

వచ్చి, పొలానికి వెళ్దామని చెప్పాడు. జుక్కల్ మండలంలోని హంగర్గ శివారులోగల కర్జం గుట్టకు తీసుకువెళ్లాడు. అక్కడ మాటు వేసి ఉన్న తన మిత్రులు అశోక్, బాలాజీలు మక్కల్‌వాడి గంగాధర్‌పై బండరాళ్లతో దాడి చేశారు. కుప్పకూలిన అతని తలపై ముగ్గురూ కలిసి రాళ్లతో కొట్టి చంపి నీటి గుంటలోకి తోసివేసి ఇంటికి వెళ్లిపోయారు. సాయంత్రం వేళ అన్న కనిపించడం లేదంటూ గంగాధర్ గ్రామస్తులకు తెలిపాడు. హంగర్గ శివారు ప్రాంతానికి వెళ్లినవారికి నీటి గుంటలో మక్కల్‌వాడి గంగాధర్ మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా.. బిచ్కుంద సీఐ కృష్ణ, జుక్కల్ ఎస్సై మురళి ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించి విచారణ జరిపారు. గంగాధర్‌పై అనుమానంతో విచారించగా.. నేరాన్ని అంగీకరించాడు. నిందితులపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఓడి'పోయిన' మాతృమూర్తి

- ఇద్దరు పిల్లలకూ నయంకాని వ్యాధులు
- లక్షలు ఖర్చు చేసినా కానరాని ప్రయోజనం
- భర్త బహ్రెయిన్ నుంచి పంపిస్తున్న డబ్బు.. తాను కూలీ చేసి సంపాదిస్తున్న సొమ్ములూ సరిపోని వైనం
- దాంతో మనస్తాపంతో ఆత్మహత్య
- జగిత్యాల జిల్లా వడ్డెరకాలనీలో విషాదం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): కూలీనాలీ చేసి కష్టపడి సంపాదించి లక్షలు ఖర్చు చేసినా ఇద్దరు పిల్లలూ నయం కాని వ్యాధులతో బాధపడుతుండటం చూసి ఆ తల్లి జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడింది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలోని వడ్డెరకాలనీలో శనివారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. బోదాస్ సోనీ(26) – వెంకటేశ్ దంపతులు. వీరికి రిషివర్ధన్, శశివర్ధన్ కుమారులు. వెంకటేశ్ ఉపాధి కోసం ఏడాది క్రితం బహ్రెయిన్ వెళ్లాడు. సోనీ స్వగ్రామంలో కూలీ పనులు చేస్తూ రిషివర్ధన్‌ను ఓ ప్రైవేట్ పాఠశాలలో నర్సరీ చదివిస్తోంది. శశివర్ధన్‌ను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించింది. రిషివర్ధన్ తరచూ జ్వరం, దగ్గుతో బాధపడుతున్నాడు. శశివర్ధన్‌కు ఫిట్స్ ఉంది. చిన్నారులకు పలు ఆస్పత్రుల్లో సుమారు రూ.6లక్షల వరకు ఖర్చు చేసి వైద్యం చేయించారు. అయినా జబ్బులు నయం కాలేదు. భర్త ప్రతినెలా పంపించే సొమ్ము, తాను కూలీ పనులు చేస్తూ పోగేసుకున్న మరికొంత సొమ్ము వెచ్చించినా తమ కుమారుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడడంలేదని కొంతకాలంగా సోనీ మధనపడుతోంది. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని చనిపోయింది. తండ్రి పరాయి దేశంలో ఉండగా, తల్లి మృతి చెందడంతో చిన్నారులు బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూడడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. సోనీ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

రాయితీపై రొయ్య పిల్లలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. దేశంలో సబ్సిడీ మీద రొయ్య పిల్లలను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. చేపపిల్లలను వంద శాతం సబ్సిడీతో అందచేస్తూ ముదిరాజ్, బెస్త తదితర సామాజిక వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా సభ్యులు జీవన్‌రెడ్డి, ముఠా గోపాల్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి తలసాని సమాధానం ఇచ్చారు. 2022–23లో 4.67 లక్షల టన్నుల చేపలను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 23,748 నీటి వనరుల్లో చేప పిల్లలను వదిలామని చెప్పారు. చేపల మార్కెటింగ్ కోసం మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గతంలో 647 సొసైటీలు ఉండగా, ఇప్పుడు వాటిని 5112కు పెంచుకున్నామని వెల్లడించారు. ఈ ఏడాది కొత్తగా లక్ష మందికి సభ్యత్వం ఇచ్చినట్లు చెప్పారు.

పాల ఉత్పత్తి పెంపునకు చర్యలు

విజయ డెయిరీని మూసివేసే పరిస్థితి నుంచి పురోగమించే స్థితికి తీసుకొచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందని మంత్రి తలసాని అన్నారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తిపై సభ్యులు గండ్ర వెంకట రమణారెడ్డి, జైపాల్ యాదవ్, భాస్కర్ రావు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెపుతూ విజయ డెయిరీతో పాటు కరీంనగర్, ముల్కనూర్ తదితర నాలుగు సహకార డెయిరీల అభివృద్ధికి కృషి జరుగుతోందన్నారు.

గిరిజనులను కించపరిచేలా మాట్లాడారు: రవీంద్రనాయక్

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ అసెంబ్లీలో గిరిజనులను వంచించడంతో పాటు వారిని కించపరిచేలా మాట్లాడారని బీజేపీ నేత, మాజీ మంత్రి రవీంద్రనాయక్ మండిపడ్డారు. సభలో సీఎం పోడు అంశాన్ని ప్రస్తావించారని, కానీ ఆయన చెప్పినవి పోడు భూములు కావు.. అన్యాక్రాంతమైన భూములని తెలిపారు. ఎలాంటి సర్వే చేయకుండానే పోడు ఆక్రమణలు 11 లక్షల ఎకరాలున్నట్లు చెప్పారన్నారు. శనివారం రవీంద్రనాయక్ మీడియాతో మాట్లాడుతూ పలు కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతున్నట్లు చెప్పారని, ఖాయితీ లంబాడాలు అనే తెగ అసలు లేనే లేదన్నారు. చెల్లప్ప కమిషన్ నిర్ధారించిన లెక్కల ప్రకారం రాష్ట్రంలో 9.08 శాతం ఎస్టీలుంటే ఇతర కులాలను చేర్చి 10 శాతం చేయాలని సీఎం కేసీఆర్ చూస్తున్నారని రవీంద్రనాయక్ పేర్కొన్నారు. ఈ విధంగా చేర్చేపుడు ఎవరినీ సంప్రదించకుండా ఎలా చేస్తారని ప్రశ్నించారు. 'ఇదీ కేసీఆర్ పారాసిటమోల్ తెలివి. ఆయనే సైంటిస్ట్, ఆయనే డాక్టర్ అని ఫీల్ అవుతున్నారు' అని ఎద్దేవాచేశారు. గిరిజనులపై నిజంగా ప్రేమ ఉంటే బడ్జెట్‌లో గిరిజన బంధుకు నిధులు ఎందుకు కేటాయించలేదని రవీంద్రనాయక్ నిలదీశారు.

రేవంత్...! వంద ఎకరాలు కాదు.. వంద గజాలు చూపించు

- ఎమ్మెల్యే హరిప్రియతో ఎలాంటి విభేదాలు లేవు
- ఎంపీ మాలోతు కవిత



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో వంద ఎకరాలు కాదు..వంద గజాలు ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చూపించినా తను దేనికైనా సిద్ధమేనని ఎంపీ మాలోతు కవిత సవాల్ చేశారు. అసెంబ్లీలో మీడియాతో శనివారం మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డికి పిచ్చిలేచి బలుపుతో మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మహబూబాబాద్‌లో రేవంత్‌రెడ్డికి విమర్శలు చేయాలంటే మేము తప్ప ఎవరూ కనిపించడం లేదన్నారు. మా నాన్న నిజాయితీగా రాజకీయాలు చేశారని, అందుకే ఏడుసార్లు జనరల్ సీటు గెలిచారని గుర్తు చేశారు. అవినీతి, అక్రమాలు చేయడం మా కుటుంబంలోనే లేదని స్పష్టం చేశారు. తాము అక్రమాలు అన్యాయాలు చేస్తే ప్రజలు ఇన్నిసార్లు గెలిపించరనే విషయం తెలుసుకోవాలని హితవు పలికారు. రాజకీయంగా ఎమ్మెల్యే హరిప్రియతో ఎలాంటి విభేదాలు లేవని, ఆమెకు అన్ని విధాలుగా సహకరిస్తానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పిన విధంగానే పార్లమెంట్‌లో కేంద్రంపై పోరాటం చేస్తామనన్నారు.

100కి 105..



- ప్రతి 100 మందికి 105 మొబైల్ కనెక్షన్లు
- రాష్ట్రంలో నానాటికీ పెరిగిపోతున్న టెలీ సాంద్రత
- రాష్ట్రంలో మొత్తం 4.08 కోట్ల మంది టెలిఫోన్ వినియోగదారులు.
- 98 శాతం మొబైల్ సర్వీసులే
- 2.37 కోట్ల మొబైల్ కనెక్షన్లు పట్టణ ప్రాంతాల్లోనే...
- గ్రామీణ ప్రాంతాల్లో 1.70 కోట్ల కనెక్షన్లు
- గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న టెలిఫోన్లలో కూడా 99.8శాతం వైర్‌లెస్ సర్వీసులే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో టెలీ సాంద్రత నానాటికీ పెరిగిపోతోందని గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అసెంబ్లీలో విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలోనే తొమ్మిదో టెలీ సాంద్రత గల రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఈ లెక్కల ప్రకారం నవంబర్ 2022 నాటికి తెలంగాణలో మొత్తం 4.08 కోట్ల మంది టెలిఫోన్ వినియోగదారులున్నారు. అందులో 98 శాతం మంది వైర్‌లెస్ (మొబైల్) వినియోగదారులే. ఇందులో పట్టణ ప్రాంతాల్లో 2.37 కోట్ల మంది టెలిఫోన్ వినియోగదారులుండగా, అందులో 96 శాతం మంది వైర్‌లెస్ ఫోన్లు వాడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల విషయానికి వస్తే 1.70 కోట్ల మంది టెలిఫోన్ వాడుతుంటే అందులో 99.8 శాతం మందివి వైర్‌లెస్ ఫోన్లే. విశేషమేమిటంటే పట్టణ ప్రాంతాలతో పోలిస్తే సగటున మొబైల్ ఫోన్లు వాడుతున్న వారి సంఖ్య తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉండడం విశేషం. ఇక, మొబైల్ కనెక్షన్ల విషయంలో తెలంగాణ దక్షిణాది రాష్ట్రాల్లో రెండో స్థానంలో నిలవగా, దేశంలో 9వ స్థానంలో నిలిచింది. ప్రతి 100 మంది జనాభాకు తెలంగాణలో 105 మొబైల్ కనెక్షన్లుండడం విశేషం.

దక్షిణాదిన కేరళ తర్వాత

దక్షిణ భారతదేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో టెలీ సాంద్రత ఎక్కువగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. కేరళలో ప్రతి 100 మంది జనాభాకు 120 మొబైల్ ఫోన్లుండగా, తెలంగాణలో 105 మొబైల్ కనెక్షన్లు ఉన్నాయి. తమిళనాడులో 102, కర్ణాటక 97, ఆంధ్రప్రదేశ్‌లో 82 కనెక్షన్లు ఉన్నాయి. ఇక, పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలో కూడా మొబైల్ టెలీ సాంద్రత మనకంటే తక్కువగా ఉంది. మహారాష్ట్రలో ప్రతి 100 మంది జనాభాకు ఉన్న మొబైల్ కనెక్షన్లు 99 మాత్రమే. ఇక దేశంలో అత్యల్ప మొబైల్ సాంద్రత ఉన్న రాష్ట్రాల్లో బీహార్ (53), జార్ఖండ్ (58), మధ్యప్రదేశ్ (66), ఛత్తీస్‌గఢ్ (67), అసోం (69)లు నిలిచాయి.

మన రాష్ట్రం కంటే ఎక్కువ మొబైల్ టెలీ సాంద్రత గల రాష్ట్రాల వివరాలివి:

రాష్ట్రం	టెలీసాంద్రత
సిక్కిం	139
గోవా	132
హిమాచల్‌ప్రదేశ్	131
కేరళ	120
పంజాబ్	113
ఉత్తరాఖండ్	111
మిజోరాం	111
హరియాణ	110

(ప్రతి 100 జనాభాకు మొబైల్ కనెక్షన్ల సంఖ్య)

అసెంబ్లీకి పొన్నాల లక్ష్మయ్య



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య శనివారం అసెంబ్లీకి వచ్చారు. నేరుగా సీఎల్పీ కార్యాలయానికి వచ్చిన ఆయన కొద్దిసేపు అక్కడ వేచి ఉండి ఆ తర్వాత లాబీల్లోకి వెళ్లారు. అక్కడ ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ తారసపడి పొన్నాలను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఎలా ఉన్నారు పొన్నాల జీ.. చాలా రోజుల తర్వాత కనిపించారు అంటూ కుశల ప్రశ్నలు వేశారు. ఆ తర్వాత తనను కలిసిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావులతో మాట్లాడిన పొన్నాల.. అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంతకుముందు భట్టి, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డిలతో మాట్లాడారు.

కానిస్టేబుల్‌పై ఎయిర్‌లైన్స్ ఉద్యోగుల వీరంగం

శంషాబాద్: ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఉద్యోగి విధినిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌ను దుర్భాషలాడిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం చోటు చేసుకుంది. ఆర్‌జీఏ పోలీస్‌స్టేషన్ నుంచి ఎయిర్‌పోర్టులో లైజనింగ్ అధికారిగా కానిస్టేబుల్ జెమ్యానాయక్ విధులు నిర్వహిస్తున్నాడు. ఉన్నతాధికారుల సూచన మేరకు నడవలేని స్థితిలో ఉన్న ప్రయాణికురాలి చెక్‌ఇన్ ప్రక్రియకు సహకరించేందుకు ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ కౌంటర్ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సంతోషి ని అనే అధికారిణి కానిస్టేబుల్‌పై చిందులు తొక్కడంతో పాటు దుర్భాలాడింది. కానిస్టేబుల్ జెమ్యానాయక్ ఫిర్యాదు మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

జమ్మూకశ్మీర్ లిథియం నిల్వలు అత్యుత్తమ రకం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో బయటపడిన లిథియం నిల్వలు అత్యుత్తమ రకానికి చెందినవని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. జమ్మూకశ్మీర్‌లోని రియాసి జిల్లాలో సుమారు 59 లక్షల టన్నుల లిథియం నిల్వలు ఉన్నట్లు భారత భూగర్భ పరిశోధన సంస్థ (జీఎస్ఐ)కనుగొన్న విషయం తెలిసిందే. ''లిథియం కీలకమైన ఖనిజ వనరు. ఇది గతంలో దేశంలో అందుబాటులో లేదు. నూటికి నూరు శాతం విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. సాధారణంగా లిథియం నాణ్యత 220 పీపీఎం(పార్ట్స్ పర్ మిలియన్)గా ఉంటుంది. అయితే, కశ్మీర్‌లో కనుగొన్న లిథియం నాణ్యత 500 పీపీఎం ప్లస్‌గా ఉంది. లిథియం లభ్యతలో మన దేశం చైనాను మించిపోతుంది'' అని కశ్మీర్ గనుల శాఖ కార్యదర్శి అమిత్ శర్మ చెప్పారు.

ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేకు నేడు ప్రధాని ప్రారంభం

న్యూఢిల్లీ: ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్ వేలో భాగమైన 246 కిలోమీటర్ల ఢిల్లీ-దౌసా-లాల్‌సోత్ మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించనున్నారు. దీన్ని రూ.12,150 కోట్లతో నిర్మించారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేతో ఢిల్లీ-జైపూర్ మధ్య ప్రయాణ సమయం 5 గంటల నుంచి మూడున్నర గంటలకు తగ్గనుందని ప్రధాని కార్యాలయం తెలిపింది.

అనుమానిత ఉగ్రవాది బెంగళూరులో అరెస్టు


సాక్షి, బెంగళూరు: అంతర్జాతీయ ఉగ్ర సంస్థలతో సంబంధం ఉన్న ఓ వ్యక్తి బెంగళూరులో అరెస్టయ్యాడు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), బెంగళూరు పోలీసులు కలిసి చేపట్టిన ఆపరేషన్‌లో ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన మహ్మద్ ఆరీఫ్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో థణిసంద్రలోని ఓ ఇంట్లో ఉన్న ఇతడిని అరెస్ట్ చేశారు. ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న అరీఫ్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రెండేళ్లుగా ఉగ్ర సంస్థ అల్‌ఖైదాతో టెలీగ్రాం, డార్క్‌నెట్ ద్వారా సంబంధాలు నెరుపుతున్నట్లు తెలిసింది. ఇతడి కదలికలపై ఎన్ఐఏ కొన్ని రోజులుగా నిఘా ఉంచింది. సిరియా వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న ఆరీఫ్‌ను పట్టుకుని, ఒక లాప్‌టాప్, రెండు హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకుంది. ఈ నెల 13న బెంగళూరులోని ఇంటిని ఖాళీ చేసి యూపీకి వెళ్తున్నట్టు ఇతడు ఇంటి యజమానికి చెప్పాడని పోలీసులు వివరించారు. గత నవంబర్‌లో శివమొగ్గలో ఐఎస్ ప్రేరేపిత ఉగ్ర మాడ్యూల్‌ను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే.

సౌర కిరీటం!

ఉత్తర ధ్రువ ప్రాంతంలో వింత వెలుగుల వలయం

నాసా శాస్త్రవేత్తలు ఈ మధ్య ఓ అద్భుతాన్ని చూశారు!
సూర్యుడిపై కార్యకలాపాల వీడియో ఒకటి చూస్తూండగా
ధ్రువ ప్రాంతంలోంచి ప్లాస్మా పోగు ఒకటి బయటకొచ్చింది!
కుతకుత ఉడుకుతూండే ఈ పోగు చూస్తూండగానే విడిపోయింది!
అది అలా అలా ఎగురుతూ ఓ రింగు ఆకారాన్ని సంతరించుకుంది!
సూర్యుడి ఉత్తర ధ్రువ ప్రాంతంలో గిరికీలు కొట్టడం మొదలుపెట్టింది!!

సూర్యుడి నుంచి ఓ ప్లాస్మా పోగు విడిపోవడమేమిటి, ధ్రువ ప్రాంతంలో రింగులా చక్కర్లు కొట్టడమేమిటని ఆశ్చర్యపోతున్నారా? నాసా శాస్త్రవేత్తలూ కాసేపు ఇలాగే ఆశ్చర్యపోయారు. ఇలా జరగడం ఇదే తొలిసారని అంటున్నారు కూడా! సూర్యుడి అయస్కాంత క్షేత్రం రివర్స్ అవుతూండటం ఒక కారణం కావచ్చునని అంచనా వేస్తున్నారు... సూర్యుడు భగభగ మండే అగ్ని గోళమని మనందరికీ తెలుసు. హైడ్రోజన్, హీలియం మూలకాలు ఒకదాంట్లో ఒకటి లయమైపోతూ విపరీతమైన శక్తిని ఉత్పత్తి చేస్తూంటాయి. ఈ క్రమంలో అక్కడి పదార్థం ప్లాస్మా స్థితిలో ఉంటుంది. ఆవేశంతో కూడిన వాయువన్నమాట. అప్పుడప్పుడు సూర్యుడి ఉపరితలంపై పెద్ద ఎత్తున పేలుళ్లు జరగడం, ఫలితంగా కొన్ని కిలోమీటర్ల ఎత్తుకు ఈ ప్లాస్మా పోగులు ఎగసిపడటం మామూలే. వీటిల్లో కొన్ని సూర్యుడి నుంచి విడిపోతూంటాయి కూడా. అయితే ఏ ప్లాస్మా పోగు కూడా ఇప్పటిదాకా ఇలా రింగులా మారి తిరగడం చూడలేదని నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పోగు సూర్యుడి 55 డిగ్రీల అక్షాంశం వద్ద మొదలై ధ్రువ ప్రాంతాల వైపునకు ప్రయాణిస్తూంటుందని అమెరికాలో కొలరాడో రాష్ట్రంలోని బౌల్డర్‌లో ఉన్న నేషనల్ సెంటర్ ఫర్ అట్మాస్ఫరిక్ రీసెర్చ్ డైరెక్టర్ స్కాట్ మాకింతోష్ వివరించారు. ''పదకొండేళ్లకోసారి ఇలా జరగడం, పోగు కచ్చితంగా ఒకే ప్రాంతం నుంచి మొదలై ధ్రువం వైపు ప్రయాణించడాన్ని పరిశీలించాం. ఈ పోగు పదకొండేళ్ల సోలార్ సైకిల్‌లో ఒకే చోట ఎందుకు పుడుతోంది? కచ్చితంగా ధ్రువాలవైపే ఎందుకు ప్రయాణిస్తోంది? ఉన్నట్టుండి మాయమైపోయి, మూడు నాలుగేళ్ల తరువాత అకస్మాత్తుగా అదే ప్రాంతంలో మళ్లీ ఎలా ప్రత్యక్షమవుతోంది? ఇవన్నీ ఎంతో ఆసక్తి రేపే విషయాలు'' అని వివరించారు.



కారణాలు మిస్టరీయే!

సూర్యుడి నుంచి ప్లాస్మా పోగులు విడిపోవడాన్ని శాస్త్రవేత్తలు గతంలోనూ గుర్తించారు. 2015లో కొద్ది వ్యవధిలోనే రెండు భారీ పోగులు విడిపోయాయి. మొదటిది సూర్యుడి ఉత్తర భాగంలో సంభవించింది. ప్లాస్మా కిలోమీటర్ల ఎత్తుకు ఎగసింది. తరువాత కింది భాగంలోకి కలిసిపోయింది. రెండు గంటల తరువాత మరో పోగు విడిపోయింది. అయితే రెండు సందర్భాల్లోనూ ప్లాస్మా పోగు రింగులా మారడం, చక్కర్లు కొట్టడం జరగలేదు. తాజాగా మాత్రమే అలా జరగడానికి కారణాలేమిటో శాస్త్రవేత్తలు నిర్ధారించాల్సి ఉంది. ఇటీవలి కాలంలో సూర్యుడిపై కార్యకలాపాలు చాలా చురుకుగా సాగుతున్నాయని.. పదకొండేళ్ల సోలార్ సైకిల్‌లో కీలకదశకు ఇది నిదర్శనమని వారంటున్నారు. ''ఈ సోలార్ సైకిల్ 2024లో పతాక స్థాయికి చేరుతుంది. అప్పుడు సూర్యుని ఉత్తర, దక్షిణ ధ్రువాలు తారుమారవుతాయి. బహుశా ఆ క్రమంలోనే ఉత్తర ధ్రువ ప్రాంతంలో ప్లాస్మా రింగ్ ఏర్పడి ఉండవచ్చు'' అని ప్రాథమిక అంచనాకు వచ్చారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ సోలార్ సైకిల్?

సూర్యుడు విద్యుదావేశంతో కూడిన భారీ వాయుగోళం. ఈ విద్యుదావేశపు వాయువు కదలికల వల్ల సూర్యుడి చుట్టూ శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రం ఏర్పడుతుంది. దీని ఉత్తర, దక్షిణ ధ్రువాలు పదకొండేళ్లకోసారి తారుమారవుతూంటాయి. ఇదే సోలార్ సైకిల్. దీని ప్రభావం సూర్యుడి ఉపరితలంపై జరిగే కార్యకలాపాలపైనా ఉంటుంది. సూర్యుడిపై జరిగే పేలుళ్ల ఫలితంగా నల్లటి మచ్చల్లాంటివి (సన్‌స్పాట్స్) కనిపిస్తూంటాయి. ఒక ఏడాదిలో వీటి సంఖ్యను బట్టి సూర్యుడిపై కార్యకలాపాల తీవ్రత తెలుస్తూంటుంది. సన్‌స్పాట్స్ ఎక్కువ అవుతున్నాయంటే పదకొండేళ్ల సోలార్ సైకిల్ పతాక స్థాయికి చేరుతోందని అర్థం. ఆ తర్వాత ఏటా ఇవి తగ్గుతూ దాదాపుగా శూన్యమవుతాయి. తర్వాత మళ్లీ ఇంకో సోలార్ సైకిల్ ప్రారంభానికి సూచికగా క్రమంగా పెరుగుతాయి. సూర్యుడిపై నుంచి పదార్థం అంతరిక్షంలోకి ఎగసిపడే తీవ్రత కూడా సోలార్ సైకిల్‌కు అనుగుణంగానే హెచ్చుతగ్గులకు గురవుతూంటుంది. వీటి ప్రభావం అంతరిక్షంలోని ఉపగ్రహాల ఎలక్ట్రానిక్ పరికరాలను నాశనం చేసేంత తీవ్రంగా ఉంటుంది.

మధ్య వయస్సులోకి ఆదిత్యుడు...

సూర్యుడిప్పుడు మధ్య వయసులోకి అడుగుపెట్టాడు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ శాస్త్రవేత్త గియా అంతరిక్ష నౌకతో చేసిన ప్రయోగాల ద్వారా ఈ అంచనాకు వచ్చారు. ప్రస్తుతం సూర్యుడి వయసు 457 కోట్ల సంవత్సరాలని, ఇంకో 500 కోట్ల ఏళ్ల తర్వాత నశించిపోతుందని గత ఆగస్టులో శాస్త్రవేత్తలు ప్రకటించారు. చివరి దశలో సూర్యుని సైజు విపరీతంగా పెరుగుతుందని, రెడ్‌జెయింట్‌గా మారి భూమితో పాటు ఇతర గ్రహాలనూ మాడ్చి మసి చేసేస్తుందని అంచనా. ఆ తర్వాత వేడి తగ్గిపోయి మరుగుజ్జు నక్షత్రంగా మారిపోతుందట.



టర్కీలోని అంటాక్యా సిటీలో ఓ బాలుడిని ఐదు రోజుల తర్వాత భవన శిథిలాల నుంచి సజీవంగా బయటకు తీసుకొచ్చి అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

ఆశలు సమాధి?

తుర్కియే, సిరియాల్లో 26 వేలు దాటిన మృతుల సంఖ్య

ఆచూకీ లేని వారు బతకడం కష్టమే!

అంటాక్యా: తుర్కియే, సిరియాలో భూకంపం వచ్చి అయిదు రోజులు దాటిపోవడంతో కనిపించకుండా ఉన్న తమ సన్నిహితులు క్షేమంగా తిరిగి వస్తారన్న విశ్వాసం అందరిలోనూ సన్నిగిల్లుతోంది. ఇప్పటివరకు 26 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇంకా శిథిలాలు తొలగిస్తున్న కొద్దీ శవాల గుట్టలు బయటకు వస్తూనే ఉన్నాయి. తుర్కియేలో హతే ప్రావిన్స్‌కు వెళ్లి ఫుట్‌బాల్ బృందంలో ఉన్న వారందరి మృతదేహాలు బయటకు వచ్చాయి. ఇప్పటివరకు తుర్కియేలో మాత్రమే 80 వేల మంది గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉంటే, 10 లక్షల మంది ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఆ శవాల మధ్య జీవచ్ఛవాలుగా మారిన కొందరు కొన ఊపిరితో ఉన్న ప్రాణాలతో బయటపడుతున్నారు. 80 ఏళ్ల ముదుసలి నుంచి పది రోజుల బాలుడు వరకు దాదాపుగా 120 గంటల సేపు శిథిలాల కింద కూరుకుపోయిన వారు ఇప్పటివరకు 12 మంది ప్రాణాలతో బయటపడ్డారు.

ఉత్తరాఖండ్ వాసి మృతి

భూకంపం వచ్చిన రోజు నుంచి కనిపించకుండా పోయిన భారతీయుడు, ఉత్తరాఖండ్‌కు చెందిన విజయ్‌కుమార్ గౌడ్ మరణించాడు. అతను బస చేసిన హోటల్ శిథిలాల నుంచి మృతదేహాన్ని వెలికి తీశారు. ఉత్తరాఖండ్‌లోని పౌరి జిల్లాకు చెందిన విజయ్‌కుమార్ గౌడ్ బెంగళూరు కంపెనీలో పని చేస్తున్నారు. ఆఫీసు పని మీద తుర్కియే వెళ్లారు. అప్పుడే కుదిపేసిన భూకంపం ఆయన నిండు ప్రాణాలను తీసేసింది. అతని చేతి మీద ఉన్న ఓం అన్న టాటూ సాయంతో గౌడ్ మృతదేహాన్ని గుర్తు పట్టినట్టుగా భారత రాయబార కార్యాలయం వెల్లడించింది.

ఒకే కుటుంబంలో ఐదుగురు క్షేమం

గజియాంటెప్ ప్రావిన్స్ నర్దాగ్‌లో ఒక ఇల్లు కుప్పకూలిపోయి, ఆ ఇంట్లో శిథిలాల కింద చిక్కిన ఉన్న ఐదుగురు కుటుంబసభ్యులను సహాయ సిబ్బంది బయటకు తీసుకువచ్చారు. మొదట తండ్రి హసన్ అస్లాన్‌ను శిథిలాల కింద నుంచి బయటకు తీయాలని అనుకుంటే , ఆయన తన కొడుకు, కూతుళ్లని మొదట బయటకు తీయండని మొరపెట్టుకున్నాడు. మొత్తమ్మీద అందరినీ కాపాడిన సహాయ సిబ్బంది గాడ్ ఈజ్ గ్రేట్ అంటూ ఆనందం వ్యక్తం చేశారు.

పదిరోజుల పసికందు మృత్యుంజయుడు



గడ్డ కట్టించే చలి, భవనం శిథిలాల మధ్య, నీళ్లు, పాలు లేకుండా భూకంపం పది రోజుల వయసున్న బాలుడు 90 గంటల సేపు పోరాటం చేశాడు. చివరికి గెలిచి మృత్యుంజయుడై తిరిగి వచ్చాడు. తుర్కియేలో భూకంప ప్రభావం అధికంగా ఉన్న హతే ప్రావిన్స్‌లో శిథిలాల కింద తల్లి, తన పదేళ్ల బాలుడు యాగిజ్ ఉలాస్‌తో నాలుగు రోజులు అలాగే ఉండిపోయింది. సహాయ సిబ్బంది సిమెంట్ శ్లాబుల తొలగిస్తూ ఉండగా ఆ పసికందు మూలుగు వినిపించింది. జాగ్రత్తగా శిథిలాల నుంచి తొలగించి ప్రాణాలతో ఉన్న ఆ బాలుడిని థర్మల్ బ్లాంకెట్‌లో చుట్టి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ మిరాకిల్ బాయ్ చురుగ్గా ఉన్నప్పటికీ తల్లి బాగా నీరసించిపోయే దశలో ఉంది.

'జోడో'ను మూడు రోజులకే ముగిద్దామనుకున్నారు!



తిరువనంతపురం: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్రమైన మోకాలి నొప్పి కారణంగా భారత్ జోడో యాత్రను మూడు రోజులకే ఆపేయాలనుకున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. రాహుల్‌కు అత్యంత విశ్వసనీయుడిగా పేరున్న వేణు గోపాల్ శనివారం కేరళలోని తిరువనంతపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. మోకాలి నొప్పితో ఇబ్బందిపడిన రాహుల్..యాత్రలో తన బదులుగా మరొకరిని పెట్టాలనుకున్నారని కూడా ఆయన చెప్పారు. తన స్థానంలో సీనియర్ నేతలెవరికైనా ఆ బాధ్యతలను అప్పగించాలని సోదరి ప్రియాంకా గాంధీకి చెప్పారన్నారు. కన్యాకుమారి నుంచి యాత్ర మొదలైన మూడు రోజులకే రాహుల్ మోకాలి నొప్పి తీవ్రమైందన్నారు. అయితే, దేవుడి దయతో ఆ తర్వాత నొప్పి తగ్గిపోయిందని చెప్పారు. రాహుల్ నేతృత్వంలో గత ఏడాది సెప్టెంబర్ 7న మొదలైన భారత్ జోడో యాత్ర జనవరి 30న జమ్మూలో ముగిసిన విషయం తెలిసిందే.



జమ్మూకశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో ఇగ్లూ కేఫ్ (ఇన్‌సెట్‌లో) ఆతిథ్యాన్ని ఆస్వాదిస్తున్న పర్యాటకులు

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరికొన్నేళ్లు సాగొచ్చు

వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్గెని అంచనా

కీవ్: ఏడాది క్రితం మొదలైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరికొన్నేళ్లు సాగే అవకాశాలున్నాయని ప్రైవేట్ మిలటరీ కాంట్రాక్టర్, వాగ్నర్ గ్రూప్ యజమాని యెవ్గెనీ ప్రిగోజిన్ అంటున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ప్రిగోజిన్‌కు చెందిన ప్రైవేట్ సైన్యం రష్యా మిలటరీతో కలిసి ఉక్రెయిన్‌లో యుద్ధం చేస్తోంది. శుక్రవారం ఓ వీడియో ఇంటర్వ్యూలో ప్రిగోజిన్.. కీలక పారిశ్రామిక ప్రాంతం డోన్‌బాస్‌పై పూర్తి స్థాయి ఆధిపత్యం సాధించేందుకు రష్యాకు ఏడాదిన్నర నుంచి రెండేళ్ల వరకు పట్టొచ్చని అంచనా వేశారు. నీపర్ నదికి తూర్పు వైపునున్న విస్తార ప్రాంతంపై పట్టు సాధించాలంటే మాత్రం రష్యాకు మూడేళ్ల వరకు సమయం తీసుకుంటుందని అన్నారు. కంచుకోటలాంటి డొనెట్స్క్‌లోని బఖ్ముత్‌లో ఉక్రెయిన్ దళాలతో తమ గ్రూప్ శ్రేణులు భీకర పోరాటం సాగిస్తున్నాయని చెప్పారు. తమ 'స్పెషల్ మిలటరీ ఆపరేషన్'అనుకున్న లక్ష్యాలను సాధించే వరకు కొనసాగుతుందని రష్యా కూడా చెబుతుండటం గమనార్హం. రష్యా అధ్యక్ష భవనమైన క్రెమ్లిన్ కేటరింగ్ కాంట్రాక్టులు చేసే ప్రిగోజిన్‌కు 'పుతిన్ వంటమనిషి'గా పేరుంది. శనివారం ఒడెసాలో వ్యూహాత్మక రైల్వే వంతెనను రష్యాకు చెందిన సీ డ్రోన్ దాడితో పేల్చేస్తున్న వీడియో ఒకటి రష్యా మిలటరీ బ్లాగర్లు విడుదల చేశారు. దీనిని ఇరు దేశాలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

కేరళలో కుస్తీ.. త్రిపురలో దోస్తీ

- కాంగ్రెస్, సీపీఎంలది ద్వంద్వ నీతి
- త్రిపుర ప్రచారంలో ప్రధాని మోదీ విమర్శలు



అంబాసాలో మోదీని దీవిస్తున్న గిరిజన మహిళ

రాధాకిషోర్‌పూర్/అంబాసా(త్రిపుర): త్రిపుర రాష్ట్రంలో కాంగ్రెస్-సీపీఎం పార్టీల కూటమిని ప్రధాని మోదీ తీవ్రంగా తప్పుబట్టారు. ఓట్ల కోసం కేరళలో పోటాపోటీగా కుస్తీ పడుతూ, అవే పార్టీలు ఉమ్మడిగా ఓటర్లను మోసంచేసేందుకు త్రిపురలో దోస్తీ చేస్తున్నాయని మోదీ విమర్శించారు. టిప్రా మోతాకి మోదీ పరోక్షంగా చురకలంటించారు. 'ఈ విపక్ష కూటమికి ఇంకొన్ని ఇతర పార్టీలు బయటి నుంచి మద్దతు తెలుపుతున్నాయి. ఈ కూటమికి పడే ప్రతీ ఓటు త్రిపురను కొన్నేళ్లు వెనుకడుగు వేసేలా చేస్తుంది' అని అన్నారు. శనివారం గోమతి జిల్లాలోని రాధాకిషోర్‌పూర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ' గతంలో అధ్వానంగా పాలించిన పార్టీలు మళ్లీ ఇప్పుడు ఓట్ల కోసం బయల్దేరాయి. అవి కేరళలో కుస్తీ పడతాయి. త్రిపురలో దోస్తీ కడతాయి' అని అన్నారు. ' ఓట్లు చీల్చేందుకు విపక్షం యత్నిస్తోంది. ఇంకొన్ని చిన్న 'ఓట్లు చీల్చే' పార్టీలుంటాయి. విజయవంతంగా ఓట్లు చీలిస్తే ఫలితాలొచ్చాక అందుకు 'ప్రతిఫలం' పొందుతాయి. ఇంకొందరు తమకు తామే గెలుపుగుర్రాలుగా భావించి గెలిచాక ఇంట్లోనే గడియపెట్టుకుని కూర్చుంటారు' అని మోదీ విమర్శించారు.

రెండంచుల కత్తితో జాగ్రత్త

'గత లెఫ్ట్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గిరిజనులను విభజించి పాలించాయి. మేం మాత్రం మిజోరం నుంచి వలసవచ్చిన వేలాది బ్రూస్ కుటుంబాలుసహా అన్ని గిరిజన తెగల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నాం. గిరిజన భాష కోక్‌బోరోక్‌ను మా ప్రభుత్వమే ఉన్నత విద్యలో ప్రవేశపెట్టింది. కేంద్ర బడ్జెట్‌లోనూ గిరిజనప్రాంతాల అభివృద్ధికి రూ.1 లక్ష కోట్లు కేటాయించాం' అని అన్నారు. ' కాంగ్రెస్-సీపీఎం డబుల్ ఎడ్జ్(రెండు అంచుల) కత్తి విషయంలో జాగ్రత్తగా ఉండండి. డబుల్ ఎడ్జ్ ప్రభుత్వమొస్తే ప్రజలకు లబ్ధిచేకూరే అన్ని పథకాలను తెగ్గోసి పడేస్తుంది. మా డబుల్ ఇంజన్ ప్రభుత్వానికి మళ్లీ ఓటు వేసి ఈ ఈశాన్య రాష్ట్రంలో అభివృద్ధి గతిని సుస్థిరం చేయండి' అని ఓటర్లకు పిలుపునిచ్చారు. ధలాయ్ జిల్లాలోని అంబాసాలోనూ మోదీ ప్రచార సభలో ప్రసంగించారు.

దక్షిణాసియా ముఖద్వారంగా త్రిపుర

'ఈ రెండు పార్టీలు పేదప్రజల కష్టాలు తీరుస్తామని అలుపెరగకుండా వాగ్దానాలు చేస్తారుగానీ పేదల బాధ, కష్టాలను ఎప్పటికీ అర్థంచేసుకోరు. రాష్ట్రంలో తొలి దంతవైద్య కళాశాల బీజేపీ హయాంలోనే సాకారమైంది. గతంలో పోలీస్‌స్టేషన్లపై సీపీఎం శ్రేణులు ఆధిపత్యానికి దుస్సాహసం చేసేవి. మేమొచ్చాక శాంతిభద్రతలు నెలకొల్పాం. గతంలో రాష్ట్రంలోని యువత జీవనోపాధి కోసం వేరే రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. మా హయాంలో ఉద్యోగావకాశాలు పెరిగాయి. యాక్ట్ ఈస్ట్ విధానంతో రాష్ట్రం పురోగమిస్తోంది. త్వరలోనే అభివృద్ధి ఆసియా ముఖద్వారంగా త్రిపుర మారనుంది' అని మోదీ అభిలషించారు.

ఢిల్లీ మద్యం కేసులో మరొకరి అరెస్ట్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానం అవకతవకల కేసులో ఒంగోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవను ఈడీ అరెస్ట్ చేసినట్లు అధికారులు శనివారం తెలిపారు. మనీ లాండరింగ్ చట్టం కింద శుక్రవారం సాయంత్రం ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి 10 రోజుల పాటు కస్టడీకి తీసుకుంది. ఈ కేసులో ఈడీ ఇప్పటిదాకా 9 మందిని అరెస్ట్‌చేసింది. ఈ వారంలో ఇది మూడో అరెస్ట్. సీబీఐ అరెస్ట్ చేసిన సీఏ గోరంట్ల బుచ్చిబాబును ప్రత్యేక కోర్టు 14 రోజుల రిమాండ్ కు అప్పగించింది.

టీషర్ట్స్, జీన్స్, మేకప్, ఫంకీ హెయిర్ స్టైల్ ఇక బంద్ హరియాణా ప్రభుత్వాస్పత్రుల్లో డ్రెస్ కోడ్

చండీగఢ్: హరియాణా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బందికి త్వరలో డ్రెస్ కోడ్‌అమలు చేయనున్నట్లు ఆరోగ్య మంత్రి అనిల్ విజ్ చెప్పారు. 'ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిబ్బంది ప్రతి ఒక్కరూ యూనిఫాంలోనే కనిపిస్తారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం సిబ్బందిని, రోగిని పోల్చుకోవడం కూడా కష్టమే. క్రమశిక్షణ కోసమే ఈ డ్రెస్ కోడ్. మేకప్, భారీగా నగలు, అలంకరణలు, గోళ్లు పెంచుకోవడం, ఫంకీ హెయిర్ స్టయిల్, టీ షర్టులు, డెనిమ్స్, స్కర్టులపై నిషేధం విధిస్తాం. వైద్య, వైద్యేతర సిబ్బందికి ఇవి వర్తిస్తాయి'' అని చెప్పారు.

దేశంలో వాక్ స్వాతంత్య్రం కరవు: ఖర్గే

రాంచీ: మోదీ సర్కారుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిప్పులు చెరిగారు. దేశంలో వాక్ స్వాతంత్య్రం లేనే లేదని ఆరోపించారు. జార్ఖండ్ రాష్ట్రం సాహెబ్ గంజ్ జిల్లా పాకుర్‌లో శనివారం ర్యాలీలో ఆయన మాట్లాడారు. ''పార్లమెంట్ లోపల, వెలుపల వాక్ స్వాతంత్య్రం లేదు. ఎవరైనా నిజం మాట్లాడినా, రాసినా కటకటాల్లోకి పంపుతారు'' అంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. 'మోదీకి స్నేహితుడైన అదానీ ఆస్తులు 2019లో రూ.లక్ష కోట్లుండగా నేడు రూ.13 లక్షల కోట్లకు పెరిగాయి. అదానీ కోసమే తప్ప పేదల కోసం మోదీ పనిచేయడం లేదు' అని అన్నారు. ప్రభుత్వాలను కూలదోయడంలో నిష్ణాతులైన మోదీ, అమిత్ షాలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు.

పెళ్లి బరాత్‌పై దూసుకెళ్లిన కారు

హరిద్వార్: నృత్యాలు, నవ్వులు, పాటలతో హుషారుగా సాగుతున్న పెళ్లి ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. ఊరేగింపుగా వెళ్తుండగా స్కార్పియో శరవేగంగా దూసుకొచ్చి ఢీకొట్టింది. ఒకరు చనిపోగా 31 మంది గాయపడ్డారు. ఉత్తరాఖండ్‌లో హరిద్వార్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఈ దుర్ఘటన జరిగింది. కారు డ్రైవర్‌ను పట్టుకుని చితకబాదారు.

దుమ్ము రేపిన చాట్‌జీపీటీ

- అత్యంత కఠినమైన యూఎస్ఎంఎల్ పరీక్షను అలవోకగా పాసైంది
- చాట్‌జీపీటీకి ఇది కీలక మైలురాయి
- అధ్యయన సంస్థ అన్సిబుల్‌హెల్త్



లాస్‌ఏంజెలెస్: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ చాట్ బాట్ చాట్‌జీపీటీ మరో ఘనత సాధించింది. అత్యంత కఠినమైన యూఎస్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జాం (యూఎస్ఎంఎల్ఈ) పాసైంది. 1, 2సీకే, 3 అనే మూడు సిరీస్‌లుగా ఉండే ఈ పరీక్షల్లో దాదాపుగా 60 శాతం మార్కులు స్కోరు చేసి ఔరా అనిపించింది. వైద్య విద్యార్థులు, శిక్షణలో ఉన్న వైద్యులు రాసే యూఎస్ఎంఎల్ఈలో బయోకెమిస్ట్రీ, డయాగ్నస్టిక్ రీజనింగ్, బయోఎథిక్స్ వంటి పలు అంశాలపై లోతుగా ప్రశ్నలుంటాయి. కాలిఫోర్నియాలోని అన్సిబుల్‌హెల్త్ సంస్థ ఈ అధ్యయనం జరిపింది. ఇందులో భాగంగా 2022 జూన్ నాటి పరీక్షలో ఇమేజ్ ఆధారిత ప్రశ్నలు మినహా మిగతా 350 ప్రశ్నలను చాట్‌జీపీటీకి సంధించారు. మూడు పరీక్షల్లో అది 52.4 నుంచి 75 శాతం మధ్యలో స్కోరు చేసిందట. పాసయ్యేందుకు సగటున 60 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఈ అధ్యయన వివరాలను పీఎల్ఓఎస్ డిజిటల్ హెల్త్ జర్నల్లో ప్రచురించారు. ''అత్యంత కఠినమైన ఈ పరీక్షను మానవ ప్రమేయం అసలే లేకుండా పాసవడం చాలా గొప్ప విషయం. ఈ ఘనత సాధించడం ద్వారా చాట్‌జీపీటీ కీలక మైలురాయిని అధిగమించింది'' అని పేర్కొన్నారు. అన్సిబుల్‌హెల్త్ సంస్థ ఇప్పటికే సంక్లిష్టమైన వైద్య పరిభాషతో కూడిన రిపోర్టులను రోగులు సులువుగా అర్థం చేసుకునేందుకు వీలైన భాషలో రాసేందుకు చాట్‌జీపీటీని ఉపయోగించుకుంటోంది.

మన రాజ్యాంగం 'పక్కా లోకల్'

స్వపరిపాలనకు అత్యుత్తమ కరదీపిక: సీజేఐ



ముంబై: ''భారత రాజ్యాంగం అతి గొప్ప స్వదేశీ రూపకల్పన. ఆత్మగౌరవం, స్వతంత్రం, స్వపరిపాలనకు అత్యుత్తమ కరదీపిక'' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ కొనియాడారు. ''కానీ కొందరు దాని విజయాలను అతిగా కొనియాడుతుంటే మరికొందరు పూర్తిగా పెదవి విరుస్తుంటారు. ఇది నిజంగా బాధాకరం. మన రాజ్యాంగం ఎన్నో గొప్ప ఘనతలు సాధించిందన్నది నిస్సందేహం. అయితే సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. ముఖ్యంగా భారత సమాజంలో లోతుగా వేళ్లూనుకుపోయిన అసమానతలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి'' అని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ స్ఫూర్తిని సమాజం పూర్తిస్థాయిలో అందిపుచ్చుకున్నప్పుడే ఈ అసమానతలు పోతాయన్నారు. శనివారం నాగపూర్‌లోని మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ తొలి కాన్వకేషన్‌లో సీజేఐ పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్దేశిత విలువలకు కట్టుబడితే రాణిస్తారంటూ యువ న్యాయ పట్టభద్రులకు ఈ సందర్భంగా ఉద్బోధించారు. ''నేడు మనం అనుభవిస్తున్న రాజ్యాంగ హక్కులు, పరిహారాలకు అంబేడ్కర్‌కు రుణపడి ఉండాలి. ఎన్నో అడ్డంకులను అధిగమించి ఆయన ప్రపంచంలోనే అతి గొప్ప సామాజిక సంస్కర్తగా ఎదిగారు'' అంటూ కొనియాడారు.

అమెరికా గగనతలంలో మరో బెలూన్ కలకలం

నేలకూల్చిన యుద్ధవిమానం

వాషింగ్టన్: చైనా భారీ నిఘా బెలూన్‌ను అమెరికా కూల్చేసిన ఘటన మరువకముందే అగ్రరాజ్యంలో మరో గగనతల ఉల్లంఘన ఉదంతం చోటుచేసుకుంది. అలాస్కాలో కారు పరిమాణంలో అత్యంత ఎత్తులో ఎగురుతున్న ఒక వస్తువును కూల్చేశామని వైట్‌హౌస్ తెలిపింది. 'పౌర విమానాల రాకపోకలకు కాస్తంత విఘాతం కల్గించేదిగా ఉన్న వస్తువును కూల్చేశాం. శిథిలాలను వెతికే పనిలో ఉన్నాం' అని పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ బ్రిగేడియర్ జనరల్ ప్యాట్ రైడర్ చెప్పారు. ' 40వేల అడుగుల ఎత్తులో ఎగురుతున్న వస్తువును 24 గంటలపాటు నిశితంగా పరిశీలించాక అధ్యక్షుడు బైడెన్ ఆదేశాలమేరకు యుద్ధవిమానం కూల్చేసింది. అది గడ్డ కట్టిన అమెరికా సముద్రజలాల్లో పడింది' అని అమెరికా జాతీయ భద్రతా మండలి కోఆర్డినేటర్ (వ్యూహాత్మక కమ్యూనికేషన్స్) జాన్ కిర్బీ మీడియాతో చెప్పారు. ''ఇటీవల కూల్చేసిన చైనా నిఘా బెలూన్‌కు స్వయం నియంత్రణ, గమన వ్యవస్థ ఉన్నాయి. సున్నిత సైనిక స్థావరాలపై నిఘా పెట్టింది. కానీ ఈ వస్తువు ఏం చేసిందనేది ఇంకా తెలియదు'' అని ఆయన అన్నారు.



● చిట్టెలుక గట్టి రికార్డు

పసిఫిక్ ప్యాకెట్ రకం చిట్టెలుక ఇది. వయసు 9 సంవత్సరాల 209 రోజులు. అత్యంత ఎక్కువకాలం జీవించిన ఎలుకగా గిన్నిస్ రికార్డుకెక్కింది. ఇవి 3 నుంచి ఐదేళ్లే బతుకుతాయి. అమెరికాలోని శాన్ డీగో జూ అంతరించిపోతున్న ఈ రకం ఎలుకలను పెంచుతోంది.

సాక్షి
కరీంనగర్
ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



రాజన్నా శరణు

వేములవాడ: వేములవాడ రాజన్నను శనివారం 15 వేల మంది దర్శించుకున్నారు. వరుస సెలవులు రావడంతో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



నృసింహునికి మొక్కులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. మాఘమాసం బహుళ షష్ఠి శనివారం సందర్భంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
34.0/17.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ ఉంటుంది. తెల్లవారుజామున ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ముగిసిన నవోదయ పరీక్ష



ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శనివారం చొప్పదండి మండలంలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్షకు 905 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 474 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ మంగతాయారు ప్రవేశ పరీక్షను పర్యవేక్షించారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

కరీంనగర్: స్కూల్ అసిస్టెంట్ నుంచి ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్ పొందే వారి జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సీనియార్టీ లిస్టులో ఉన్న ఉపాధ్యాయులు తమ ఒరిజినల్ సర్వీస్ బుక్‌తోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని డీఈవో ఆఫీసులో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో 1,469 కేసుల పరిష్కారం



కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జీలు

కరీంనగర్‌క్రైం: జాతీయ, రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ఏసీబీ కోర్టు న్యాయమూర్తి పి.లక్ష్మీకుమారి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి కుమార్ వివేక్ ప్రారంభించారు. లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని న్యాయమూర్తులు తెలిపారు. అదాలత్‌లో 44 సివిల్ కేసులు, 36 ప్రీ లిటిగేషన్, 1,389 క్రిమినల్ కేసులు పరిష్కరించారు. 34 మోటార్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు రూ.1,57,10,000 ఇన్సూరెన్స్ కంపెనీలు సెటిల్ చేశాయి. కార్యక్రమంలో న్యాయమూర్తులు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, కంపెనీ న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలతో రైతాంగం విలవిల



మాట్లాడుతున్న నగేశ్

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ కరెంట్ కోతల రాష్ట్రంగా మారిందని, తరుచూ కరెంట్ కోతలతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ అన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. 24గంటల నాణ్యమైన కరెంటు రైతులకు ఇస్తామని గొప్పలు చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పుడు 6గంటల కరెంటు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కరెంట్ కోతలతో పంటలకూ సాగునీరు అందక ఎండిపోతున్నాయన్నారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం జాతీయస్థాయిలో పార్టీని పెట్టి ప్రజలను దగా చేస్తున్నాడని ఆరోపించారు. ఉద్యోగులకు జీతాలు, ఉపాధి కూలీలకు కూలీ డబ్బులు ఇవ్వలేని దుస్థితిలో కేసీఆర్ పాలన ఉందన్నారు. రేపటి ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు తగినబుద్ధి చెపుతారని అన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ శివరామ్, ఉకంటి రవీందర్‌రెడ్డి, పోలు శ్రీనివాస్, నర్సయ్య, దేవనూరి శ్రీనివాస్, సంపత్, రియాజ్ పాల్గొన్నారు.

కొత్తగట్టులో విద్యార్థినుల క్షేత్రపర్యటన

శంకరపట్నం: కొత్తగట్టు గ్రామంలో శనివారం కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులు పర్యటించారు. తెలుగువిభాగం విద్యార్థినులు మనఊరు– మనచరిత్ర అనే అంశంపై ప్రాజెక్ట్ సమన్వయకర్త డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ భౌగోళిక, చరిత్ర ప్రాధాన్యతపై గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. గ్రామంలో జనాభా, ఓటర్లు, సదుపాయాలు, చెరువు, కుంటలు, గుట్టలు, వ్యవసాయ భూముల విస్తీర్ణం వివరాలు సేకరించారు. కోరెం అశోక్‌రెడ్డి ఐఏఎస్ హోదాపై తెలుసుకున్నారు. మత్స్యగిరీంద్రస్వామి ఆలయ చరిత్రను అర్చకులు, గ్రామ చరిత్రను గ్రామసర్పంచ్ కిషన్‌రావు వివరించారు.



సండే స్పెషల్

ఆశ్రమాల్లో అనాథలుగా..

అయినవారు అందరూ ఉన్నా.. పట్టించుకునేవారు లేక

- తోడులేక.. నీడలేక వృద్ధుల పాట్లు
- చివరి అంకంలో ఆశ్రమాల్లో బతుకీడుస్తూ..
- పిల్లలకు భారంగా ఉండలేక.. బాధను దిగమింగలేక..
- బలవన్మరణానికి పాల్పడుతున్న మరికొందరు

నాపేరు సునీత. వయసు 68 ఏళ్లు. రోడ్డుపై ఒంటరిగా ఉన్న నన్ను నాలుగేళ్ల క్రితం రామగుండం కార్పొరేటర్ ఎండీ. ముస్తాఫా పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర ఆశ్రమంలో చేర్పించాడు. బంధువులు ఎందరో ఉన్నా.. ఆదరణ లేక ఇక్కడే ఉంటున్నా. కాళ్లనొప్పులు, ఆస్తమా సమస్యలతో బాధపడుతున్నా. ఆశ్రమ నిర్వాహకుడు నాకు మూడుపూటల భోజనం పెట్టి కొడుకులా చూసుకుంటున్నాడు.



నా పేరు వైద్యుల మల్లారెడ్డి. మా ఆవిడ పేరు రాజవ్వ. సొంతూరు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్. వ్యవసాయం చేసుకుంటూ బతికేటోళ్లం. మంచిగా ఆస్తి సంపాదించిన. కొడుకులు బాసటగా ఉంటారనుకున్నా. కానీ ఉన్న ఆస్తిని వాళ్లపేరున చేయించుకున్నారు. మా ఇద్దరిని వెళ్లగొట్టారు. ఐదేళ్లుగా గోదావరిఖనిలోని శ్రీధర్మశాస్త్ర వృద్ధుల సేవా ఆశ్రమంలో ఉంటున్నాం. మాకు కొడుకులు, బిడ్డలు.. వాళ్ల పిల్లలతో హాయిగా ఆడుకోవాలని, కలిసిఉండాలని అనిపిస్తుంది. కానీ కన్న రక్తం మమ్మల్ని గెంటేశాక దినమొక నరకంగా బతుకుతున్నాం.



నాపేరు శ్రీపతి లక్ష్మి. మాది రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం సంకెపల్లి. భర్తకు పక్షవాతం వచ్చి చనిపోయిండు. నాకు ముగ్గురు కొడుకులు.. ముగ్గురు కూతుళ్లు. ఏం లాభం.. బుక్కెడు అన్నం పెట్టేందుకు ఎవరికీ చేతులు రావడం లేదు. అందరూ కలిసి ఇంట్లోంచి వెళ్లగొట్టారు. తెలిసినోళ్లు గోదావరిఖనిలోని ఆశ్రమంలో ఉంచారు. కొన్నేళ్లుగా ఇక్కడే బతుకుతున్న. కడుపున పుట్టిన ఆరుగురు ఉన్నా అనాథగా ఉంటున్న.



జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామానికి చెందిన కట్కూరి రాజయ్య, రాజవ్వ దంపతులకు ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. ఎవరికి వారు బతుకుతున్నారు. కొడుకులు ముగ్గురూ వంతులవారీగా తల్లిదండ్రుల బాగోగులు చూస్తున్నారు. అయితే.. వృద్ధాప్యానికి తోడు రాజయ్య దంపతులను అనారోగ్య సమస్యలు వెంటాడాయి. ఆస్పత్రిలో చూపించుకునేంత స్తోమత లేదు. కొడుకులను ఇబ్బంది పెట్టేందుకు ఇష్టం లేదు. ఈ క్రమంలో గతేడాది నవంబరు 10వ తేదీన దంపతులు ఇద్దరూ సూసైడ్ నోటు రాసి ఆత్మహత్య చేసుకున్నారు. తమ చావుకు ఎవరూ కారణం కాదని.. నోటులో రాశారు.

నవమాసాలు మోసి పురిటినొప్పులను ఆనందంగా భరిస్తుంది తల్లి. తన రక్తాన్ని పాలుగా మలిచి ఆకలిని తీరుస్తుంది. బిడ్డకు చిన్న ఆపదొచ్చినా.. కన్నపేగు విలవిల్లాడుతుంది.

బుడిబుడి అడుగులు వేసే సమయంలో వెన్నంటే ఉంటాడు నాన్న. జీవితంలో తప్పటడుగులు వేయకుండా దారి చూపుతాడు.

పిల్లలు భవిష్యత్‌లో ఇబ్బంది పడొద్దని అన్ని విధాలా సమకూరుస్తారు తల్లిదండ్రులు. సమాజంలో దర్జాగా తిరిగేలా చేస్తారు. పిల్లలను ఉన్నతంగా స్థిరపరిచేందుకు జీవితాన్నే దారబోస్తారు. అయితే.. రెక్కలొచ్చిన పక్షుల్లాగా.. కొందరు పిల్లలు మలివయసులో తల్లిదండ్రులను అనాథలను చేస్తున్నారు. తమకు భారంగా ఉంటున్నారని ఆశ్రమాల్లో వదిలేస్తున్నారు. వృద్ధాప్యంలో పిల్లలకు భారం కావొద్దని కొందరు తనువు చాలిస్తున్నారు.

- సాక్షి, కరీంనగర్ డెస్క్

మారుతున్న కాలం..

ఒకప్పుడు కుటుంబం అంటే తల్లి,తండ్రి.. కొడుకు, కోడలు.. పిల్లలుగా భావించేవారు. ఇప్పుడు పెళ్లయిన కొన్నాళ్లకే తల్లిదండ్రులను దూరం పెడుతున్నారు. వారి నుంచి సంక్రమించే ఆస్తిపాస్తులు దక్కించుకుని తల్లిదండ్రులను కూడా పంచుకుంటున్న ఘటనలు తరుచూ కళ్లముందు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల అయితే ఆస్తిని దక్కించుకుని తల్లిదండ్రులను దూరం కొడుతున్నారు. మరికొందరైతే ఉద్యోగం రీత్యా దంపతులు ఇద్దరూ బిజీగా ఉంటున్నామని తల్లిదండ్రులను ఆశ్రమాల్లో అప్పగించేస్తున్నారు. వారికి నెలకు కావాల్సిన భత్యం కూడా నిర్వాహకులకు అందిస్తున్న వైనం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు వృద్ధాశ్రమాల్లో కనిపిస్తోంది.

ఆదరణ లేక.. ఆరోగ్యం సహకరించక..

పిల్లలు జీవితంలో స్థిరపడిన తరువాత తల్లిదండ్రులు కోరుకునేది వారి నుంచి ప్రేమను మాత్రమే. అయితే ఆ ప్రేమను పొందలేక.. ఆదరణ లభించక చాలా మంది వృద్ధులు కుమిలిపోతున్నారు. మలివయసులో వెంటాడుతున్న అనారోగ్య సమస్యలతో కొడుకులకు భారం కావొద్దని జగిత్యాల జిల్లాలో ఓ వృద్ధ జంట ఆత్మహత్య చేసుకోవడం విషాదం నింపింది. కొడుకులకు లక్షల ఆస్తిని పంచి ఇచ్చినా బుక్కెడు బువ్వ పెట్టకుండా తండ్రిని గ్రామపంచాయతీ వద్ద వదిలివెళ్లిన ఘటన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలో చోటుచేసుకుంది. గతేడాది సెప్టెంబరు 13న వేములవాడ రూరల్ మండలం పట్టెంల గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారిని కలిసి తన కొడుకు పైసలిస్తలేడని ఎట్ల బతకాలి అని ఫిర్యాదు చేశాడు. ఇవే కాదు.. జిల్లాలో వెలుగులోకి రాని ఘటనలు నిత్యం ఏదో ఒక చోట జరుగుతున్నాయి. తమకొడుకులు పట్టించుకోవడం లేదని నిత్యం ఏదో ఒక పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు పండుటాకులు. అనారోగ్యం.. ఆర్థిక, కుటుంబ సమస్యలు... పిల్లలు చేరదీయక పోవడంతో రెండేళ్ల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో 120 మందికి పైగా వృద్ధులు ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి.



వృద్ధుల రక్షణ చట్టం

2007లో 'తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ చట్టం'ను పార్లమెంట్ ఆమోదించింది. తల్లిదండ్రుల విషయంలో వారి పిల్లలు వ్యతిరేక ధోరణితో అనుసరిస్తున్న వైఖరికి ఈ చట్టం రక్షణగా నిలుస్తోంది. తల్లిదండ్రులను నిరాధరణకు గురిచేసినవారికి 3నెలల జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తారు. తల్లిదండ్రుల పోషణ, వైద్యానికి అయ్యే ఖర్చులు కూడా చెల్లించాలని చట్టం నిర్దేశిస్తోంది. తల్లిదండ్రులకు ఏమైనా స్థిరాస్తులు ఉంటే వాటిని పొందడానికి కూడా వీలులేకుండా వారసులను అనర్హులుగా నిర్ణయించవచ్చు. ప్రతీ జిల్లాలో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి అభాగ్యులైన వృద్ధ దంపతులకు అండగా నిలిచే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని చట్టం చెబుతోంది. ట్రిబ్యునల్ నిర్ణయం మీద అప్పీలు ఉండదు. కేసు పెండింగ్‌లో ఉన్నకాలంలో నెలసరి భత్యం కూడా చెల్లించాలి. విచారణ చేపట్టే ముందు తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య సయోధ్య చేపట్టాలి. ఈ చట్టం కింద తాత, అమ్మమ్మ, నాయనమ్మల పోషణ కూడా కొడుకులు, మనవలు, దత్తపుత్రుల బాధ్యత. అయితే మైనర్లకు మాత్రం ఈ చట్టం మినహాయింపు ఇచ్చింది.

40 కరీంనగర్‌లోని బైపాస్ రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో ప్రస్తుతం ఉంటున్న వారు.

45 కరీంనగర్‌లోని మానేరు డ్యాం సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న వాసవి వృద్ధుల ఆశ్రమంలో ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నవారు.

15 కరీంనగర్‌లోని అమ్మ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న వారి సంఖ్య. ఇదీ నగరంలోని యజ్ఞవరాహస్వామి ఆలయం సమీపంలో ఉంటుంది.

60 కరీంనగర్ రూరల్ మండలం పరిధిలోని ఇరుకుల్ల గ్రామంలో ఉన్న పద్మనాయక వృద్ధుల ఆశ్రమంలో ఉన్నవారి సంఖ్య.

14 సిరిసిల్ల పరిధిలోని రగుడుశివారులో టీటీ భూంరావు ఆశ్రమంలో ఉంటున్న వృద్ధుల సంఖ్య. ఇందులో 8మంది మహిళలు.. ఆరుగురు పురుషులు ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నారు.

21 తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లగిశెట్టి విశ్వనాథం ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులు. ఇందులో పదిహేను మంది మహిళలు.. ఆరుగురు పురుషులు ప్రస్తుతం ఉంటున్నారు.

19 రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని 'మా' అనాథ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న వారు.

14 పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని పట్టణంలో శ్రీధర్మశాస్త్ర ఆశ్రమం 30మందితో 2012లో ప్రారంభం అయ్యింది. ప్రస్తుతం 14మంది వృద్ధులు ఉంటున్నారు.

అసెంబ్లీ జంగ్‌లో పతంగ్..!

- అక్బర్ పోటీ చేస్తామన్న 50 స్థానాల్లో కరీంనగర్
- పోటీకి సిద్ధంగా ఉండాలని దారుస్సలాం సంకేతాలు
- డివిజన్ల వారీగా 60వేల ముస్లిం ఓటర్ల సమాచారం సిద్ధం
- 30 వేల ఎస్సీలు తమతో కలిసి వస్తారని మజ్లిస్ ధీమా
- కొత్త ఓటర్ల నమోదుకు డివిజన్ల పర్యటన
- ప్రత్యేక యాప్‌తో నిరంతర పర్యవేక్షణ



పార్టీ పతాకం...ఎంఐఎం అధినేత ఒవైసీ(ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'షహర్ హమారా.. మేయర్ హమారా' అంటూ హైదరాబాద్ పాతబస్తీలో మొదలైన ముస్లిం ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) ప్రస్థానం క్రమంగా జాతీయ పార్టీగా రూపాంతరం చెందుతోంది. గతవారం అసెంబ్లీలో మజ్లిస్ శాసనసభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ వచ్చే ఎన్నికల్లో తాము రాష్ట్రవ్యాప్తంగా 50 స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించి సంచలనానికి తెరతీశారు. పార్టీ ఆవిర్భావం నుంచి మజ్లిస్ పాతబస్తీ పార్టీగానే అందరికీ తెలుసు. పాత హైదరాబాద్‌లోని గుల్బర్గా (కర్ణాటక), మరాఠ్వాడా (మహారాష్ట్ర) తెలంగాణ లోకల్ బాడీస్‌కే పరిమితమైంది. 2014లో మహారాష్ట్ర అసెంబ్లీలో అడుగుపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ తరువాత ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్, గుజరాత్ రాష్ట్రాల్లో పోటీ చేసింది. అయితే, సొంతరాష్ట్రంలో మాత్రం పార్టీని విస్తరించలేకపోతున్నారు అన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో రానున్న 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పాతబస్తీ దాటికి బయటికి రావాలని మజ్లిస్ సంచలన ప్రకటన చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

కరీంనగర్‌లో 60 వేల ఓట్లు..!

ప్రస్తుతం కరీంనగర్ ఓటర్ల సంఖ్య 3.30 లక్షలపైమాటే. అందులో 59,270 వరకు ముస్లిం ఓట్లు ఉన్నాయి. మజ్లిస్ ప్రకటన ఆకస్మికంగా చేసింది కాదు. దీని వెనక పెద్ద కసరత్తే జరిగినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లా కేంద్రాలతోపాటు తమకు బలం ఉన్న 50 స్థానాల్లో పోటీ చేయాలన్న ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. అందులో భాగంగానే ఎంపిక చేసిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉన్నాయని సమాచారం. ఇందుకోసం కరీంనగరంలోని ఓటర్ల సమాచారం మొత్తం సేకరించారు. దారుస్సలాం ఆదేశాల మేరకు.. ప్రత్యేక యాప్‌లో మొత్తం ఓటర్ల సమాచారం నిక్షిప్తం చేశారు. మొత్తం దాదాపు 390 పోలింగ్ బూత్‌ల వారీగా.. హిందూ, ముస్లింలు.. బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, పురుషులుగా విభజించారు. కరీంనగర్‌లో 30 వేలకుపైగా ఉన్న ఎస్సీలు తమతో కలిసి వస్తారన్న ధీమాతో మజ్లిస్ ఉంది.

కొత్త ఓట్ల నమోదుకే డివిజన్ల పర్యటన..

కరీంనగర్‌లో 60 వేలకుపైగా ఓటర్ల బలం ఉన్న నేపథ్యంలో పోటీ చేసే పరిస్థితి వచ్చినా.. మద్దతిచ్చే నిర్ణయం తీసుకున్నా.. దేనికైనా సిద్ధంగా ఉండాలని దారుస్సలాం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ సిద్ధంగా ఉన్నారని సమాచారం. అందుకే.. ఇప్పటి నుంచే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు వారం రోజులుగా డివిజన్ల పర్యటనకు ఎంఐఎం శ్రీకారం చుట్టింది. తమ ఓటర్లు ఉన్న 35 డివిజన్లలో కొత్త ఓటర్లను నమోదు చేయించాలన్నది దీని వెనక అసలు ఉద్దేశం. ఇప్పుడున్న ఓటర్లకు కనీసం నాలుగైదు వేలు యువ ఓటర్లు ఉంటారని స్థానిక నాయకులు అంచనా వేస్తున్నారు.

ఎంఐఎం వెంట ఎస్సీలు నడుస్తారా?

మొత్తం కరీంనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌ను మజ్లిస్ కులం, మతం అనే అంశాల ఆధారంగా డేటా వర్గీకరించింది. 81.5% హిందూ జనాభా, 18.5% ముస్లిం జనాభా అని రెండు రకాలుగా విభజించింది. అందులో హిందువుల్లో 81.5% మందిలో మరో 14.5% వరకు అంటే దాదాపు 30 వేల నుంచి 40 వేల వరకు ఎస్సీలు కూడా ఉన్నారని.. మొత్తం తమకు 80 వేలమంది మద్దతు దొరుకుతుందని ఎంఐఎం ధీమాగా ఉంది. అదే సమయంలో నగరంలో ఉన్న ముస్లింలలో ఎందరు ఎంఐఎం వెంట నిలుస్తారు? రూ.10 లక్షల ఆర్థిక సాయంతో దళిత బంధులాంటి భారీ సంక్షేమ పథకాలు అమలువుతున్న నేపథ్యంలో ఎస్సీలు మజ్లిస్‌కు మద్దతిస్తారా? అన్న సవాళ్లు మజ్లిస్‌ను వేధిస్తూనే ఉన్నాయి. అందుకే.. అసలు మజ్లిస్ కరీంనగర్‌లో పోటీ చేస్తుందా? లేక మిత్రపక్షం బీఆర్‌ఎస్‌తోనే కలిసి నడుస్తుందా? అన్న ప్రశ్నకు మరికొన్ని రోజుల్లోనే సమాధానం దొరకనుంది.

శాసనమండలిలో మనోళ్లకు చోటు

- చీఫ్‌విప్‌గా భానుప్రసాద్.. విప్‌గా కౌశిక్



భానుప్రసాద్‌రావు



కౌశిక్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా శాసన మండలికి ఎన్నికైన తానిపర్తి భానుప్రసాద్‌రావును చీఫ్‌విప్‌గా, ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డిని విప్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

→ భానుప్రసాద్‌రావు 2009లో కాంగ్రెస్ నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం టీఆర్‌ఎస్ పార్టీలో చేరి 2014లో మరోసారి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. ముచ్చటగా మూడోసారి మళ్లీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా 2021 డిసెంబర్ 14న జరిగిన ఎన్నికల్లో గెలుపొందారు. గతంలో భానుప్రసాద్‌రావు శాసనమండలి విప్‌గా పనిచేశారు.

→ శాసనమండలి విప్‌గా ఎంపికైన పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ నుంచి 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం కాంగ్రెస్ క్యాడర్‌తో సహా టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కౌశిక్‌రెడ్డిని మొదటగా గవర్నర్ కోటా నుంచి ఎమ్మెల్సీగా ప్రభుత్వం నామినేటెడ్ చేయగా గవర్నర్ నిరాకరించారు. దీంతో ఆయనను ఎమ్మెల్యేల కోటా కింద శాసనసమండలికి పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. తాజాగా శాసనమండలి విప్‌గా కేబినెట్ ర్యాంకును కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బీఆర్‌ఎస్ పార్టీని కరీంనగర్ జిల్లాలో తిరుగులేని శక్తిగా తయారు చేసేలా అధిష్టానం నిర్ణయం తీసుకుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

25 ఏళ్ల ముందుచూపుతో ప్రగతి బడ్జెట్



మాట్లాడుతున్న కిశోర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: రాబోయే 25 ఏళ్ల దేశ భవిష్యత్తుకు ముందుచూపుతో దేశ దిశ దశా మార్చే ప్రగతి బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిశోర్‌రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అధ్యక్షతన శనివారం కరీంనగర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వ్యాపారస్తులు, సామాజికవేత్తలు, ఆర్థిక నిపుణులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యుల ఆకాంక్షలను, అన్ని వర్గాల కలలను సాకారం చేసే సంక్షేమ బడ్జెట్ అని, అమృత్ కాల్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా చరిత్రాత్మకమైందన్నారు. సామాన్యుడికి ఉపశమనం కలిగించేలా పన్ను స్లాబులు ఆరు నుంచి ఐదుకు తగ్గించడమే కాకుండా పన్ను మినహాయింపు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు పెంచడంతో అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, ప్రజ్ఞా భారతి జిల్లా అధ్యక్షుడు నిరంజనచారి సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ కన్న కృష్ణ, జడల శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు



రాజయ్యను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

చిగురుమామిడి(హుస్నాబాద్‌): మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన కక్కెర్ల రాజయ్య(35) అనే గీతకార్మికుడు ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడడంతో తీవ్రగాయాలు అయ్యాయి. వృత్తిలో భాగంగా శనివారం తాటిచెట్టు ఎక్కి కల్లు దింపేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కాలుజారి రాజయ్య కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనం సాయంతో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన రాజయ్యకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలని గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్‌కుమార్‌ కోరారు.

నిందితుడి అరెస్టు

సైదాపూర్‌: మండలంలోని గొడిశాలలో ఇటీవల భూ తగాదాలో వల్లెపు కొమురయ్యపై అదే గ్రామానికి చెందిన మొట్లపల్లి తిరుపతి దాడి చేయగా.. శనివారం అరెస్టు చేసినట్లు హుజూరాబాద్‌ రూరల్‌ సీఐ జనార్దన్‌ తెలిపారు. భూ తగాదాలో తిరుపతి బండరాయితో కొమురయ్య తలపై బాదాడు. తీవ్రంగా గాయపడిన కొమురయ్య చికిత్స పొందుతూ ఈ నెల 8న హన్మకొండలోని ఆస్పత్రిలో చనిపోయాడు. నిందితుడు తిరుపతిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ జనార్దన్‌ తెలిపారు. కార్యక్రమంలో సైదాపూర్‌ ఎస్‌ఐ ఆరోగ్యం ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ధర్మపురి: రోడ్డు పక్క నుంచి కాలినడకన వెళ్తున్న వ్యక్తిని కారు వెనుకనుంచి ఢీకొట్టడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన కుంటాల బీరయ్య(40) శనివారం రాత్రి కిరాణంలో వస్తువులు కొనుగోలు చేసేందుకు రోడ్డు పక్కనుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. వెనుక నుంచి అతి వేగంగా దూసుకు వచ్చిన కారు బలండగా ఢీకొట్టడడంతో బీరయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు కొంతకాలం క్రితమే చనిపోయారు. బీరయ్య తన అక్కాబావల సంరక్షణలో ఉంటున్నాడు. మృతుడు అవివాహితుడు. సమాచారం అందుకున్న ఏఎస్సై రాజు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాలలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

ఢీకొట్టి.. 50 మీటర్లు ఈడ్చుకెళ్లి!

- బైక్‌పై వెళ్తున్న యువకుడిని ఢీకొట్టిన టాటాఏస్‌
- కొద్దిదూరం ఈడ్చుకెళ్లడంతో ఘటనాస్థలంలోనే మృతి
- మృతుడు మిషన్‌ భగీరథలో పంపు ఆపరేటర్‌
- మానకొండూర్‌ మండలం కొండపల్కలలో విషాదం



వాహనం కింద చిక్కుకున్న శ్రీకాంత్‌



వాహనాన్ని లేపుతున్న స్థానికులు



శ్రీకాంత్‌(ఫైల్‌)

మానకొండూర్‌: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని టాటాఏస్‌ వాహనం వెనకనుంచి ఢీకొట్టింది. 50 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో యువకుడు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటన మానకొండూర్‌ మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామశివారులో కరీంనగర్‌–వరంగల్‌ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మానకొండూర్‌ మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన సైండ్ల శ్రీకాంత్‌(30) మిషన్‌ భగీరథ పథకంలో పంపుఆపరేటర్‌గా ఖాదర్‌గూడెం సంపులో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం నైట్‌డ్యూటీ ఉండగా.. విధులకు హాజరయ్యాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై సంపు వైపు నుంచి మానకొండూర్‌ వైపు వెళ్తున్నాడు. ఇదే సమయంలో వరంగల్‌ వైపునుంచి టాటాఏస్‌ వాహనంలో కొందరు వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్తున్నారు. ఖాదర్‌గూడెం గ్రామశివారులో టాటాఏస్‌ వాహనం శ్రీకాంత్‌ వెళ్తున్న బైక్‌ను వెనకనుంచి ఢీకొట్టింది. శ్రీకాంత్‌ టాటాఏస్‌ వాహనం కింద పడ్డాడు. వాహనం వేగంగా ఉండడంతో అదే వేగంతో 50 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో అతడి శరీర అవయవాలకు తీవ్రగాయాలు అయ్యాయి. వాహనం కింద ఇరుక్కుని కొంతసేపు ప్రాణప్రాయస్థితిలో కొట్టుమిట్టాడగా.. స్థానికులు వాహనం కింద ఇరుక్కుపోయిన శ్రీకాంత్‌ను బయటకు తీశారు. కొంతసేపటికి తుదిశ్వాస విడిచాడు. కాగా.. ఎదురుగా వస్తున్న ఓ కారు శ్రీకాంత్‌ నడుపుతున్న ద్విచక్రవాహనానికి తగలడంతో అదుపుతప్పి తమ వాహనం కింద పడ్డాడని దైవదర్శనానికి టాటాఏస్‌ వాహనంలో వెళ్తున్నవారు చెబుతున్నారు. కాగా.. శ్రీకాంత్‌ మృతితో కొండపల్కలలో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన సైండ్ల చంద్రమౌళి, ప్రమీలకు ఇద్దరు కుమారులు సంతానం. శ్రీకాంత్‌ పెద్ద కుమారుడు. వీరిది వ్యవసాయ కుటుంబం. శ్రీకాంత్‌ మూడేళ్లుగా మిషన్‌భగీరథ పథకంలో పనిచేస్తున్నాడు. అందరితో కలివిడిగా ఉండే శ్రీకాంత్‌ మృతి చెందడంతో గ్రామస్తులు విషాదంలో మునిగారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి, మృతదేహాన్ని కరీంనగర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జాతీయ మహాసభలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న అంబటి జోజిరెడ్డి

- ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి

కరీంనగర్‌: ఈ నెల 23 నుంచి 26వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఆల్‌ ఇండియా ఫార్వార్డ్‌ బ్లాక్‌ పార్టీ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఉపాధ్యకుడు అంబటి జోజిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఏఐఎఫ్‌బీ ఉత్తర తెలంగాణ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గవ్వ వంశీధర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ఆల్‌ ఇండియా ఫార్వార్డ్‌ బ్లాక్‌ పార్టీ జాతీయ మహాసభలకు దేశవ్యాప్తంగా 500కు పైగా ప్రతినిధులు రానున్నట్లు తెలిపారు. మరో 25 దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఆల్‌ ఇండియా ఫార్వార్డ్‌ బ్లాక్‌ పార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగనుందని అన్నారు. రాబోయే ఎన్నికలలో తెలంగాణలో 119స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణలో వైశ్య కార్పొరేషన్‌, రెడ్డికార్పొరేషన్‌ ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీ చొప్పదండి కన్వీనర్‌ పెద్దెల్లి శేఖర్‌, జిల్లా ఆర్గనైజింగ్‌ సెక్రటరీ పులిమాటి సంతోశ్‌కుమార్‌, టీయూసీసీ జిల్లా అధ్యక్షుడు సత్యరావ్‌, జిల్లా కార్యదర్శి శంకర్‌ కురువెల్లి, పార్టీ సభ్యులు లింగమూర్తి, కిషన్‌బాబు, వినయ్‌, రమేశ్‌, హరీశ్‌, వాసు, రాజు, విజయ్‌, బుచ్చిరావు, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మల్యాల(చొప్పదండి):బహిర్భూమి కోసం వెళ్లి ప్ర మాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మల్యాల మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్‌ మండలం టీఆర్‌ నగర్‌కు చెందిన షేక్‌ ఖాదర్‌(47)ను భార్య గతంలోనే వదిలేసి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసై, భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 8న సాయంత్రం నుంచి ఖాదర్‌ కనపడకుండా పోయాడు. టీఆర్‌నగర్‌ సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ఖాదర్‌ చెప్పులు ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. కాలువలో పడి ఉంటాడని కాలువ వెతకగా, లంబాడిపల్లి సమీ పంలోని ఎస్సారెస్పీ సైఫన్‌ వద్ద శవమై కనిపించాడు. శవాన్ని బయటకు తీశారు. మృతుడి అన్న షేక్‌ ఖలీల్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

కళ్లెదుటే కొడుకు దుర్మరణం..

- కుక్కను తప్పించబోయి అదుపుతప్పిన కారు
- తాటిచెట్టుకు ఢీకొని బాలుడి మృతి
- తల్లిదండ్రులకు గాయాలు



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు



సాత్విక్‌ రెడ్డి(ఫైల్‌)

జగిత్యాలక్రైం: అమ్మానాన్నలతో కలిసి ఓ శుభకార్యానికి హాజరై తిరిగి కారులో వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఏలేటి సాత్విక్‌రెడ్డి(12) దుర్మరణం చెందాడు. కళ్లెదుటే కన్నకొడుకు మృతి చెందడంతో ఆ దంపతుల దుఃఖానికి అవధుల్లేకుండా పోయాయి. జగిత్యాల రూరల్‌ మండలం హబ్సీపూర్‌ గ్రామానికి చెందిన ఏలేటి మహిపాల్‌– మౌనిక దంపతులు తమ కుమార్తె సహస్ర, కుమారుడు సాత్విక్‌రెడ్డితో కలిసి శుక్రవారం రాత్రి సుమారు 3 కి.మీ. దూరంలోని తక్కళ్లపల్లి గ్రామంలో జరిగే ఓ శుభకార్యానికి కారులో వెళ్లారు. బంధువులతో కలిసి ఎంతో ఉల్లాసంగా గడిపారు. శుభకార్యం పూర్తయ్యాక విందు భోజనం చేశారు. రాత్రి సమయంలో స్వగ్రామానికి బయలు దేరారు. మహిపాల్‌ కారు నడుపుతున్నాడు. ఓ పదినిమిషాల్లో ఇంటికి చేరుకునేవారు. అంతలోనే ఓ కుక్క అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న తాటిచెట్టును ఢీకొట్టింది. ముందుసీట్లో ఉన్న మహిపాల్‌, భార్య మౌనికకు గాయాలయ్యాయి. వెనుకసీట్లో కూర్చున్న సాత్విక్‌రెడ్డి కారులోంచి ఎగిరి రోడ్డుపై మృతి చెందాడు. అప్రమత్తమైన సహస్ర తమ బంధువులకు ఫోన్‌ ద్వారా సమాచారం అందించింది. వారు సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

తమ్మా ఎప్పుడు వస్తావు..

కారు ప్రమాదంలో సాత్విక్‌రెడ్డి మృతి చెందగా అతడి అక్క సహస్ర ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకుంది. అయితే, తన తమ్ముడు మృతి చెందాడని తెలిసి 'తమ్మా.. నువ్వు ఎప్పుడు వస్తావు' అని రోదించడం పలువురిని కన్నీరు పెట్టించింది. గాయాలపాలైన తల్లితండ్రులు.. తమ కళ్ల ముందే కొడుకు మృతి చెందడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. సాత్విక్‌రెడ్డి తిప్పన్నపేటలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. విద్యార్థి మృతితో పాఠశాల యజమాన్యం శనివారం పాఠశాలకు సెలవు ప్రకటించింది. సాత్విక్‌రెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సందర్శించారు.

ఎంపీ సంజయ్‌ వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న జీవీ రామక్రిష్ణారావు

- బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్ణారావు

కరీంనగర్‌: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ సెక్రటేరియట్‌ గుమ్మటాలను కూల్చేస్తామని చేసిన వ్యాఖ్యలు ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్ణారావు అన్నారు. శనివారం తారక హోటల్‌లో మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే సచివాలయం పైన ఉన్న గుమ్మటాలను కూల్చేస్తామని మాట్లాడుతున్న సంజయ్‌కి ధైర్యం ఉంటే ఎర్రకోటపై గుమ్మటాలు ఉన్నాయని, సుప్రీంకోర్టు, అసెంబ్లీ, హై కోర్టు, నిజాం ప్యాలెస్‌తో పాటు చాలా చోట్ల ప్రాచీన కట్టడాలను గుమ్మటాలతోటే కట్టారని వాటిని కూల్చివేయాలని సవాల్‌ విసిరారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్‌, కర్ణాటక రాష్ట్రాల అసెంబ్లీ భవనాలపైన గుమ్మటాలు ఉన్నాయని వాటిని కూల్చివేస్తారా అని ప్రశ్నించారు. నిత్యం కులమతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, రాజకీయాలను కలుషితం చేయడం ఎలాగైనా సరే తెలంగాణలో అధికారంలోకి రావాలనే యావ తప్ప మరోటి లేదని మండిపడ్డారు. బండి సంజయ్‌ మాటల ధోరణితో కరీంనగర్‌ ప్రజలు సిగ్గుపడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ఎంపీ బండి సంజయ్‌ విద్వేష పూరిత మాటలు ఉపసంహరించుకుని తెలంగాణచౌక్‌లో బహిరంగ క్షమాపణలు చేయాలని డిమాండ్‌ చేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ పొన్నం అనిల్‌గౌడ్‌, మానకొండూర్‌ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్‌, సుడా సభ్యులు చీటీ రాజేందర్‌రావు, తోట మధు, బీఆర్‌ఎస్‌ నగర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి,చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

జెన్‌పాక్ట్‌ సంస్థకు అల్ఫోర్స్‌ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): కరీంనగర్‌ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్‌ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు బి.గ్రీష్మ, బి.ఆశ్రిత, రహత్‌ ఉన్నీసా బేగం, షైకానిమ్రాలు ఇటీవల టాస్క్‌ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో జెన్‌పాక్ట్‌ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికై నట్లు ఆ కళాశాల కరస్పాండెంట్‌ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం విద్యార్థులను అభినందించిన ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రథమ సంవత్సరం నుంచే విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్య మెలకువలు నేర్పించడం మూలంగానే ప్రతిభావంతులుగా రాణిస్తూ పలు దేశీయ కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్‌ జి.శ్రీనివాస్‌, వైస్‌ప్రిన్సిపల్‌ డా.బి.విజయలక్ష్మి, టాస్క్‌ జిల్లా సమన్వయకర్త ఎ.గంగాప్రసాద్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం.. రూ.4లక్షల ఆస్తినష్టం



కాలిపోయిన సామగ్రి

జమ్మికుంట(హుజూరాబాద్‌): మండలంలోని మడిపల్లిగ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో దుగోడమిషన్‌, దర్వాజ, తలుపులు, కర్రసామగ్రి శుక్రవారం దగ్ధమైంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దోజు వీరన్న, అతని కొడుకు రాజేశ్‌ గ్రామంలో వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పనిముగించుకుని కర్ర, సామగ్రిని ఇంటిపక్కన గల షెడ్డులో భద్రపరిచారు. అర్ధరాత్రి సమయంలో షెడ్‌లో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు వీరన్నకు సమాచారం ఇచ్చారు. మంటలు అదుపుకాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4లక్షల కర్ర, సామగ్రి కాలిపోయింది. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్‌ ముగల పరశురాములు, ఎగ్గెటి హరీశ్‌ కోరారు.

విద్యుత్‌ బిల్లు పేరుతో సైబర్‌ నేరగాళ్ల వల

జగిత్యాలక్రైం: వృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సైబర్‌ నేరగాళ్లు కూడా తమ మోసాలకు పదును పెడుతున్నారు. ఈ క్రమంలో విద్యుత్‌ బిల్లు బకాయిలు చెల్లించాలంటూ కొందరికి శనివారం మెసేజ్‌లు పంపించారు. బిల్లులు వెంటనే చెల్లించకుంటే కనెక్షన్‌ తొలగిస్తామని పేర్కొన్నారు. తక్షణమే 62979 61688 నంబరులో సంప్రదించాలని సూచించారు. బిల్లులు చెల్లించిన వారికి ఈ మేసెజ్‌ రావడంతో అప్రమత్తమైన వినియోగదారులు.. సైబర్‌ నేరగాళ్ల కుట్రను పసిగట్టి బూతులు తిట్టి ఫోన్‌ పెట్టేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రామగిరి: ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన దొంతరవేన సదయ్య (47) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెల్సిందే. అతడు చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. ఈనెల మూడో తేదీన కమాన్‌పూర్‌ మండలం గుండారం వద్ద బైక్‌ ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌ తరలించారు. మృతుడికి భార్య శంకరమ్మ, కుమార్‌, మహేశ్‌ ఉన్నారు.

కమాన్‌పూర్‌లో మరొకరు..

కమాన్‌పూర్‌: మండలంలోని జూలపల్లి శివారులో ఈనెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గోదావరిఖనికి చెందిన పబ్బ రాజేందర్‌(40) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. సెంటనరీకాలనీ వైపు నుంచి గోదావరిఖని వైపు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. బైక్‌ అదుపుతప్పి విద్యుత్‌ స్తంభానికి ఢీకొంది. అతడిని హైదరాబాద్‌లో నిమ్స్‌లో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి యువకుడి మృతి

- ఇంజక్షన్‌ ఇచ్చిన 15 నిమిషాలకు అస్వస్థత
- మృతుడి బంధువుల ఆందోళన
- సిరిసిల్లలో కిలోమీటరున్నర దూరం శవయాత్ర



సిరిసిల్ల ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుడి భార్య



సిరిసిల్లలో ఆందోళనకు దిగిన మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు



తిరుపతి(ఫైల్‌)

సిరిసిల్ల/చందుర్తి(వేములవాడ): ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మండలంలోని కొండాపూర్‌ పంచాయతీ పరిధిలోని హనుమాన్‌తండాలో శనివారం విషాదం నెలకొంది. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతోనే ప్రాణాలు పోయాయని.. న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు సిరిసిల్లలో ధర్నా చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాలు. లకావత్‌ తిరుపతి(30) రెండు రోజులుగా అనారోగ్యానికి గు రయ్యాడు. నిమ్మపల్లిలోని ఆర్‌ఎంపీ వైద్యుడు ప్రసాద్‌ వద్దకు వెళ్లగా అతను ఇంజక్షన్‌ ఇచ్చారు. తర్వాత 15 నిమిషాలకు తిరుపతి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆర్‌ఎంపీ వైద్యుడు తన కారులో సిరిసిల్లలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించాడు. ఆస్పత్రి లోపలికి తరలించే క్రమంలోనే తిరుపతి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుని బంధువులు, కుటుంబసభ్యులు కోనరావుపేట మండలం కొలనూర్‌ శివారులో శవంతో రోడ్డుపై బైఠాయించారు. చందుర్తి, సిరిసిల్ల పట్టణ సీఐలు కిరణ్‌కుమార్‌, అనిల్‌కుమార్‌ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడినా శాంతించలేదు. చివరికి సీఐలు జోక్యం చేసుకుని గొడవ సద్దుమణిగేలా చేశారు.

వారంలో గల్ఫ్‌ వెళ్లేవాడు

మరో వారం రోజుల్లో గల్ఫ్‌ వెళ్లేవాడు. గతంలో గల్ఫ్‌ వెళ్లి ఏడాన్నర క్రితమే స్వగ్రామం వచ్చి పెళ్లి చేసుకున్నాడు. మృతునికి ఏడాది కుమారుడు, భార్య భారతి ప్రస్తుతం గర్భవతి.

క్లీనిక్‌ సీజ్‌

గిరిజన యువకుడి మృతికి కారణమైన నిమ్మపల్లికి చెందిన ఆర్‌ఎంపీ చేపూరి ప్రసాద్‌ క్లీనిక్‌ను డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు శనివారం సాయంత్రం సీజ్‌ చేశారు. కోనరావుపేట మెడికల్‌ ఆఫీసర్‌ వేణుమాధవ్‌, వైద్య సిబ్బంది ఉన్నారు.

సిరిసిల్లలో ఉద్రిక్తం

తిరుపతి శవాన్ని నిమ్మపల్లికి తీసుకెళ్లి ఆర్‌ఎంపీ ఇంటి ముందు వేయాలని మృతుడి బంధువులు ప్రయత్నించారు. ఈక్రమంలో పోస్టుమార్టం వద్ద ఉన్న శవాన్ని ఎత్తుకొని వెళ్లేందుకు గ్రామస్తులు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అయినా.. పోలీసులను దూషిస్తూ మృతుడి బంధువులు కోనరావుపేటమార్గంలో ముందుకు సాగారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారి జరిగిన తోపులాటలో మృతుడి బంధువులు, పోలీసులు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల తీరును నిరసిస్తూ.. పలు చోట్ల శవంతో రాస్తారోకో చేశారు. అదనపు పోలీసు బలగాలను రప్పించి సిరిసిల్ల పట్టణ శివారులోని కొత్తచెరువు కట్ట వద్ద శవయాత్రను అడ్డుకున్నారు. ఎట్టకేలకు డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు అనిల్‌కుమార్‌, కిరణ్‌కుమార్‌, వెంకటేశ్‌, పలువురు ఎస్సైలు, మహిళా ఎస్సైలు, పోలీసులు తిరుపతి శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ఫలించని చర్చలు

ఆర్‌ఎంపీ వైద్యుడి ఇంజక్షన్‌ వికటించి తిరుపతి మరణించాడని, తిరుపతి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని మృతుడి కుటుంబ సభ్యులు డిమాండ్‌ చేశారు. సదరు ఆర్‌ఎంపీ డాక్టర్‌ ప్రసాద్‌ రూ.2లక్షలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం. తిరుపతి గతంలో ఉపాధి కోసం పదేళ్లపాటు గల్ఫ్‌ దేశాలకు వెళ్లి వచ్చాడు. అతని భార్య భారతి ఇప్పుడు గర్భవతి కాగా, కొడుకు స్నేహిత్‌, తల్లిదండ్రులు హంసవ్వ, గోపాల్‌ ఉన్నారు. తిరుపతి మృతి అటు కొండాపూర్‌హన్మాన్‌ తండాలో విషాదం నింపగా.. జిల్లా కేంద్రమైన సిరిసిల్లలో ఉద్రిక్తతకు దారితీసింది. సిరిసిల్ల పోస్టుమార్టం వద్ద శనివారం అర్ధరాత్రి వరకు పోలీసు బలగాలు రక్షణగా ఉన్నాయి. ఇరువర్గాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి.

క్లుప్తంగా

ఓటరు కార్డుకు ఆధార్ లింక్



బొమ్మకల్‌లో ఓటరు కార్డుకు ఆధార్‌లింక్ చేస్తున్న బీఎల్‌వోలు

కరీంనగర్‌రూరల్: మండలంలోని బొమ్మకల్, తీగలగుట్టపల్లిలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శనివారం ఓటరు కార్డుకు ఆధార్‌లింక్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా గ్రామాల్లో వలస కార్మికులు, స్థానికేతరులు ఎక్కువ సంఖ్యలో ఓటర్లుగా ఉన్నారు. అయితే ఓటరు కార్డుకు ఆధార్ లింక్ చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆధార్ లింక్ చేయని ఓటర్లను బీఎల్‌వోలు గుర్తించి అప్పటికప్పుడే లింక్ చేశారు. కార్యక్రమాల్లో నాయబ్ తహసీల్దార్ శంకర్, ఆర్‌ఐలు రజనీకాంత్, అస్రాతోపాటు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యానగర్: బహుజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర, జిల్లా శాఖల ఆధ్వర్యంలో ముద్రించిన 2023 క్యాలెండర్‌ను శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 317 జీవోతో జిల్లాల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు మరో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మానుపాటి రాజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మడి సుధీర్, బెజుగం రమేష్, గౌరవ సలహాదారు చిలుక దేవశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం అంజన్‌బాబు, నాయకులు మల్లేశం, రాజు, దేవదాస్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో చాదర్ సమర్పణ



చాదర్‌తో బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు

కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ దేశంలో అధికారంలోకి రావాలని, కేసీఆర్ ప్రధానమంత్రి కావాలని ఆ పార్టీ మైనార్టీ నాయకుడు షేక్ యూసుఫ్ ఆధ్వర్యంలో అజ్మీర్ షరీఫ్ దర్గాలో చాదర్ సమర్పించారు. బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ మళ్లీ కరీంనగర్ ఎంపీగా, గంగుల కమలాకర్ కరీంనగర్ ఎమ్మెల్యేగా నాల్గోసారి గెలవాలని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వివేకానందలో ముగిసిన టాస్క్ శిక్షణ



టాస్క్ ట్రైనర్ రామకృష్ణను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

శాతవాహనయూనివర్సిటీ: నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఫండమెంటల్స్ ఆఫ్ అకౌంటింగ్‌పై మూడు రోజులపాటు జరిగిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అకౌంటింగ్ యొక్క ఆవశ్యకత ఎనలేనిదని, కంప్యూటర్ పరిజ్ఞానంతో అకౌంటింగ్ ప్రాముఖ్యత గల ఉపాధి అవకాశాలు పెరిగాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంపెనీ క్రియేషన్, లెడ్జర్ క్రియేషన్, జీఎస్టీ, రిపోర్ట్స్ తదితర అంశాల గురించి శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఏసీవో బి.సంపత్‌కుమార్, ఏవోటీ శ్రవణ్‌కుమార్, ఎస్.జస్వంత్‌సింగ్, బి.రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల నిర్వహణకు వేలం

మానకొండూర్: తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలో హోలీ సందర్భంగా నిర్వహించే శ్రీసీతారామ, లక్ష్మీనసింహస్వామి జాతరలో వివిధ దుకాణాల నిర్వహణకు సీల్డు టెండర్, బహిరంగం వేలం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆలయ ఈవో ఉడుతల వెంకన్న, ఆలయ చైర్మన్ దన్నమనేని శ్రీనివాసరావు తెలిపారు. 15న ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామని, కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర విక్రయానికి రూ.50 వేలు, పేలాలు, పుట్నాల విక్రయం, కొబ్బరి ముక్కల సేకరణకు రూ.10 వేల కనీస ధర నిర్ణయించామని వివరించారు. ఈనెల 26 నుంచి మార్చి 12వ తేదీ వరకు మాత్రమే హక్కులు వర్తిస్తాయని తెలిపారు. ఆసక్తిగలవారు ప్రతి వేలంకు దరావత్తు, షెడ్యూల్ ఫారం రూ.100 చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.



నృత్యం చేస్తున్న అల్ఫోర్స్ విద్యార్థినులు

అల్ఫోర్స్‌లో వీడ్కోలు హంగామా..

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ- టెక్నో స్కూల్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు హంగామా అలరించింది. కరీంనగర్ సూర్యనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం 'అల్ఫోర్స్ స్పెమ్-2023' పేరిట జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వీడ్కోలు సందర్భంగా వీఎస్‌ఆర్‌ను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పదో తరగతి తర్వాత ఎంచుకున్న కోర్సుల్లో చక్కగా రాణించి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని నరేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



పారమితలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

పారమిత హెరిటేజ్‌లో..

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్‌లో హస్త- ల- విస్తా పేరిట నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం అంబరాన్నంటింది. విద్యా సంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పారమిత విద్యా సంస్థల్లో విద్యనభ్యసించి బయటకు వెళ్తున్న విద్యార్థులు సమాజంలో ప్రత్యేక గుర్తింపు సాధించడంతో పాటు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనుకర్‌రావు, ప్రసాద్, వినోద్‌రావు, ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య, గోపికృష్ణ, లక్ష్మీదీప్తి, రవీంద్రపాత్రో, హరిప్రియ, శ్రీలత, నవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అపూర్వ కాలేజీ విద్యార్థుల నృత్యం

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలుండాలి

శాతవాహనయూనివర్సిటీ: విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలుండాలని, పట్టుదలతో శ్రమిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శాతవాహన యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ శ్రీరంగప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం ఓ ఫంక్షన్ హాల్‌లో అపూర్వ ఆద్య పేరుతో అపూర్వ డిగ్రీ కళాశాలల ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితే కోరుకున్న కొలువు సాధించడం సులభతరమని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అపూర్వ కళాశాలల చైర్మన్ పి.వేణు, డైరెక్టర్ పి.అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్స్ వివి.మనోహర్‌రెడ్డి, కె.మనోహర్, ప్రతాప్, వైస్ ప్రిన్సిపాల్ కె.రవీందర్‌రెడ్డి, ఏవోపీ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సండే స్పెషల్

సంప్రదాయ సంబురం

- మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం
- భావితరాలకు ఆదర్శంగా కట్టు బొట్టు
- కళాశాలల వేడుకల్లో ట్రెండీగా ముస్తాబు
- చీరకట్టుతో యువతుల హుషారు
- సంప్రదాయాన్ని ప్రోత్సహిస్తున్న కళాశాలలు

శాతవాహనయూనివర్సిటీ: కళాశాల వేడుకల్లో యువతరం హుషారుగా పాల్గొంటోంది. అందంగా, ఆకర్షణీయంగా ముస్తాబవడంలో అమ్మాయిలు మరీ ప్రత్యేకం. నిత్యం చుడీదార్, జీన్స్, టీషర్ట్‌లలో కనిపించే యువతులు కళాశాల వేడుకల్లో సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసే విధంగా చీరకట్టుతో రెడీ అవుతున్నారు. కళాశాల వార్షికోత్సవాలు, స్వాగతోత్సవాలు, కళాశాలల్లో జరిపే వివిధ పండుగ కార్యాక్రమాలు, వేడుకల్లో సంప్రదాయ దుస్తులు ధరించి హంగామా చేస్తున్నారు. శనివారం నగరంలోని అపూర్వ డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవంలో సంప్రదాయ దుస్తులతో యువతులు సందడి చేశారు.



సంప్రదాయ దుస్తులతో వేడుకలకు హాజరైన విద్యార్థినులు

సంప్రదాయాలను అనుసరిస్తూ..

- మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయి. ముఖ్యంగా తెలంగాణ కట్టుబొట్టు అందరినీ ఆకర్షించేలా ఉంటుందని వివిధ రాష్ట్రాలు, దేశాలు కొనియాడాయి. మన పూర్వీకులు అందించిన సంప్రదాయాలను నేటి యువతరం అనుసరిస్తూ భావితరాలకు అందిస్తుంది. యువతులు, విద్యార్థినులు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచేందుకు చీరకట్టుతో ప్రత్యక్షమవుతూ తలుక్కుమంటున్నారు. హుషారుగా పాల్గొంటూ హంగామా సృష్టిస్తున్నారు. నగరంలోని వివిధ కళాశాలలు వార్షికోత్సవాలు జరిగినప్పుడు కచ్చితంగా సంప్రదాయ దుస్తులు ధరించేలా విద్యార్థులకు సూచనలివ్వడంతో అందరూ సంప్రదాయబద్ధంగా ముస్తాబై వస్తున్నారు. ఇదే కాకుండా ఏడాదిలో ఒకటి, రెండు సార్లు ట్రెడిషనల్ డే వేడుకలు చేసుకుంటూ సంస్కృతిని కాపాడుతున్నారు. సంప్రదాయాన్ని కొనసాగించడంలో కళాశాలల యాజమాన్యాలు కూడా తమ వంతు పాత్ర పోషిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

ముందుగానే చర్చించుకుంటాం



వేడుకల్లో సంప్రదాయ దుస్తుల్లో హాజరవ్వాలని అందరికీ ఆసక్తి ఉంటుంది. రోజూ వేసుకునే దుస్తులు కాకుండా ఆకర్షణీయంగా ఉండాలని ముందే అందరం చర్చించుకొని చీరకట్టుతో హాజరవుతాం.

– సుకీర్తి

ట్రెడిషనల్ లుక్‌తో..



కళాశాలల వార్షికోత్సవాలు జరిగినప్పుడు ట్రెడిషనల్ లుక్‌తో కనిపించడానికి ఉత్సాహం చూపిస్తారు. రోజూ వేసుకునే డ్రెస్‌లు కాకుండా మన సంస్కృతి ప్రతిబింబించేలా రెడీ అవుతాం.

– శివాని

మన సంస్కృతి గొప్పది



మన దేశ, తెలంగాణ రాష్ట్ర సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తాయి. అందరూ చీరకట్టును ఇష్టపడి విదేశీయులు సైతం చీరకట్టుకొని ముస్తాబవడం చూస్తుంటాం. కళాశాలలో జరిగే వేడుకలకు సంప్రదాయ దుస్తుల్లో హాజరవుతాం.

– వెన్నెల

హుషారుగా పాల్గొంటాం



కళాశాలల్లో కాలేజీ డేలు, వివిధ పండుగల నిర్వహణ, ఫ్రెషర్స్‌డే వంటి వేడుకలు జరిగినప్పుడు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని హుషారుగా పాల్గొంటాం. మన సంస్కృతిని భావితరాలకు అందించేలా ప్రత్యేకంగా ముస్తాబు అయి హాజరవుతాం.

– అభినయ

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న చైర్మన్ రాజు తదితరులు

కొత్తపల్లి: కొత్తపల్లి శివాలయం (శ్రీ సీతారామాంజనేయ సహిత సాయిబాబా ఆలయం)లో ఆదివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శనివారం ఆలయ ప్రాంగణంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ఆవిష్కరించారు. గణపతి పూజ, పార్థివ శివలింగం స్థాపనతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా 18న మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, ఏకదశా రుద్రాభిషేకం నిర్వహించడంతో పాటు 24న శివపార్వతుల కల్యాణ మహోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకుడు వాసాలమర్రి నాగరాజుశర్మ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వాసాల రమేష్, ఆలయ ప్రతినిధులు గున్నాల రమేష్, బి.గోపాల్‌రెడ్డి, స్వర్గం నర్సయ్య, చంద్రశేఖర్, జనార్దన్, కృష్ణంరాజు, దత్తు, రమేష్, హరిప్రసాద్, శ్రీకాంత్, దామోదర్, మారుతి, నరేష్, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: స్మార్ట్‌సిటీ పనులు కొనసాగుతున్నందున ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్ 2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. 11 కేవీ అల్కాపురి ఫీడర్ పరిధిలోని అల్కాపురి, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

'స్మార్ట్' పనులతో బొమ్మకల్‌కు నీళ్లు బంద్

- డ్రైనేజీ నిర్మాణంతో పగిలిన పైపులైన్
- నెలరోజులుగా నీటి సరఫరా నిలిపివేత

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌లో చేపట్టిన స్మార్ట్‌సిటీ పనులు బొమ్మకల్ వాసులకు శాపంగా మారాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీన వైఖరితో జరుగుతున్న పనులతో ప్రజలకు తాగేందుకు నీళ్లు కరువైనాయి. సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులతో ప్రధాన పైపులైన్ పగిలిపోవడంతో నెలరోజుల నుంచి గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా సరిపోవడంలేదు.

నెలరోజుల క్రితం..

కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామానికి కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని హౌజింగ్‌బోర్డుకాలనీ వాటర్ ట్యాంకు నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. నెలరోజులక్రితం స్మార్ట్‌సిటీ నిధులతో వరహాలస్వామి గుడి నుంచి బొమ్మకల్ బైపాస్‌లోని లారీ అసోసియేషన్ చౌరస్తా వరకు సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను చేపట్టారు. డ్రైనేజీ నిర్మాణం కోసం జేసీబీతో కందకం తవ్వుతుండగా ప్రధాన పైపులైన్ పగిలిపోయింది. మరమ్మతు చేయించడంలో మున్సిపల్, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నెలరోజుల నుంచి గ్రామానికి తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో పంచాయతీ ఆధ్వర్యంలో మూడు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే నీళ్లు సరిపోకపోవడంతో మహిళలు స్థానికంగా ఉన్న బోర్లను ఆశ్రయిస్తున్నారు. నెలరోజుల నుంచి గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయినా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పైపులైన్ మరమ్మతు వెంటనే పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.



పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

పైపులైన్ మరమ్మతు పూర్తయింది

ప్రధాన పైపులైన్ పగిలిపోవడంతో గ్రామానికి మున్సిపల్ నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం పైపులైన్‌కు మరమ్మతు పనులు పూర్తయినవి. రెండు రోజుల్లో నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాము.

– హిదైతుల్లా, పంచాయతీ కార్యదర్శి, బొమ్మకల్

లింక్ రోడ్లకు మహర్దశ

- రూ.1.80 కోట్లతో బీటీరోడ్డు నిర్మాణం

కరీంనగర్‌రూరల్: గ్రామాల్లో లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ఆయా గ్రామాల్లోని లింక్‌రోడ్లను బీటీరోడ్లుగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తోంది. కొన్నేళ్లుగా సీతారాంపూర్ నుంచి ఆరెపల్లి, ఎలబోతారం మీదుగా ఫకీర్‌పేట వరకున్న లింక్‌రోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. రోడ్డంతా గుంతలేర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండగా, స్థానికులు దుమ్ముతో పడరానీపాట్లు పడ్డారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణానికి ఆర్ అండ్ బీ నిధులు రూ.1.80కోట్లు మంజూరైనాయి. ఈక్రమంలో నాలుగు రోజుల నుంచి సీతారాంపూర్ నుంచి ఆరెపల్లి రైల్వేగేటు వరకు బీటీరోడ్డు పనులు చేపట్టారు. ఇక్కడి వరకు బీటీ డబుల్‌లేయర్ వేస్తున్నారు. ఎలబోతారం నుంచి ఫకీర్‌పేట వరకు సింగిల్‌లేయర్ వేయనున్నారు. ప్రస్తుతం బీటీలేయర్ పనులు నడుస్తున్నాయని, నెలరోజుల్లోపు రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని ఆర్అండ్‌బీ డీఈ రవీందర్, ఏఈ లక్ష్మణ్‌రావు తెలిపారు.



ఆరెపల్లిలో బీటీరోడ్డు నిర్మాణం

కేంద్రం నిధులతోనే గ్రామాలు అభివృద్ధి

సైదాపూర్: కేంద్రం ఇచ్చే నిధులతోనే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి జరుగుతోందని బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రజా గోస బీజేపీ భరోసా నినాదంతో స్ట్రీట్ కార్నర్ సమావేశం మండల కమిటీ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో జీపీల నిర్వహణ, కేంద్రం విడుదల చేస్తున్న ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. కేంద్రం నిధులు ఇస్తే బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్‌కు పాలాభిషేకం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలుమల్లేశం, విజయ, సంతోష్, శ్రీరాంచక్రవర్తి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ 52 శాతానికి పెంచాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం

గన్నేరువరం: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ 27 నుంచి 52 శాతానికి పెంచాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం అన్నారు. రిజర్వేషన్ల పెంపుపై శనివారం గన్నేరువరంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ కులగణన చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు కేవలం ఆరు వేల కోట్లు కేటాయించడం అన్యాయమని పేర్కొన్నారు. అలాగే భూపంపిణీపై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని, నియోజకవర్గంలో 300 ఎకరాలు పేదలకు పంపిణీ చేయలేదని విమర్శించారు. గూడెంలో నేటికి లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వలేదని, దీంతో సబ్సిడీ బోర్లు, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మానకొండూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాజమల్లు, కోశాధికారి వెంకన్నగౌడ్, మహిళా కన్వీనర్ ప్రమీల, మండల అధ్యక్షుడు ఎల్లయ్య, భూమయ్య, రామచంద్రం, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గన్నేరువరంలో బీఎస్పీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని విద్యానగర్‌లో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం కొనసాగాయి. ఉదయం అగ్నిప్రతిష్ఠ హోమాలు, సాయంత్రం హంసవాహనసేవ, ఎదుర్కోలు నేత్రపర్వంగా నిర్వహించారు.

ఎంపీ బండి సంజయ్‌పై ఫిర్యాదు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేటర్ కమల్‌జిత్ కౌర్ శనివారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా కొత్తగా కట్టే సెక్రటేరియెట్ గోపురాలను కూల్చుతామని సంజయ్ చెబుతూ రాష్ట్రంలో యువతను రెచ్చగొడుతున్నారని పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరిస్తాం

గంగాధర: మండల కేంద్రంలో శనివారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ అన్నారు.

శ్రీగిరిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీగిరి ఆలయంలో ఆగమశాస్త్రానుసారం శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు బ్రహ్మోత్సవాలకు నాయకత్వం వహించే చండీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపి బ్రహ్మోత్సవ క్రతువుకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సాయంత్రం ధ్వజారోహణ, భేరిపూజ కార్యక్రమాలు నిర్వహించి ధ్వజాపతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీకాళహస్తి దేవస్థానం తరఫున స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లు భృంగివాహన సేవలో భక్తులకు దర్శనమిస్తారు.

జ్యోతిర్ముడి భక్తులకు 15 వరకే స్పర్శదర్శనం

మహాశివరాత్రిని పురస్కరించుకుని శివమాల ధరించి జ్యోతిర్ముడితో వచ్చిన వారికి మాత్రమే ఈ నెల 15 వరకు మల్లన్న స్పర్శదర్శనం కల్పిస్తున్నట్లు దేవస్థాన ఈవో ఎస్.లవన్న తెలిపారు. శనివారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు భక్తులందరికీ మల్లికార్జున స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

అది టీడీపీ అసత్యాల పుస్తకం

- ఏపీ మాజీ మంత్రి పేర్ని నాని మండిపాటు
- రచన, ప్రచురణకర్త లేని పిరికి పందల పుస్తకం
- వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు కోరిందే సీఎం వైఎస్ జగన్
- మరి ఆరోజు టీడీపీ ఎందుకు దర్యాప్తు చేయలేకపోయింది?
- మీలాంటి నీచులతో రాజకీయాలు దురదృష్టకరం

సాక్షి, అమరావతి: సీఎం జగన్‌పై విడుదల చేసింది టీడీపీ అసత్యాల పుస్తకం అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) మండిపడ్డారు. వయసు మీద పడిన చంద్రబాబు ఒక అజ్ఞాని అని ఆ పుస్తకం నిరూపిస్తోందన్నారు. విషపు రాతలతో ఒక పుస్తకాన్ని అచ్చేసి బయటకు వదిలారని, రాజకీయాల్లోకి ఆడవాళ్లను కూడా లాగి వివాదం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ పుస్తకంపై టీడీపీ, చంద్రబాబు పేర్లు పెట్టుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని విమర్శించారు. చంద్రబాబు ఓ పిరికిపంద అని దుయ్యబట్టారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఆ రోజు మీరు ఏం చేశారు?

- టీడీపీ విడుదల చేసిన పుస్తకాన్ని ఎవరు ప్రచురించారు? ఎన్ని కాపీలు వేశారు? అన్న కనీస వివరాలు లేవు. పైగా అదేదో అంతర్జాతీయ పార్టీ అయినట్లు ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడితో విడుదల చేయడం మరో తమాషా. నిజంగా దమ్ముంటే



ప్రచురణకర్త, ఎక్కడ, ఎన్ని కాపీలు ముద్రించారు వంటి పూర్తి వివరాలు అందులో ఉటంకించాలి కదా చంద్రబాబూ? అంత పిరికిపందవా?

- ఆ పుస్తకంలో మీరు రాసినవన్నీ అసత్యాలని మీకూ తెలుసు. మీరెన్ని అసత్యాలు రాసినా సీఎం ప్రతిష్టను , నిజాలను ఏమార్చలేరు. అవి తప్పుడు రాతలని, విషపు రాతలని చంద్రబాబే ఒప్పుకుంటున్నాడు.
- వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు సీఎం ఎవరు? ప్రభుత్వం ఎవరిది? తప్పుడు రాతలతో విషం చిమ్మే బదులు.. వివేకా కుమార్తెను, భార్యను, అల్లుడిని.. ఊళ్లో ఉన్న ఆయన కుటుంబాన్ని ఎందుకు విచారించలేదు? అప్పుడున్నది మీ ప్రభుత్వమే కదా?
- ఎంపీ అవినాష్‌రెడ్డి ఆనవాళ్లు చెరిపించాడంటే నువ్వు, నీ డీజీపీ, ఏబీ వెంకటేశ్వరరావు, పోలీసులు ఏం చేశారు? ఆ రోజు వివేకానందరెడ్డి కుమార్తె వాంగ్మూలం ఎందుకు తీసుకోలేదు. అప్పుడు నీది చేత కాని ప్రభుత్వమా? లేక తప్పుడు ప్రభుత్వమా?

ఎన్టీఆర్, కోడెలపై పుస్తకం ఎందుకు వేయలేదు?

- ఎన్టీఆర్ మృతిపై భార్య లక్ష్మీపార్వతి, ఆయన కుమారుడు హరికృష్ణ సీబీఐ దర్యాప్తు కోరితే సీఎంగా ఉన్న నువ్వు కనీసం సీబీసీఐడీ దర్యాప్తు అయినా చేయించావా? మరి అప్పుడిలా పుస్తకం ఎందుకు వేయించలేదు? ఎన్టీఆర్ పతనం, కుట్ర, కుతంత్రం, వెన్నుపోటు, వీటన్నింటిపై పుస్తకం వేయాలి. సీబీఐ దర్యాప్తు జరగాలి.
- అవినాష్ రెడ్డి సీబీఐకి ఇచ్చారని నువ్వు చెబుతున్న వాంగ్మూలం నీకు ఎక్కడి నుంచి వచ్చింది? అంటే సీబీఐ బాబు ఆదేశానుసారం నడుస్తోందని భావించాలా.. ఆ స్టేట్‌మెంట్ నువ్వు అచ్చేయగలిగావంటే నీ మార్గనిర్దేశకత్వంలో సీబీఐ నడుస్తోందనుకోవాలి.
- నీ పార్టీ సీనియర్ నేత కోడెల శివప్రసాదరావు బలవన్మరణంపై పుస్తకం ఎందుకు వేయలేదు? ఆ మరణం వెనుక నీ ప్రమేయం లేకపోతే కోడెల ఫోన్‌ను తెలంగాణ పోలీసులకు ఎందుకివ్వలేదు? ఆ ఫోన్‌ను ఎందుకు ధ్వంసం చేయించావు? నీ పాపాలు బయటకు వస్తాయనే కదా! ఎన్టీఆర్ కుమార్తె మరణంపైనా సీబీఐ దర్యాప్తు వేయాలి కదా?

నీ సంస్కారం ఇదేనా?

- నీ ఇంట్లో వారే ఆడవాళ్లా. ఇతర కుటుంబాల్లోని ఆడవాళ్లకు ఆత్మాభిమానం, పరువు ప్రతిష్టలు ఉండవా? వైఎస్ భారతమ్మ ఫొటో పుస్తకంలో ప్రచురిస్తావా? ఏం నీచపు బుద్ధి నీది? 23 మంది ఎమ్మెల్యేలను కొన్నా, జగన్‌మోహన్‌రెడ్డిని మానసికంగా కుంగదీయలేకపోయావు. నీ వల్ల కాక బీజేపీ నాయకులు, నువ్వు దత్తత తీసుకున్న వారితో అవాకులు చవాకులు మాట్లాడిస్తున్నావు.
- ఎక్కడో యూట్యూబ్‌లో నీ భార్యను ఎవరో ఏదో అన్నారంటూ.. ఒకటే ఏడ్పులు. ఇంత వయసొచ్చిన నీ సంస్కారం ఇదేనా? ఇంత నీచ, కిరాతక, హేయమైన రాజకీయ నాయకుడితో పోటీగా రాజకీయాలు చేయాల్సి రావడం మా దురదృష్టకరం. తెలుగుకు తెగులు పట్టిస్తున్న చదువు సంధ్యలు లేని నీ కొడుకు లోకేశ్‌ను ఊరి మీదికి వదిలి కామెడీ చేయిస్తున్నావు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

విద్యాలయాలుగా ఆర్బీకేలు



కాకినాడ జిల్లా జి.రాగంపేట ఆర్బీకే వద్ద వర్మీకంపోస్ట్ తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

యూనివర్సిటీల్లో పాఠ్యాంశంగా కూడా మారిన ఈ కేంద్రాలు

సాక్షి, అమరావతి: ఏపీలో అన్నదాతలకు విత్తు నుంచి విక్రయం వరకు గ్రామస్థాయిలో సేవలందిస్తున్న వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకే) యూనివర్సిటీల్లో పాఠ్యాంశమయ్యాయి. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, వెటర్నరీ, కళాశాల విద్యార్థులకు ప్రాక్టికల్ తరగతులుగా కూడా మారాయి. యూనివర్సిటీలు, అనుబంధ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ చదివే విద్యార్థులు ఇక నుంచి విధిగా ఆర్బీకేల్లో ఇంటర్న్‌షిప్ నిర్వహించేలా మార్పుచేశారు. ఇప్పటికే వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విద్యార్థులు ఇందుకు శ్రీకారం చుట్టగా, మత్స్య యూనివర్సిటీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన ఈ ఆర్బీకేలు రెండున్నరేళ్లుగా రైతులకు విశేష సేవలందిస్తూ అంతర్జాతీయ మన్ననలు అందుకుంటున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో సచివాలయాలకు అనుబంధంగా మొత్తం 10,778 ఆర్బీకేలను ఏర్పాటుచేశారు. వన్‌స్టాప్ సెంటర్‌గా వీటిని తీర్చిదిద్దారు. బుక్ చేసుకున్న 24 గంటల్లోనే సబ్సిడీ, నాన్ సబ్సిడీ విత్తనాలు, పురుగుల మందులతోపాటు ఎరువులను రైతు ముంగిటకు సరఫరా చేస్తున్నారు.

విశాఖ ఉక్కులో భారీ పేలుడు

9 మందికి తీవ్ర గాయాలు

ఉక్కు నగరం/గాజువాక: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో శనివారం చోటుచేసుకున్న భారీ పేలుడుతో విశాఖ నగరం ఉలిక్కిపడింది. ఈ ప్రమాదంలో 9 మంది తీవ్రంగా గాయపడగా.. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఇనుము ఉత్పత్తిలో భాగంగా స్లాగ్ పాట్ వెళ్లే ట్రాక్‌లో అవాంతరాలు ఏర్పడ్డాయి. వాటిని తొలగిస్తుండగా దాని కిందనున్న నీటిలో వేడిగా ఉన్న స్లాగ్ (ఖనిజం నుంచి లోహాన్ని వేరు చేయగా మిగిలిన ద్రవం) పడింది. దీంతో భారీ పేలుడు సంభవించింది. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ మేనేజర్ జె.జయకుమార్ (34), టెక్నీషియన్లు బి.ఈశ్వర్ నాయక్ (36), పండా సాహు (36), డిప్యూటీ జనరల్ మేనేజర్ థాయ్‌వాలా (55), కాంట్రాక్ట్ కార్మికులు ఎస్.పోతయ్య (44), కె.శ్రీను (34), ఆర్.బంగారయ్య (34), ఆర్.సూరిబాబు (36), సీహెచ్.అప్పలరాజు (37) గాయపడ్డారు. శ్రీనుకు 90 శాతం, పోతయ్యకు 65 శాతం, డీజీఎం థాయ్‌వాలాకు 45 శాతం గాయాలైనట్టు వైద్యవర్గాలు తెలిపాయి. ఈ ముగ్గురి పరిస్థితి విషయంగా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. పేలుడు సమాచారం అందుకున్న సీఐఎస్‌ఎఫ్ ఫైర్ విభాగం సిబ్బంది క్షణాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

'మలక్ పేట' బాధ్యులపై చర్యలేవీ?

- ఇద్దరు గర్భిణులు మృతిచెందినా మౌనమే..
- ఇన్ఫెక్షన్, నిర్లక్ష్యంతో మరణించినట్లు నిర్ధారణ
- ప్రభుత్వానికి ఉన్నతాధికారుల నివేదిక

సాక్షి, హైదరాబాద్: మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో ఇద్దరు గర్భిణులకు సిజేరియన్ చేయడం.. వారికి ఇన్ఫెక్షన్ సోకిన అనంతరం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన ఘటనపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య విధాన పరిషత్ కమిషనర్‌డాక్టర్ అజయ్‌కుమార్, గాంధీ సూపరింటెండెంట్‌డాక్టర్‌రాజారావు, పేట్ల బురుజు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌మాలతితో కూడిన త్రిసభ్య కమిటీ దీనిపై వివిధ కోణాల్లో విచారణ చేసి ఇటీవలే సర్కారుకు తుది నివేదిక ఇచ్చింది. ఇన్ఫెక్షన్‌తోపాటు వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఇద్దరు గర్భిణీలు మరణించినట్లు నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది. ఈ ఘటనకు ప్రధానంగా ముగ్గురు వైద్య సిబ్బందిని బాధ్యులుగా పేర్కొన్నట్లు సమాచారం. అయినా ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోలేదు.

అసలేం ఏం జరిగిందంటే...

జనవరి మొదటి వారంలో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్లండ మండలం చెదుమపల్లికి చెందిన సిరివెన్నెల (23), హైదరాబాద్ పూసలబస్తీకి చెందిన శివాని (24) మలక్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో సిజేరియన్ చేయించుకున్నారు. అనంతరం వారి ఆరోగ్యం విషమించడంతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు జనవరి 12న, మరొకరు 13న మరణించారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే చనిపోయినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. బాలింతల మృతికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లే కారణమన్న వాదనలు కూడా వినిపించాయి. పోస్ట్‌మార్టం రిపోర్టులో కూడా ఇన్ఫెక్షనే కారణమని స్పష్టం చేసినట్లు సమాచారం. ఇందుకు ఆసుపత్రిలో పరిశుభ్రత లోపమే ప్రధాన కారణమని గుర్తించారు. గత ఆగస్టులో ఇబ్రహీంపట్నంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న నలుగురు మహిళలు మరణించిన తర్వాత వైద్య ఆరోగ్య శాఖ ఆసుపత్రి ఇన్‌ఫెక్షన్ నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయిందనడానికి మలక్‌పేట ఘటనను నిదర్శనంగా చెబుతున్నారు.

పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లుతో పాటు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లు-2023ని రాష్ట్ర శాసన సభ శనివారం ఏకగ్రీవంగా ఆమోదించింది. పంచాయతీరాజ్ చట్ట సవరణ ద్వారా రాష్ట్రంలో కొత్తగా ఆరు గ్రామ పంచాయతీల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. భద్రాచలం-కొత్తగూడెం జిల్లా భద్రాచలం మండలంలో కొత్తగా భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ గ్రామ పంచాయతీలు, బూర్గంపహాడ్ మండలంలో కొత్తగా సారపాక, ఐటీసీ గ్రామ పంచాయతీలు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలంలో కొత్తగా రాజంపేట గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సభలో వివరించారు. ఈ రెండు బిల్లులను రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపించనున్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై వాయిదా తీర్మానం తిరస్కరణ

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై చర్చ కోసం బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, కృష్ణా, గోదావరి ప్రాజెక్టులపై ఏపీ నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులు, నీటి వినియోగంపై చర్చ కోసం సీఎల్పీ నేత భట్టివిక్రమార్క ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తిరస్కరించారు.

బాసరలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భైంసా(ముధోల్): బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్‌సీసీ కెడెట్లకు సర్టిఫికెట్ పరీక్ష

ఎదులాపురం: ఎన్‌సీసీ కెడెట్లకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించారు. 32వ బెటాలియన్ ఆధ్వర్యంలో బీ, సీ సర్టిఫికెట్ల కోసం నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 500 మంది హాజరయ్యారు. డ్రిల్, వెపన్, ఫీల్డ్ క్రాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్, జడ్జింగ్ డిస్టెన్స్ అనే ఐదు అంశాలపై పరీక్ష నిర్వహించారు. పరీక్షల నిర్వహణాధికారిగా కెప్టెన్ గాలిఅశోక్ వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపాల్, కెప్టెన్ జగ్‌రాం, సిబ్బంది పాల్గొన్నారు.

సఫారీ.. సరికొత్తగా



సఫారీ ట్రయల్ నిర్వహిస్తున్న డీఎఫ్‌వో, ఎఫ్‌డీవో

జన్నారం(మంచిర్యాల): మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్‌కు పర్యాటకుల సంఖ్య పెరగడంతో ఇదివరకే రెండు అటవీశాఖ జంగిల్ సఫారీలు ఉన్నా, అటవీశాఖ అధికారులు కెపాసిటీ పెంచి నూతనంగా మరో సఫారీని తీసుకొచ్చారు. ఈ సఫారిలో 8మంది కెపాసిటీ ఉందని, వర్షం పడినా తడవకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సఫారిలో శనివారం మంచిర్యాల జిల్లా అటవీసంరక్షణ అధికారి శివ్ ఆశిస్‌సింగ్, జన్నారం ఎఫ్‌డీవో సిరిపురం మాధవరావు ట్రయల్ చూశారు. గతంలో కేవలం జన్నారం రేంజ్ పరిధిలోనే ఉన్న సఫారి ప్రయాణం, ఇప్పుడు ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లో కూడా ఉంటుందని పేర్కొన్నారు. దీంతో జన్నారం, ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లలో వాహనం తిరుగుతుందా, ఏదైనా అడ్డంకి వస్తుందా అని పరిశీలించారు. త్వరలోనే ఈ కొత్త సఫారి అందుబాటులోకి తీసుకొచ్చి, పర్యాటకులకు అందుబాటులో ఉంచుతామని ఎఫ్‌డీవో మాధవరావు తెలిపారు. కార్యక్రమంలో జన్నారం రేంజ్ అధికారి హాఫీజోద్దీన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా పోలీసు ఎంపిక ప్రక్రియ

- 15 నుంచి అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు
- ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



ఆదిలాబాద్‌టౌన్: పోలీసు ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రెండో విడత కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు శారీరక దేహదారుఢ్య పరీక్షలు ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా, గత నెలలో నిర్వహించిన పరీక్ష ప్రక్రియ అనుభవంతో ఈసారి ఎంపిక ప్రక్రియను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు దేవదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా అభ్యర్థులకు ప్రత్యేకంగా 16న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా మైదానంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అభ్యర్థుల ఎత్తు కొలిచేందుకు డిజిటల్ మీటర్లు ఉపయోగిస్తున్నామని, పురుష అభ్యర్థులకు 1600 మీటర్ల పరుగుకు, మహిళా అభ్యర్థులకు 800 మీటర్ల పరుగుకు ఆర్ ఎఫ్ఐడి (రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ రీడర్) కార్డులను ఉపయోగించి అత్యాధునిక పరికరాలతో ఆటోమేటిక్‌గా సమయాలన్నీ నమోదు అయ్యే విధంగా యంత్రాలను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు మాత్రమే పరీక్షలకు హాజరు అయ్యే విధంగా రిస్ట్ బ్యాండ్లను ఉపయోగించనున్నట్లు వివరించారు. షాట్‌పుట్, లాంగ్ జంప్ ఈవెంట్స్‌లో క్వాలిఫై మేరకు మాత్రమే నమోదు చేయబడుతుందని, పరుగులో మాత్రం అభ్యర్థికి మార్కులను కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారం అంతా ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు రాష్ట్ర పోలీసు నియామక మండలి బోర్డ్ సర్వర్లోకి అప్లోడ్ అవుతుందని తెలిపారు.

ఐదు దశాబ్దాల తర్వాత.. 'ఆత్మీయ'ంగా



1969లో హెచ్ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు

చెన్నూర్‌రూరల్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1969వ సంవత్సరంలో హెచ్ఎస్‌సీ(హయ్యర్ సెకండరీ క్లాస్) చదివిన పూర్వ విద్యార్థులు శనివారం అక్కెపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఒకే చోట కలుసుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకుని, ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఆటలుఆడుతూ, పాటలు పాడుతూ సందడిగా గడిపారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్‌లాల్ లాహోటి, చకినారపు వెంకటేశం, డాక్టర్ సత్యనారాయణ, కొమ్మెర రాజేశ్వర్, మహావాది సుబాష్, బెల్లంకొండ సత్యనారాయణ, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

14న సీఎం రాక

- ఏర్పాట్లు పరిశీలించిన పోలీసులు
- రూ.100 కోట్లు కేటాయించాకే కొండగట్టు పర్యటన
- అంజన్న భక్తుల్లో చిగురిస్తున్న ఆశలు



సీఎం సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి గుడి అభివృద్ధికి రూ.వంద కోట్లు కేటాయించాకే ఇక్కడ అడుగు పెడతానని చెప్పిన సీఎం కేసీఆర్.. ఆ మాట ప్రకారమే మొన్నటి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఈక్రమంలోనే ఈనెల 14న కేసీఆర్ కొండకు రానున్నారు. ఏర్పాట్లను పోలీసులు శనివారం పరిశీలించారు.

మహిమ గల వాయుపుత్రుడు..

- కొండగట్టు శ్రీఆంజనేయస్వామి రెండు ముఖాలు కలిగి ఉన్నారు. ప్రపంచంలోనే చాలా మహిమలు ఉన్న దేవునిగా ఖ్యాతి ఉంది.
- తెలంగాణ ప్రభుత్వం ఈ పుణ్యక్షేత్రం అభివృద్ధిపై సుమారు ఎనిమిదేళ్ల తర్వాత దృష్టి సారించింది.
- ఈక్రమంలోనే సీఎం కేసీఆర్.. ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిసింది.
- తొలుత ఆర్కిటెక్ ఆనందసాయి ఆదివారం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, పరిసరాలు పరిశీలిస్తారని సమాచారం.

ఇవీ సమస్యలు..

- కొండ దిగువన భక్తుల కోసం బస్‌స్టాండ్ లేదు
- ఆలయంలోని స్వామివారి ఆకారం భక్తులకు తెలియడంలేదు
- ఆలయ ప్రాకారం, మండపం మరమ్మతు చేయాలి
- సెక్యూరిటీ గేటు మొదలు.. ఆలయానికి చేరుకునే దారి సరిగాలేదు
- వంద మంది భక్తులకు కూడా నిత్యాన్నదాన సత్రంలో ఆహారం లభించడంలేదు.
- రోజూ 500 మంది- 1,000 మంది భక్తులకు అన్నదానం చేయాలి
- అంజన్నకు 400 ఎకరాలు ఉందని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో వాహనాల పార్కింగ్‌కు నాలుగు ఎకరాలు కూడా లేదు.
- హన్మాన్ భక్తులు, దీక్షాపరులు మాల విరమణ చేసేందుకు మండపం లేదు
- దీని నిర్మాణానికి రూ.లక్షలు వెచ్చించినా పనులు ఆదిలోనే ఆగిపోయాయి.
- కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సాయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ తప్ప భక్తులకు మిషన్ భగీరథ నుంచి చుక్క నీరు అందడంలేదు.
- నిద్రమొక్కులు చెల్లించేందుకు భక్తులకు వసతి గదులు సరిపడా లేవు.
- భక్తుల కోసం 500 ధర్మశాలలు, రెండు కాటేజీలు నిర్మించాలి
- ప్రాథమిక వైద్య చికిత్సల కేంద్రం ఏర్పాటు చేయాలి
- ఉద్యోగులకొరత తీర్చాలి
- అంజన్నకు ప్రతిరూపమైన కోతులకు ఆహారం, నీరు అందడంలేదు.
- ప్రభుత్వమే కోతుల పార్కు ఏర్పాటు చేయాలి
- ఏటీఎంల ఏర్పాటుతోపాటు మొబైల్‌ఫోన్ సిగ్నలింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలి
- తల్లులకు బేబీ ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది.
- మహిళా భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు మహిళా సెక్యూరిటీ గార్డులు, మహిళా పోలీసులను నియమించాలి
- స్వామివారి దర్శనం కోసం పండుటాకులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ నిర్మించాలి
- టెండరుదారులకు కొత్తగా దుకాణాల గదులు నిర్మించి ఇవ్వాలి
- వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కొండగట్టుకు వచ్చేందుకు సులభమైన రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలి
- మహిమలు కలిగిన, నిరాదారణకు గురవుతున్న భేతాలస్వామి(భైరవస్వామి) అల్లుబండను అభివృద్ధి చేయాలి
- హనుమంతుడు కొలిచే శ్రీరాముడి ఆలయ అభివృద్ధిని పట్టించుకున్న వారే లేరు
- స్వామివారి దర్శనం కోసం సరైన క్యూలైన్లు లేవు
- లడ్డూ, పులిహోర తయారీ కేంద్రం ఉన్నచోటే ప్రసాదాల విక్రయ కౌంటర్లు ఏర్పాటు చేయాలి
- వ్రతాలు, ప్రత్యేక పూజలు చేసే భక్తుల కోసం సత్యనారాయణ వ్రత మంటపం, భోగశాలలు ఏర్పాటు చేయాలి
- శాలువాలు, కండువాలతో సన్మానం చేసేందుకు ప్రత్యేక మంటపం నిర్మించాలి

ఆలయ అభివృద్ధికి అధికారులు రూపొందించిన ప్రతిపాదనలు ఇవీ..

- మిషన్ భగీరథ నీటి సౌకర్యానికి రూ.5 కోట్లు
- వాటర్ స్టోరేజీ పాయింట్ కోసం రూ.2 కోట్లు
- చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.5 కోట్లు
- వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం రూ.50 లక్షలు
- సాలారా మండపం నిర్మాణానికి రూ.5 కోట్లు
- ప్రాకార మండపం కోసం రూ.10 కోట్లు
- మాఢ వీధుల కోసం రూ.5 కోట్లు
- అభిషేక మండపం కోసం రూ.కోటి
- నిత్యాన్నదాన కాంప్లెక్స్ కోసం రూ.2 కోట్లు
- క్యూ కాంప్లెక్స్‌కు రూ.2.5 కోట్లు
- హైమాస్ట్‌లైటింగ్ సిస్టం రూ.2 కోట్లు
- డార్మెటరీహాల్ రూ.4 కోట్లు
- భక్తులు సేదతీరే హాళ్లకు రూ.12 కోట్లు
- వీఐపీ గదులకు రూ.12 కోట్లు
- రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి రూ.10 కోట్లు
- పార్కింగ్‌కు రూ.కోటి
- ఓపెన్ షెడ్లకు రూ.కోటి
- విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.కోటి
- ఆర్చ్‌గేట్‌కు రూ.80 లక్షలు
- రోప్‌వే నిర్మాణానికి రూ.5 కోట్లు
- సోలార్ లైటింగ్‌కు రూ.కోటి

రాజన్న సేవలో ప్రముఖులు

వేములవాడ: వేములవాడ రాజన్నను శనివారం కర్ణాటక రాష్ట్ర అడిషనల్ చీఫ్ సెక్రటరీ రమణారెడ్డి, రాష్ట్ర అధికార భాషాసంఘం అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.



మంత్రి శ్రీదేవికి ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు



రమణారెడ్డిని సన్మానిస్తున్న అర్చకులు

సండే స్పెషల్

ఇది పాదయాత్రల సీజన్.
దేశంలో అనేక యాత్రలు
సాగుతున్నాయి.
వాటి మతలబు వేరు.
కాని కర్ణాటకలో ఫిబ్రవరి 23న
200 మంది పల్లెటూరి యువకులు
పాదయాత్ర చేయనున్నారు.
దాని పేరు 'బహ్మచారిగళ పాదయాత్రె'
అంటే 'బ్రహ్మచారుల పాదయాత్ర'
మాండ్య జిల్లాలో గతంలో
ఆడపిల్ల భ్రూణ హత్యలు జరిగాయి.
ఇవాళ యువకులకు అక్కడ
వధువు కరువైంది.
బ్రహ్మచారులంతా డిప్రెషన్ బారిన పడ్డారు.
వారికి ఆశ కల్పించడానికి
దేవుని కొండ వరకూ
పాదయాత్ర చేయిస్తున్నారు.
ఆడపిల్ల ఎంత విలువైనదో
సిరి సమానమైనదో
తెలుసుకోవాల్సిన వాళ్లు
ఇంకా ఉన్నారు.
వారికి కనువిప్పు ఈ కథ.


ప్రతీకాత్మక చిత్రం

వధువు కోసం పాదయాత్ర

2003లో హిందీలో 'మాతృభూమి' అనే సినిమా వచ్చింది. మనీష్ ఝా దర్శకుడు. బిహార్‌లో ఆడపిల్ల పుడితే పాలల్లో ముంచి ప్రాణాలు తీసే దురాచారం ఉంది. అలాంటి ఆచారం పాటించిన ఒక ఊరు కొన్నాళ్లకు అసలు ఒక్క అమ్మాయి కూడా లేక అందరూ మగవాళ్లతో నిండిపోయే స్థితికి చేరుకుంటుంది. అప్పుడు ఏమవుతుంది? పెళ్లి కాని యువకులు ఎంత నిస్పృహకు లోనవుతారు? దొరక్క దొరక్క ఒక వధువు దొరికి ఆ ఊరికి కోడలిగా వస్తే ఏమవుతుంది? దర్శకుడు షాకింగ్‌గా ఈ సినిమా కథను అధివాస్తవిక దృష్టితో చూపిస్తాడు. దీనికి బోలెడన్ని అవార్డులు వచ్చాయి. ఇలాంటి స్థితి ఇప్పుడు మహారాష్ట్రలో, కర్ణాటకలో ఇంకా దేశంలో మరికొన్ని చోట్ల నెలకొని ఉన్నదంటే ఆ దర్శకుడు ఊహించిందే నిజమైంది.

> ఇవాళ అనేక ఇళ్లల్లో అబ్బాయిలు ఈసురో మంటూ ఒంటరిగా ఉంటున్నారు. సంబంధం ఒక పట్టాన కుదరడం లేదు. అమ్మాయిలు అంత సులువుగా దొరకడం లేదు.

లింగ నిష్పత్తికి విఘాతం

1970, 80, 90... ఈ మూడు దశాబ్దాలు మన దేశం అనేక భ్రూణ హత్యలను, ఆడపిల్ల అయితే శిశు హత్యలను చూసింది. ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్ చేయించడం మధ్యతరగతి వారికి కట్నాలు, కానుకలు తప్పించుకునే ఒక మార్గం అయ్యింది. ఆ కాలంలో లింగ నిష్పత్తికి కలిగిన విఘాతం ఆ సమయంలో పుట్టిన ముఖ్యంగా 1990లలో పుట్టిన అబ్బాయిలు ఇప్పుడు ఎదుర్కొంటున్నారు. 2000 సంవత్సరం తర్వాత ప్రభుత్వం మేల్కొని లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలపై కఠిన చట్టాలు తెచ్చినా 2005 నాటికి ప్రతి 1000 మంది అబ్బాయిలకు 876 మంది అమ్మాయిలు మాత్రమే ఉన్నారు. 2018–20 నాటికి నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం ప్రతి 1000 మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య 907 ఉంది. ఇది జాతీయ సగటు. కాని కొన్ని రాష్ట్రాల్లో ఈ నిష్పత్తి చాలా ప్రమాదకరంగా ఉంది.

సోలాపూర్ పెళ్లికొడుకులు

మొన్నటి డిసెంబర్‌లో మహారాష్ట్రలోని సోలాపూర్‌లో 50 మంది బ్రహ్మచారులు పెళ్లికొడుకుల వేషాలు కట్టి, గుర్రాలు ఎక్కి, మేళ తాళాలతో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి 'తగిన వధువు'ను వెతకమని మెమొరాండం ఇచ్చారు. కొందరు ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాసి మొర పెట్టుకున్నారు. మహారాష్ట్రలో కొన్ని ప్రాంతాల్లో నీటి వసతి లేదని అమ్మాయిని ఇవ్వడం లేదు. మరికొన్ని చోట్ల అమ్మాయిలు లేక దొరకడం లేదు. అక్కడ ప్రస్తుతం ప్రతి 1000 మంది అబ్బాయిలకు 889 మంది అమ్మాయిలే అందుబాటులో ఉన్నారు. దాంతో పెళ్లిళ్లు జరక్క అబ్బాయిలు ఆవేదన చెందుతుంటే, వాళ్ల తల్లిదండ్రులు మనోవేదనతో హార్ట్ ఎటాక్‌లు తెచ్చుకుని మరణిస్తున్నారు.

కర్ణాటక పాదయాత్ర

ఇప్పుడు కర్ణాటకలోని మాండ్య ప్రాంతం వార్తల్లోకి వచ్చింది. అక్కడ గత కొన్నేళ్లుగా బలవంతపు బ్రహ్మచర్యాన్ని అబ్బాయిలు అనుభవిస్తున్నారు. ఒకప్పుడు మాండ్య ప్రాంతంలో సాగిన భ్రూణ హత్యలు ఇపుడు పెళ్లి కాని యువకుల పట్ల శాపంగా మారాయి. దాంతో చదువు, యోగ్యత, ఉద్యోగాలు ఉన్నా సరే జంట లేక కుర్రాళ్లు డిప్రెషన్‌లోకి వెళుతున్నారు. వీరు ఇదే విధంగా ఉండటం సరి కాదని అక్కడ కొంత మంది సామాజిక కార్యకర్తలు వారి ఓదార్పుకై, దైవ శక్తి తోడుకై 'బ్రహ్మచారి పాదయాత్ర'ను ప్రతిపాదిస్తే ప్రకటన వెలువడిన వెంటనే వందకు పైగా రిజిస్ట్రేషన్‌లు వచ్చాయి. ఫిబ్రవరి 23న 30 ఏళ్ల వయసు దాటిన 200 మంది బ్రహ్మచారులు మాండ్యాలోని మద్దూరు నుంచి పొరుగు జిల్లా చామరాజనగర్‌లోని ప్రఖ్యాత మాలె మహదేశ్వర గుడికి మూడు రోజుల పాటు 105 కిలోమీటర్ల మేరకు ఈ పాదయాత్ర సాగనుంది. ఆశ్చర్యంగా మాండ్యా జిల్లా నుంచే కాక మైసూరు, బెంగళూరు నుంచి కూడా నిర్వాహకులకు ఫోన్లు వస్తున్నాయి. 200కు పరిమితం చేశారు కాని ఈ సంఖ్య ఇంకా పెరగవచ్చు. 'బ్రహ్మచారులకు బతుకు మీద ఆశ కల్పించడానికి ఈ పాదయాత్ర కొంతైనా ఉపకరిస్తే అదే పదివేలు' అని నిర్వాహకులలో ఒకరు వ్యాఖ్యానించారు.

ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అయ్యాయి. 1970లలో 80లలో అబ్బాయిలు కట్నం కోసం అమ్మాయిలను కాల్చుకుతిన్నారు. వయసుకొచ్చిన యువకుడు ఇంట్లో ఉంటే ఆ ఇంటికి ఎంతో డిమాండ్ ఉండేది. ఇవాళ అనేక ఇళ్లల్లో అబ్బాయిలు ఈసురోమంటూ ఒంటరిగా ఉంటున్నారు. సంబంధం ఒక పట్టాన కుదరడం లేదు. అమ్మాయిలు అంత సులువుగా దొరకడం లేదు.

ఆడపిల్ల దేశానికి ఆయువు. ఈ వార్తలు చూసైనా ప్రతి ఇంటా ఆడపిల్లను సంతోషంగా ఆహ్వానించాలి.

కొత్తదారి


శివమ్ త్యాగి, ఆర్య

సింపుల్‌గా.. శుభంగా

ఎంత ఎక్కువ ఖర్చు చేస్తే పెళ్లి అంత ఘనంగా జరిగినట్లు. అనే ఆలోచనధోరణి నుంచి బయటికి వచ్చి నిరాడంబరంగా పెళ్లి చేసుకున్నారు ఇండియన్ రెవెన్యూ సర్వీస్ ఆఫీసర్ ఆర్య, ఇండియన్ పోస్టల్ సర్వీస్ ఆఫీసర్ శివమ్ త్యాగి. 'ఆనందం అనేది ఆడంబరపు ఖర్చుల్లో కాదు... మనం చేసే మంచి పనుల్లో దొరుకుతుంది' అని నమ్మిన ఈ నవదంపతులు 20 మంది అనాథ పిల్లల చదువుకు అయ్యే ఖర్చును భరించాలని వివాహ శుభసమయాన శుభనిర్ణయం తీసుకున్నారు...

కేరళ, కొట్టాయంలోని కూరోప్పడకు చెందిన ఆర్య ఎన్ నాయర్ తండ్రి రాధాకృష్ణన్‌నాయర్ జాయింట్ లేబర్ కమిషనర్‌గా రిటైరయ్యారు. కూతురికి చిన్నవయసు నుంచే దినపత్రికలు చదవడం అలవాటు చేశారు. ఈ అలవాటు తనకు ఎంతో మేలు చేసింది. ఎప్పటికప్పుడు సామాజిక సందర్భాలను అర్థం చేసుకోవడానికి మాత్రమే కాదు, రకరకాల సమస్యల విశ్లేషణ గురించి తెలుసుకోవడానికి కూడా ఆర్యకు ఉపకరించింది.

బంధువులకు సంబంధించిన ఎన్నో పెళ్లిళ్లకు హాజరయ్యేది ఆర్య. ఆ ఆడంబరపు ఖర్చును చూసి తన మనసు చివుక్కుమనేది.

'ఈ పెళ్లికి చేసిన ఖర్చుతో ఎన్నో మంచి పనులు చేయవచ్చు' అనుకునేది.

ఇదే విషయాన్ని ఇతరులతో పంచుకుంటే...

'ఇప్పుడు ఇలాగే అంటావ్. తీరా పెళ్లి టైమ్ వచ్చేసరికి మారిపోతావు. నా పెళ్లి ఎంత ఘనంగా జరిగిందో తెలుసా అని చెప్పుకోవడానికే ప్రాధాన్యత ఇస్తావు. నీ వయసులో నీలాగే ఆలోచించాను. కాని నా పెళ్లి ఘనంగా జరగక తప్పలేదు. చివరికి అప్పు కూడా చేయాల్సి వచ్చింది' అన్నవాళ్లే ఎక్కువ. ఈ మాటలు ఆర్య మనసులో గట్టిగా నిలిచిపోయాయి.

'పెళ్లంటూ చేసుకుంటే నిరాడంబరంగానే చేసుకోవాలి' అని నిర్ణయం తీసుకుంది.

దిల్లీకి చెందిన శివమ్ త్యాగి కూడా ఆర్యలాగే ఆలోచిస్తాడు. ఇద్దరూ ప్రస్తుతం అహ్మదాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. వారి పరిచయం స్నేహం అయ్యే క్రమంలో, ఆ స్నేహం ప్రేమకు దారి తీసే క్రమంలో ఎన్నో సామాజిక సంబంధిత విషయాలు మాట్లాడుకునేవారు. అందులో ఆడంబర వివాహాల ప్రస్తావన కూడా తప్పనిసరిగా ఉండేది.

'నిరాడంబరంగా పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం' అని ఆర్య చెప్పినప్పుడు తల్లిదండ్రులు ఇష్టపడలేదు. వారిని ఒప్పించడానికి కాస్త సమయం పట్టింది. మరోవైపు శివమ్ త్యాగి పరిస్థితి కూడా అంతే. అతడి తల్లిదండ్రులు కూడా నిరాడంబర వివాహానికి మొదట సుముఖంగా లేరు.

'మా నిరాడంబర వివాహం కొందరికైనా స్ఫూర్తిని ఇస్తే అంతకంటే గొప్ప ఆనందం ఏం ఉంటుంది!' అంటున్నాడు శివమ్ త్యాగి.

ఆనందాలు ఆడంబరపు ఖర్చులతో ముడిపడిన చోట ఆనందం మాటేమిటోగానీ అప్పులు మాత్రమే మిగులుతాయి. దీనికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఈ ధోరణిలో మార్పు రావాలంటే నిరాడంబర వివాహాల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉంది. ఆర్య–శివమ్ త్యాగిలాంటి వారు ఇందుకు స్ఫూర్తిగా నిలుస్తారు.

> 'కేరళలో వివాహాలు మూడు రోజుల పాటు అట్టహాసంగా జరుగుతాయి. నా పెళ్లి వార్త తెలియగానే బంధువులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూశారు. పెళ్లి ఆడంబరంగా జరుగుతుందని ఊహించారు. కాని కొట్టాయంలోని సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో దండలు మార్చుకోవడం ద్వారా నిరాడంబరంగా జరిగిన మా పెళ్లి వారిని కాస్త నిరాశకు గురిచేసింది. అయితే ఆ తరువాత వారు మమ్మల్ని అర్థం చేసుకొని అభినందించారు' అంటుంది ఆర్య.

బ్యూటిప్స్

ఒకోసారి వాతావరణంలో చర్మం పొడిబారిపోయి జీవం కోల్పోయినట్లుగా ఉంటుంది. చిన్న చిట్కాలతో చర్మం పునరుత్తేజం పొందుతుంది.

అలోవెరా గుజ్జు అరకప్పు, బాదం నూనె అరచెంచా, నువ్వుల నూనె అరచెంచా... వీటన్నింటినీ ఒక చిన్న గాజుసీసా లేదా కంటెయినర్‌లో పోసి బాగా కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూసుకుని ఆరిన తర్వాత కడిగేసుకుంటే చర్మం మిల మిలలాడుతుంది. ఒకవేళ అలోవెరా దొరకలేదనుకోండి... అప్పుడు అరకప్పు అరమగ్గిన బొప్పాయి గుజ్జులో పచ్చిపాలు కలిపి పేస్టులా చేసుకోవాలి. ఈ ముద్దను ముఖానికి, మెడకు పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే మంచి ఫలితం ఉంటుంది.



హెల్త్



హైపర్ విటమినోసిస్!

విటమిన్లే అయినా... మరీ అతిగా వద్దు!

ఇటీవల మనందరిలో పెరిగిన ఆరోగ్యస్పృహ గురించి తెలిసిందే. మరీ ముఖ్యంగా కరోనా తర్వాత ఇమ్యూనిటీ పెంచుకోవడం కోసం చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. ఈ ప్రయత్నంలో 'విటమిన్ల' కోసం సప్లిమెంట్లు అతిగా తీసుకునేవారూ ఉన్నారు. జీవక్రియల కోసం విటమిన్లు కీలకమే. కానీ 'ఆరోగ్య స్పృహ' అంటూ అతిచేయడంతో విటమిన్ల మోతాదు పెరిగి 'హైపర్ విటమినోసిస్'కు గురయ్యే ప్రమాదమూ ఉంది. ఆ అనర్థాలేమిటో తెలిపే కథనమిది.

మోతాదుకు మించి విటమిన్లు తీసుకోవడం వల్ల 'హైపర్ విటమినోసిస్' అనే కండిషన్ వస్తుందంటూ వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ కండిషన్‌ను 'విటమిన్ టాక్సిసిటీ'గా కూడా పేర్కొంటున్నారు.

నీటిలో కరిగేవాటికంటే... ఫ్యాట్‌లో కరిగేవే డేంజర్

విటమిన్లలో ఏ, బీ కాంప్లెక్స్, సీ, డీ, ఈ, కే అనే విటమిన్లు ఉంటాయి. వీటిల్లో 'ఏ, డీ, ఈ, కే' అనేవి కొవ్వు (ఫ్యాట్)లో కరిగితేనే దేహంలోకి ఇంకుతాయి. ఇక విటమిన్ 'బీ–కాంప్లెక్స్'తో పాటు విటమిన్ 'సీ' మాత్రం నీళ్లలో కరుగుతాయి. ఈ బీ కాంప్లెక్స్, సీ విటమిన్లు నీళ్లలో కరగడం వల్ల కాస్త ఎక్కువైనా... మూత్రంతో పాటు బయటకు తేలిగ్గా వెళ్తాయి. దాంతో హానికి పెద్దగా అవకాశం ఉండదు. కానీ సమస్యల్లా విటమిన్ ఏ, డీ, ఈ, కే లు కొవ్వుల్లో కరగడం వల్ల... వీటి మోతాదు పెరిగినప్పుడు అంత తేలిగ్గా బయటకు వెళ్లడం సాధ్యపడదు. దాంతో ఎక్కువైనప్పుడు కొన్ని అనర్థాలు తెచ్చిపెడతాయి.

విటమిన్–ఏ పెరిగితే...

విటమిన్–ఏ లోపిస్తే రేచీకటి వంటి సమస్యలు వస్తాయి. విటమిన్– ఏ పెరగడం వల్ల ఒకే వస్తువు రెండుగా కనిపించడం (డిప్లోపియా), వికారం లేదా వాంతులు, తలనొప్పి, కండరాల–కీళ్ల నొప్పులు, మరీ మోతాదు ఎక్కువైతే కాలేయం తన విధులు నిర్వర్తించలేకపోవడం వంటి అనర్థాలు వస్తాయి.

విటమిన్–డీ ఎక్కువైతే...

ఆరుబయట చేసే ఉద్యోగాలు బాగా తగ్గడం, దాదాపుగా అందరూ ఆఫీసుల (ఇన్‌డోర్స్)కే పరిమితం కావడంతో ఇటీవల మన దేశంలో విటమిన్ 'డీ' లోపం బాగానే పెరిగింది. ఒక దశలో విటమిన్–డీ లోపం కేసులు చాలా పెద్ద సంఖ్యలో రావడంతో చాలామంది డాక్టర్లు చాలా సందర్భాల్లో ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే విటమిన్–డీ సప్లిమెంట్లను ఇవ్వడం మొదలుపెట్టారు. డీ–విటమిన్ ఎక్కువైతే అది రక్తంలో క్యాల్షియమ్ మోతాదుల్ని పెంచుతుంది ఫలితంగా కుంగుబాటు (డిప్రెషన్) వంటి కొన్ని మానసిక సమస్యలు కనిపించవచ్చు. అలాగే తలనొప్పి, తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ, జీర్ణ వ్యవస్థకు (గ్యాస్ట్రో ఇంటస్టినల్) సమస్యలు రావచ్చు. అంటే ఉదాహరణకు వికారం, వాంతులు, మలబద్ధకం, కడుపునొప్పి వంటివి కనిపించే అవకాశాలున్నాయి. ఇక మూత్ర వ్యవస్థకు సంబంధించిన లక్షణాలు... అంటే తరచూ మూత్రవిసర్జనకు వెళ్లడం, మూత్రపిండాల్లో క్యాల్షియమ్ ఎక్కువగా చేరే 'నెఫ్రో క్యాల్సినోసిస్' వంటి సమస్యలూ రావచ్చు. ఫలితంగా కిడ్నీ పనితీరు దెబ్బతినేందుకు అవకాశాలుంటాయి.

చికిత్స : సమస్య నిర్ధారణలో హైపర్ విటమినోసిస్ వల్ల వచ్చిన అనర్థమే అన్నది చాలా కీలకం. దేహంలో ఏ విటమిన్లు ఎక్కువయ్యాయో దాన్ని బట్టి నిర్దుష్టమైన చికిత్స ఉంటుంది. ఉదాహరణకు విటమిన్–ఏ ఎక్కువైతే... దానికి విరుగుడుగా మూత్రం ఎక్కువగా వచ్చేందుకు ఉపకరించే 'ఏసెటజోలమైడ్' వంటి మాత్రలు సూచిస్తారు. ● విటమిన్–డీ పెరిగినట్లు తెలిస్తే... దానికి విరుగుడుగా దేహంలోని క్యాల్షియమ్ మోతాదులు తగ్గించేందుకు రక్తనాళం ద్వారా ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వడం. చాలా ఎక్కువ మోతాదులో మూత్రం వచ్చేందుకు వాడే 'లూప్ డైయూరెటిక్స్' వంటివి వాడతారు. అలాగే క్యాల్షియమ్ మోతాదులు తగ్గించేందుకు కల్సిటోనిన్ వంటి ముక్కు ద్వారా ఇచ్చే స్ప్రేలు, బిస్ఫాస్ఫోనేట్ వంటివి ఇస్తారు. ● విటమిన్–ఈ పెరిగినట్లు నిర్ధారణ అయితే రక్తస్రావాలు, అంతర్గత రక్తస్రావాలు నివారించేందుకు విటమిన్–కే, ఎఫ్‌ఎఫ్‌పి (ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా) వంటి ప్రక్రియలు చేస్తారు. ● విటమిన్–కే పెరిగినట్లు తెలిస్తే... దాని అనర్థాలు నివారించేందుకు వార్‌ఫేరిన్ వంటి మందులు లేదా కామెర్లకు వాడే మందులు ఉపయోగిస్తారు.

నివారణ : దేహంలోని జీవక్రియలకు ఎంతో కీలకమైన విటమిన్లు చాలావరకు మనం తీసుకునే సమతులాహారంతోనే సమకూరుతుంటాయి. నిర్దుష్టంగా ఏదైనా విటమిన్ లోపాల వల్ల వచ్చే లక్షణాలను కనుగొంటే డాక్టర్లు వీటిని సూచిస్తారు. అంతేతప్ప... విటమిన్లు పెరిగితే ఆరోగ్యమూ పెరుగుతుందనే అపోహతో 'ఓవర్ కౌంటర్ మెడిసిన్'లలా విటమిన్ సప్లిమెంట్లు వాడటం ఎంతమాత్రమూ సరికాదు.


డాక్టర్ కె. శివరాజు
సీనియర్ ఫిజీషియన్

విటమిన్–ఈ పెరగడం వల్ల

దేహాన్ని అందంగా ఉంచడంతో పాటు కొంతమేరకు ప్రత్యుత్పత్తికి ఉపయోగపడే ఇదే విటమిన్ దేహంలో పెరగడం వల్ల... అది మరో విటమిన్ అయిన విటమిన్–కే చేయాల్సిన విధుల్ని దెబ్బతీస్తుంది. దాంతో తేలిగ్గా రక్తస్రావం జరగడానికీ, అంతర్గత రక్తస్రావాలకూ అవకాశం ఏర్పడుతుంది.

విటమిన్–కే పెరుగుదలతో దుష్ప్రభావాలివి...

దేహంలో విటమిన్–కే పెరగడం అన్నది చాలా చాలా అరుదుగా మాత్రమే జరుగుతుంది. అయితే ఇలా పెరగడం వల్ల కామెర్లు, హీమోలైటిక్ అనీమియా వంటి కండిషన్లు ఏర్పడతాయి.

మెడి టిప్

కీళ్ల నొప్పుల నివారణకు...

మన దేహం కూడా యంత్రం లాంటిదే. యంత్రంలోని భాగాలు అరుగుదలకు లోనైనట్టే... కీళ్లూ అరుగుదలకు లోనవుతుంటాయి. వయసు పెరుగుతున్నప్పుడు ఒకదశ తర్వాత కీళ్ల అరుగుదలతో నొప్పులు వస్తాయి. వాటి నివారణకూ లేదా ఆలస్యం చేయడానికి ఈ కింది సూచనలు పాటించాలి. ▲ క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే పాలు, ఆకుకూరల వంటి ఆహారాలు తీసుకోవాలి. ▲ బరువు పెరగకూడదు. ఎత్తుకు తగినంత బరువు ఉండేలా నియంత్రించుకోవాలి. ▲ కదలికల్ని చురుగ్గా ఉంచుకోవాలి. ▲ కాళ్లు బాగా ముడుచుకునేలా బాసింపట్టు వేసి కూర్చోవడాన్ని (స్క్వాటింగ్) నివారించాలి. వీలైనంత వరకు తగినంత ఎత్తులో సౌకర్యంగా కూర్చోవాలి. ▲ కీళ్లలో నొప్పి కనిపించినప్పుడు నిర్లక్ష్యం చూపొద్దు. తప్పక డాక్టర్‌ను కలవాలి.

సీకేడీ పిల్లలకు ఆశాకిరణం...

కిడ్నీ మార్పిడి చికిత్స!

మూత్రపిండాలు (కిడ్నీలు) రక్తంలోని మలినాలను బయటకు పంపుతాయి. అలా అవి మనలోని వ్యర్థపదార్థాలన్నింటినీ వడపోస్తాయి. కిడ్నీలు వాటి వడపోత సామర్థ్యాన్ని కోల్పోయినప్పుడు, మన శరీరంలో హానికారక ద్రవాలు, వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇది ఒకేసారి జరగదు. ఇది క్రమక్రమంగా చోటు చేసుకుంటుంది. ఒకవేళ కిడ్నీలు తమ పనితనంలో 90 శాతాన్ని కోల్పోతే... దాన్ని మూత్రపిండాల వ్యాధి చివరి దశగా పేర్కొనవచ్చు. సిస్టిక్ డిస్‌ప్లాస్టిక్ కిడ్నీ, పాలిసిస్టిక్ కిడ్నీ, వారసత్వం వల్ల వచ్చే అనువంశీక కిడ్నీ వ్యాధులు, దీర్ఘకాలిక గ్లోమెరూలర్, ట్యూబ్యులార్ వ్యాధులు గల పిల్లల్లో క్రానిక్ కిడ్నీ డిసీజ్–సీకేడీ వస్తుంది. సీకేడీని పూర్తిగా నయం చేయడం సాధ్యం కాదు. అలాంటి బాధితులు జీవించి ఉండాలంటే డయాలసిస్ అవసరం. లేదా మూత్రపిండాల మార్పిడి (కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్) జరిపించాలి.



బాధితులకు ఆశాకిరణం... మూత్రపిండాల మార్పిడి

మూత్రపిండాల మార్పిడి (కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్)లో... జీవించి ఉన్న లేదా చనిపోయిన దాత నుంచి మూత్రపిండాన్ని మొదట సేకరిస్తారు. ఆ తర్వాత శస్త్రచికిత్స ద్వారా బాధితుల్లోకి ఆ మూత్రపిండాన్ని అమర్చుతారు. దాంతో బాధితుల్లో ఈ కింది ప్రయోజనాలు చేకూరుతాయి. ● మెరుగైన జీవననాణ్యత (నాణ్యమైన జీవనశైలి) ● ఆహారంపై కొద్దిపాటి ఆంక్షలు ఉన్నప్పటికీ రోగి మరణించే ప్రమాదం తక్కువ ● చికిత్స ఖర్చు గణనీయంగా తగ్గుతుంది.

సీకేడీ దుష్ప్రభావాలు, లక్షణాలు :

● రక్తహీనత ● ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు ● ఎముకల బలహీనత ● గుండెజబ్బు ● అధిక రక్తపోటు

సీకేడీని అదుపు చేయడం ఎలా?

బాధితులు ఆహారంలో ఉప్పు, మాంసాహారం, నూనె చాలా తక్కువగా తీసుకోవాలి. రక్తపోటు నియంత్రణ మందులు వాడాలి. రక్తహీనత నివారణకూ, పిల్లల్లో ఎదుగుదల లోపించకుండా చేసేందుకు ఎరిత్రోపొయిటిన్, గ్రోత్ హార్మోన్ ఇంజెక్షన్లు, క్యాల్షియమ్ లవణాలు, బైకార్బొనేట్ సప్లిమెంట్స్ ఇవ్వాలి. సీకేడీ పిల్లలను రక్షించుకోడానికి ఉన్న మార్గం డయాలసిస్ లేదా మూత్రపిండాల మార్పిడి మాత్రమే.

డయాలసిస్ అంటే... డయాలసిస్‌ను రెండు రకాలుగా చేస్తారు. మొదటిది హీమోడయాలసిస్ రెండోది పెరిటోనియల్ డయాలసిస్. సీకేడీ చివరిదశలో ఉన్న పిల్లలందరికీ అంతిమంగా మూత్రపిండాల మార్పిడి (కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్) తప్పనిసరి.

ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ముందుగా...

కిడ్నీ అమర్చాల్సిన వ్యక్తికి ముందుగా అనేక రక్త పరీక్షలు, కొన్ని ఇమేజింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. బాధితుల శరీరం... బయటి మూత్రపిండాన్ని నిరోధించకుండా ఉండేందుకు ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ముందు, తర్వాత చిన్నారికి కొన్ని మందులు (ఇమ్యూనోసప్రెసెంట్స్, ఇమ్యూనోమాడ్యులేటర్స్) ఇవ్వాలి. ఇన్ఫెక్షన్స్‌ని నివారించేందుకు చిన్నారిని వేరుగా ఉంచాలి. ఇంట్లోనివాళ్లు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

గత కొన్నేళ్లుగా వైద్యచికిత్సల్లో వచ్చిన పురోగతి వల్ల మునుపు స్వీకర్తకూ, దాతకూ మ్యాచింగ్ వీలుకాదనే ఫలితం వచ్చిన కేసుల్లోనూ ఇప్పుడు మార్పిడి సాధ్యమవుతోంది. అనేక ఆధునిక ప్రక్రియల వల్ల ఇప్పుడు భిన్న బ్లడ్ గ్రూప్స్ వ్యక్తుల్లో సైతం కిడ్నీ మార్పిడి సాధ్యమవుతోంది. ఫలితంగా కిడ్నీ కోసం వెయిటింగ్ పీరియడ్ గణనీయంగా తగ్గింది. ట్రాన్స్‌ప్లాంటేషన్ తర్వాత కూడా చిన్నారులు అన్నివిధాలుగా ఆరోగ్యవంతులవుతారు. అంతేకాదు.. ఇతర పిల్లల్లాగే వాళ్లూ చదవడం, ఆటలాడటం... ఇలా అన్నీ చేయవచ్చు.


డాక్టర్ వి.వి.ఆర్. సత్యప్రసాద్,
సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, బంజారాహిల్స్,
హైదరాబాద్. కాంటాక్ట్ నంబర్ 8882 046 046
www.rainbowhospitals.in

హెల్త్ టిప్

ఛాతీలో మంట...

కడుపులో యాసిడ్ పైకి తంతుంటే!

ఎంత ఆరోగ్యవంతులకైనా జీవితంలో ఎప్పుడో ఒకసారైనా కడుపులోని గ్యాస్ పైకి ఎగజిమ్ముతూ... ఇబ్బంది పెట్టడం ఎప్పుడో ఒకసారి అనుభవంలోకి వస్తుంది. ఈ సమస్యను వైద్యపరిభాషలో 'గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్' (జీఈఆర్‌డీ) అంటారు. కడుపులో యాసిడ్ ఆహారంపైన పనిచేసే సమయంలో దాని వాయువులు (ఫ్యూమ్స్) పైకి ఎగజిమ్మడంతో గొంతు, ఛాతీలో మంట అనిపిస్తుంది.

జీఈఆర్‌డీని నివారించాలంటే... ◗ ఈ సమస్య నివారణకు మంచి జీవనశైలిని అలవరచుకోవడం మేలు. ◗ రాత్రి భోజనం ఆలస్యం చేయకూడదు. ఆహారం తీసుకున్న తర్వాత కొద్దిదూరమైనా నడవాలి. ◗ పక్కమీదకు చేరగానే సాధ్యమైనంత వరకు ఎడమవైపునకు ఒరిగి పడుకోవాలి. ఒకవేళ కుడివైపు తిరిగి పడుకుంటే గొంతు చివర అన్నకోశం దగ్గర ఉండే స్ఫింక్టర్ మీద ఒత్తిడి పడి తెరుచుకుని, ఆహారం వెనక్కు రావచ్చు. అప్పుడు యాసిడ్ కూడా వెనక్కు వచ్చే అవకాశముంటుంది.



◗ తల వైపు భాగం ఒంటి కంటే కాస్త ఎత్తుగా ఉండేలా పక్కను సర్దుకోవాలి. రిఫ్లక్స్ సమస్యతో బాధపడేవారు వీలైతే తల కింద మరో దిండును ఎక్కువగా పెట్టుకోవడం ఉపశమనాన్ని కలిగిస్తుంది. ◗ మందుల విషయానికి వస్తే... హెచ్2 బీటా బ్లాకర్స్, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ (పీపీఐ) అనే మందులతోనూ చికిత్స చేస్తారు.


దీపక్ చహర్, శిఖర్ ధావన్, సచిన్ టెండూల్కర్

స్పిన్‌తో 'విన్ ఇండియా'

ఎప్పట్లాగే భారత్ స్పిన్ అస్త్రంతోనే రంగంలోకి దిగుతుందని... వార్మప్‌లో పేస్ పిచ్‌తో మభ్య పెడుతుందని ఆస్ట్రేలియా సన్నాహక మ్యాచ్ అక్కర్లేదంది. నెట్స్‌లో అదేపనిగా స్పిన్ బౌలింగ్‌లోనే శ్రమించింది. అశ్విన్‌ను పోలిన డూప్లికేట్ బౌలర్‌తో తెగ ప్రాక్టీస్ చేసింది. ఇంత చేసినా 'కంగారు' తప్పలేదు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో ఫైనల్ చేరిన జట్టు అనూహ్యంగా మూడే రోజుల్లో చిత్తయ్యింది. భారత్ భారీ విజయంతో బోర్డర్–గావస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్‌ను ప్రారంభించింది.

- ఇన్నింగ్స్ 132 పరుగులతో భారత్ భారీ విజయం
- అశ్విన్ ఉచ్చులో ఆసీస్ చిత్తు
- రెండో ఇన్నింగ్స్‌లో 91కే ఆలౌట్
- 17 నుంచి ఢిల్లీలో రెండో టెస్టు


అశ్విన్

నాగ్‌పూర్: ఆస్ట్రేలియా భయపడినట్లే జరిగింది. భారత్ స్పిన్ అస్త్రంతోనే గెలిచింది. అయితే కంగారూ టీమ్ చేసిన కసరత్తుకు ఓడిన తీరుకు ఏ మాత్రం పొంతనే లేదు. ఆసీస్‌లాంటి మేటి జట్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 100 (తొలి ఇన్నింగ్స్‌లో 63.5; రెండో ఇన్నింగ్స్‌లో 32.3) ఓవర్లయినా ఆడకపోవడం... మ్యాచ్ మూడో రోజే ముగిసిపోవడం మాత్రం ఎవరూ ఊహించనిది. తొలి ఇన్నింగ్స్‌ను జడేజా (5/47, 2/34) కూల్చినట్లే... రెండో ఇన్నింగ్స్‌ను అశ్విన్ (3/42, 5/37) పడగొట్టేశాడు. దీంతో తొలి టెస్టులో భారత్ ఇన్నింగ్స్ 132 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు టెస్టుల సిరీస్‌లో 1–0తో ముందడుగు వేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న జడేజాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఆట మొదలైందిలా...

ఓవర్‌నైట్ స్కోరు 321/7తో మూడోరోజు శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 139.3 ఓవర్లలో సరిగ్గా 400 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో జడేజా (185 బంతుల్లో 70; 9 ఫోర్లు) తన క్రితం రోజు స్కోరుకు 4 పరుగులే చేసి మర్ఫీ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డయ్యాడు. మరోవైపు అక్షర్ పటేల్ (174 బంతుల్లో 84; 10 ఫోర్లు, 1 సిక్స్) తొలి సెషన్‌లో కుదురుగా ఆడాడు. మిగిలిన టెయిలెండర్ల సాయంతో సాధ్యమైనన్ని ఎక్కువ పరుగులు చేయాలన్న పట్టుదలతో బ్యాటింగ్ చేశాడు. షమీ (47 బంతుల్లో 37; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) వేగంగా ఆడాడు. తమ ప్రధాన బ్యాటర్లను వణికించిన మర్ఫీ బౌలింగ్‌లో షమీ వరుస సిక్సర్లతో అలరించాడు. అయితే షమీని మర్ఫీ తన మరుసటి ఓవర్లో బోల్తా కొట్టించాడు. దీంతో తొమ్మిదో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత సిరాజ్ (1 నాటౌట్) అండతో జట్టు స్కోరును 400 పరుగులకు చేర్చిన అక్షర్‌ను అదే స్కోరు వద్ద కమిన్స్ బౌల్డ్ చేయడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌కు తెరపడింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 223 పరుగుల ఆధిక్యం సాధించింది. అరంగేట్రం చేసిన బౌలర్ మర్ఫీ ఒకే ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు తీశాడు.

ఆసీస్ కూలిందిలా...



లంచ్ బ్రేక్ తర్వాత ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ మొదలైంది. కానీ మూడో సెషన్‌కు ముందే 32.3 ఓవర్లలో 91 పరుగులకే ఆలౌటైంది. ఒకే ఒక్క సెషన్‌లో అగ్రశ్రేణి జట్టయిన ఆసీస్ మొత్తం 10 వికెట్లను కోల్పోవడం గమనార్హం. రెండో ఓవర్ నుంచే అశ్విన్‌ను రంగంలోకి దించడం... అతను ఉస్మాన్ ఖాజా (5)ను పెవిలియన్ చేర్చడంతో ఆసీస్ పతనం శరవేగంగా మొదలై అంతే వేగంగా ముగిసింది. కీలక వన్‌డౌన్ బ్యాటర్ లబుషేన్ (17)ను జడేజా అవుట్ చేయగా, మిగతా బ్యాటర్లు వార్నర్ (10), రెన్‌షా (2), హ్యాండ్స్‌కోంబ్ (6), క్యారీ (10)లను అశ్విన్ తన వరుస ఓవర్లలో వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. 20వ ఓవర్ పూర్తవకముందే ఆసీస్ 64/6 స్కోరుతో ఇన్నింగ్స్ పరాజయానికి సిద్ధమైంది. తర్వాత అక్షర్ (1/6), జడేజా (2/34), షమీ (2/13) తలా ఒక చేయి వేయడంతో ఆస్ట్రేలియా వంద పరుగులైనా చేయలేకపోయింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 177; భారత్ తొలి ఇన్నింగ్స్: 400. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఉస్మాన్ ఖాజా (సి) కోహ్లి (బి) అశ్విన్ 5; వార్నర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 10; లబుషేన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 17; స్మిత్ (నాటౌట్) 25; రెన్‌షా (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 2; హ్యాండ్స్‌కోంబ్ (ఎల్బీడబ్ల్యూ)(బి) అశ్విన్ 6; క్యారీ (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 10; కమిన్స్ (సి) భరత్ (బి) జడేజా 1; మర్ఫీ (సి) రోహిత్ (బి) అక్షర్ 2; లయన్ (బి) షమీ 8; బోలండ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమీ 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (32.3 ఓవర్లలో ఆలౌట్) 91. **వికెట్ల పతనం:** 1–7, 2–26, 3–34, 4–42, 5–52, 6–64, 7–67, 8–75, 9–88, 10–91. **బౌలింగ్:** షమీ 4.3–1–13–2, అశ్విన్ 12–3–37–5, సిరాజ్ 1–1–0–0, జడేజా 12–3–34–2, అక్షర్ 3–0–6–1.

91 భారత గడ్డపై టెస్టుల్లో ఆస్ట్రేలియాకిది అత్యల్ప స్కోరు. 2004లో ముంబైలో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా 93 పరుగులకు ఆలౌటైంది. ఓవరాల్‌గా భారత్‌పై ఆస్ట్రేలియాకిది రెండో అత్యల్ప స్కోరు. 1981 మెల్‌బోర్న్ టెస్టులో ఆస్ట్రేలియా 83 పరుగులకు ఆలౌటైంది.

5 ఆస్ట్రేలియాపై భారత జట్టు ఇన్నింగ్స్ విజయం సాధించడం ఇది ఐదోసారి. చివరిసారి భారత్ 2013లో హైదరాబాద్‌లో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియాపై ఇన్నింగ్స్ విజయం అందుకుంది.

25 భారత్‌లో అశ్విన్ టెస్టు ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీయడం ఇది 25వసారి. తాజా ప్రదర్శనతో అనిల్ కుంబ్లే (25 సార్లు) సరసన అశ్విన్ నిలిచాడు. స్వదేశంలో అత్యధికంగా ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ముత్తయ్య మురళీధరన్ (45 సార్లు), రంగన హెరాత్ (26 సార్లు) ఉన్నారు.

10 నాగ్‌పూర్ టెస్టులో ఆస్ట్రేలియా బ్యాటర్లు పది సార్లు ఎల్బీడబ్ల్యూగా అవుటయ్యారు. వారి టెస్టు చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారి. 2001లో కోల్‌కతా టెస్టులో, గత ఏడాది శ్రీలంకపై గాలె టెస్టులో తొమ్మిదిమంది బ్యాటర్లు ఎల్బీగా వెనుదిరిగారు. భారత బౌలర్లు కూడా ఓ టెస్టులో పదిసార్లు ఎల్బీగా అవుట్ చేయడం ఇదే తొలిసారి.

జడేజాకు జరిమానా



తొలి టెస్టు విజయంలో కీలక పాత్ర పోషించిన రవీంద్ర జడేజాపై జరిమానా పడింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ సమయంలో స్పిన్నర్ అంపైర్ల అనుమతి తీసుకోకుండా తన చేతి వేలు వాపు తగ్గేందుకు అయింట్‌మెంట్ రాశాడు. ఇది కాస్తా బాల్ ట్యాంపరింగ్ అనుమానాల్ని రేకెత్తించగా... మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ వీడియోల్ని పరిశీలించి ట్యాంపరింగ్‌కు పాల్పడలేదని తేల్చారు. అయితే అంపైర్ల అనుమతి లేకుండా అలా చేయడం ఐసీసీ ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించడమేనని... మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్ ఇచ్చారు.

పాక్‌తో పోరుకు భారత్ 'సై'

- శుభారంభంపై హర్మన్ బృందం దృష్టి
- ఐసీసీ మహిళల టి20 ప్రపంచకప్
- సాయంత్రం గం 6:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్–1'లో ప్రత్యక్ష ప్రసారం



కేప్‌టౌన్: టి20 ప్రపంచకప్‌ను సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్న భారత మహిళల జట్టు నేడు గ్రూప్ 'బి' తొలిపోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడుతుంది. కీలకమైన పోరుకు ముందు డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఫిట్‌నెస్ సమస్యలు జట్టును సతమతం చేస్తున్నాయి. తొలి మ్యాచ్‌కు స్మృతి గాయంతో జట్టుకు దూరమవడం బ్యాటింగ్‌పై ప్రభావం చూపగలదు. అయితే ఇటీవల షఫాలీ వర్మ, రిచా అండర్–19 ఈవెంట్‌లో రాణించారు. ఇప్పుడు కూడా బాధ్యతను పంచుకుంటే ఆ సమస్యను అధిగమించవచ్చు. జెమీమా, హర్లీన్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మిడిలార్డర్‌లో రాణిస్తే జట్టుకు ఢోకా ఉండదు. బౌలింగ్‌లో రేణుక, శిఖా పాండే, దీప్తి శర్మ రాణిస్తే పాకిస్తాన్‌పై భారత్‌కు విజయం సులువవుతుంది.

జ్యోతి మళ్లీ జాతీయ రికార్డు



అస్తానా (కజకిస్తాన్): భారత యువ అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ ఈ ఏడాది నాలుగోసారి 60 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు నెలకొల్పింది. ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా శనివారం 60 మీటర్ల హర్డిల్స్ హీట్స్‌లో విశాఖపట్నం అమ్మాయి జ్యోతి 8.16 సెకన్లలో అందరికంటే వేగంగా గమ్యానికి చేరి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో గతవారం 8.17 సెకన్లతో ఫ్రాన్స్‌లో జరిగిన మీట్‌లో తానే నెలకొల్పిన జాతీయ రికార్డును జ్యోతి బద్దలు కొట్టింది.

హైదరాబాద్ 'ఫార్ములా' అదిరింది

విజయవంతంగా ముగిసిన ఫార్ములా 'ఇ' రేస్ • విజేతగా జీన్ ఎరిక్ వెర్నే

ఒకవైపు 320 కిలోమీటర్ల వేగంతో కార్లు దూసుకుపోతున్నాయి... మరోవైపు అంతే రేంజ్‌లో ఫ్యాన్స్ ఉత్సాహం, ఉత్కంఠ... ఒకవైపు వీఐపీ బాక్స్‌లో నుంచి సెలబ్రిటీలు రేస్‌ను ఆస్వాదిస్తుండగా... మరోవైపు గ్యాలరీల్లో ఉన్న సాధారణ అభిమానుల హోరుతో పరిసరాలు దద్దరిల్లుతున్నాయి... రెప్పపాటులో ట్రాక్‌పై జూమ్మంటూ జనరేషన్ '3' కార్లు పరుగులు తీయగా... దాదాపు గంట పాటు హుస్సేన్ సాగర్ తీరం ప్రపంచ పటంపై కనువిందు చేసింది. న్యూయార్క్, బెర్లిన్, బీజింగ్, రోమ్, జ్యూరిక్... ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్టాత్మక ఫార్ములా 'ఇ' రేస్‌కు ఆతిథ్యం ఇస్తున్న నగరాల్లో కొన్ని. ఇప్పుడు హైదరాబాద్ కూడా వీటి సరసన చేరింది. కొత్తగా వచ్చిన క్రీడతో 'స్ట్రీట్ సర్క్యూట్' వద్ద అన్ని రకాలుగా కొత్త తరహా వాతావరణం కనిపించింది. ఫార్ములా 'ఇ' రేస్ విజయవంతమైందన్న సంకేతాన్ని చాటింది. ఈ హోరాహోరీ సమరంలో చివరకు డీఎస్ పెన్‌స్కే జట్టు డ్రైవర్ జీన్ ఎరిక్ వెర్నే విజేతగా నిలిచాడు.



సాక్షి, హైదరాబాద్: భారత్‌లో తొలిసారి నిర్వహించిన ఎలక్ట్రిక్ కార్ రేసింగ్ ఫార్ములా 'ఇ' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అటు ప్రేక్షకాదరణతో పాటు ఇటు నిర్వాహకుల వైపు నుంచి కూడా సూపర్ సక్సెస్‌గా ప్రశంసలందుకుంది. ఫార్ములా 'ఇ' 9వ సీజన్‌లో భాగంగా హైదరాబాద్‌లో శనివారం నాలుగో రేస్ ముగిసింది. హుస్సేన్ సాగర్ పరిసరాల్లో రూపొందించిన 'స్ట్రీట్ సర్క్యూట్'పై 22 మంది పోటీ పడిన ఈ రేస్‌లో డీఎస్ పెన్‌స్కే టీమ్‌కు చెందిన జీన్ ఎరిక్ వెర్నే విజేతగా నిలిచాడు. 33 ల్యాప్‌లతో 2.83 కిలోమీటర్లు ఉన్న ట్రాక్‌పై సాగిన ఈ రేస్‌ను వెర్నే అందరికంటే వేగంగా 46 నిమిషాల 01.099 సెకన్లలో పూర్తి చేశాడు. ఎన్విజన్ రేసింగ్ డ్రైవర్ నిక్ కాసిడీ రెండో స్థానంలో, పోర్ష్ టీమ్ డ్రైవర్ ఫెలిక్స్ డి కోస్టా మూడో స్థానంలో నిలిచాడు. భారత్‌కు చెందిన మహీంద్రా టీమ్ డ్రైవర్ ఒలివర్ రోలండ్‌కు ఆరో స్థానం దక్కింది. 29 పాయింట్లతో పెన్‌స్కే 'టీమ్ చాంపియన్'గా నిలిచింది. విజేతగా నిలిచిన జీన్ ఎరిక్‌కు తెలంగాణ రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు... రన్నరప్ నిక్ క్యాసిడీకి కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ ట్రోఫీలు అందజేశారు. ఈ సీజన్‌లో భాగంగా ఐదో రేస్ ఈనెల 25న దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో జరుగుతుంది.

హైదరాబాద్ రేస్ విశేషాలు...

• వెర్నే రేస్ పూర్తి చేసే సమయానికి అతని కారులో 0.5 శాతం ఎనర్జీ మాత్రమే మిగిలి ఉంది. • ఎన్విజన్ డ్రైవర్ సెబాస్టియన్ బ్యూమీ మూడో స్థానంలో నిలిచినా... 'ఓవర్ పవర్' ఉపయోగించినందుకు 17 సెకన్ల పెనాల్టీ విధించడంతో నాలుగో స్థానానికి పడిపోయాడు. • మహీంద్రా టీమ్ డ్రైవర్లలో రోలండ్ ఆరో స్థానంలో, డి గ్రాసి 14వ స్థానంలో నిలిచారు. • జాగ్వార్ టీమ్‌కు చెందిన ఇద్దరు డ్రైవర్లు మిచ్ ఇవాన్స్, స్యామ్ బర్డ్ ఒకరినొకరు ట్రాక్‌పై 'ఢీ' కొట్టుకున్నారు. దాంతో ఇద్దరూ రేస్‌ను పూర్తి చేయలేకపోయారు. • మూడో స్థానంలో నిలిచిన మాజీ విజేత డి కోస్టాకు ఇది 100వ రేస్ కావడం విశేషం. • పెన్‌స్కే టీమ్‌కే చెందిన డిఫెండింగ్ చాంపియన్ స్టాఫెల్ వందూర్న్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. • 23వ ల్యాప్‌లో మెక్‌లారెన్ డ్రైవర్ జేక్ హ్యూజెస్ కారు స్టీరింగ్ జామ్ అయి ఆగిపోవడంతో సేఫ్టీ కారును తీసుకోవాల్సి వచ్చింది. చివరకు అతనూ రేస్ పూర్తి చేయలేకపోయాడు. ఓవరాల్‌గా ఈ రేసులో ఆరుగురు డ్రైవర్లు రేసును పూర్తి చేయలేకపోయారు.

హైదరాబాద్ 'ఇ' రేసు ఫలితాలు (టాప్–10): 1. జీన్ ఎరిక్ వెర్నే (డీఎస్ పెన్‌స్కే: 46ని:01.099 సెకన్లు). 2. నిక్ క్యాసిడీ (ఎన్విజన్: 46ని:01.499 సెకన్లు). 3. ఫెలిక్స్ డి కోస్టా (పోర్ష్: 46ని: 02.958 సెకన్లు). 4. వెర్లీన్ (పోర్ష్: 46ని: 03.954 సెకన్లు). 5. సెటి కెమారా (నియో 333 రేసింగ్: 46ని: 04.622 సెకన్లు). 6. రోలండ్ (మహీంద్రా: 46ని: 08.237 సెకన్లు). 7. నార్మన్ నాటో (నిస్సాన్: 46ని: 08.417 సెకన్లు). 8. స్టాఫెల్ వాన్‌డూర్న్ (డీఎస్ పెన్‌స్కే: 46ని: 08.663 సెకన్లు). 9. లాటరర్ (అవలాంచె: 46ని: 9.802 సెకన్లు). 10. మొర్టారా (మసెరాటి: 46ని: 10.172 సెకన్లు).



నిక్ క్యాసిడీ
జీన్ ఎరిక్ వెర్నే
ఫెలిక్స్ డి కోస్టా

నగరానికి దక్కిన 'భాగ్యం'

సాక్షి క్రీడా విభాగం



అక్టోబర్ 7, 2022... హైదరాబాద్‌లో ఫార్ములా 'ఇ' రేస్ నిర్వహించబోతున్నట్లు తొలిసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన రోజు... ఇప్పుడు సరిగ్గా నాలుగు నెలల తర్వాత వచ్చిన స్పందనను చూస్తే ఈ రేసింగ్ ఈవెంట్ ఎంతగా సక్సెస్ అయ్యిందో అర్థమవుతుంది. ఫార్ములా 'ఇ' పోటీలను నిర్వహించే అంతర్జాతీయ ఆటోమొబైల్ సమాఖ్య (ఎఫ్ఐఏ) కూడా హైదరాబాద్ పోటీలపై తమ సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఫార్ములా 'ఇ' చరిత్రలో అత్యుత్తమ రేస్‌లలో ఒకటిగా ప్రకటించింది. హైదరాబాద్‌లో 'ఇ' రేసు జరుగుతుందని ప్రకటించిన సమయంలో ఇది సఫలం కావడంపై అనేక సందేహాలు కనిపించాయి. నగరం నడిబొడ్డున 'స్ట్రీట్ సర్క్యూట్' ట్రాక్‌ను సిద్ధం చేయడం అన్నింటికంటే పెద్ద సవాల్‌గా నిలిచింది. అత్యంత వేగంగా ఈ పనులు పూర్తి చేసిన అధికారులు హుస్సేన్ సాగర్ తీరంలో ఎన్టీఆర్ గార్డెన్, ఐమ్యాక్స్ పరిసరాలను రేసింగ్ కార్లకు అనుగుణంగా మార్చారు. అయితే గత నవంబర్‌లో దీనికి సన్నాహకంగా నిర్వహించిన ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) ఆశించిన స్థాయిలో సఫలం కాలేదు. దానికి స్పందన గొప్పగా లేకపోగా, ఏర్పాట్లలో సాగిన లోపాలు, ట్రాక్‌పై డ్రైవర్ల అసంతృప్తి, రేస్‌ల వాయిదాలు వెరసి ప్రతికూల వ్యాఖ్యలు వినిపించాయి. దాంతో ఫార్ములా 'ఇ' నిర్వహణపై కూడా కొంత అపనమ్మకం వచ్చింది. అయితే ఎఫ్ఐఏ నేరుగా ట్రాక్ ఏర్పాటు అంశంలో భాగస్వామిగా మారి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేయించగలిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కీలకంగా ఉన్న, ఫార్ములా 'ఇ' రేసింగ్‌లో జట్టు ఉన్న 'మహీంద్రా' కూడా సహభాగస్వామిగా భారత్‌లో తొలి రేసును విజయవంతం చేయడంలో చురుగ్గా పాల్గొంది. మరోవైపు ట్రాఫిక్ ఆంక్షలు, వాటిలో వచ్చిన ఇక్కట్లతో సామాన్యుల్లో తీవ్ర అసహనం కనిపించింది. శుక్రవారం ట్రాక్‌లోకి సాధారణ వాహనాలు దూసుకురావడం కూడా కొంత ఆందోళన రేపిన అంశం. అయితే సరైన సమయంలో స్పందించిన అధికారులు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల అసంతృప్తిని సాధ్యమైనంతగా తగ్గించే ప్రయత్నం చేశారు. చివరకు అభిమానులు కూడా ఆసక్తిగా పెద్ద ఎత్తున హాజరు కావడం, తమ నగరంలో జరుగుతున్న అంతర్జాతీయ ఈవెంట్‌గా దానికి తగిన విలువ ఇవ్వడంతో ఇది సక్సెస్‌గా నిలవగలిగింది. భారత్‌లో ఢిల్లీ, ముంబైలాంటి నగరాలను కాదని హైదరాబాద్‌లో జరిగిన 'ఇ' రేసింగ్‌కు దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు హాజరు కావడం కూడా దీనికి గల స్థాయిని చూపించింది. మొత్తంగా ఎఫ్ఐఏ కూడా సౌకర్యాలు, ఏర్పాట్ల విషయంలో ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం ఫార్ములా 'ఇ' రేసింగ్‌కు సంబంధించి పెద్ద సానుకూలాంశం. తాజా సీజన్‌లో ప్రపంచవ్యాప్తంగా మరో 12 రేస్‌లు మిగిలి ఉన్నాయి. వచ్చే ఏడాది వేదికపై ఇంకా స్పష్టత లేకున్నా... వచ్చే సీజన్‌లో కూడా హైదరాబాద్ మళ్లీ ఆతిథ్యం ఇవ్వడం పాటు శాశ్వత వేదికగా కూడా మారే అవకాశం ఉంది.

చాంపియన్ సురేఖ



సాక్షి, హైదరాబాద్: ఎన్‌టీపీసీ జాతీయ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డిప్యూటీ కలెక్టర్ వెన్నం జ్యోతి సురేఖ విజేతగా నిలిచింది. న్యూఢిల్లీలో జరిగిన ఈ టోర్నీ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో సురేఖ 'టైబ్రేక్'లో మధ్యప్రదేశ్‌కు చెందిన రాగిణిని ఓడించింది. ఇద్దరూ 147–147తో సమంగా నిలువగా.. 'టైబ్రేక్' షాట్‌లో సురేఖ 10.. రాగిణి 9 పాయింట్లు స్కోరు చేశారు.

బ్లాక్‌హాక్స్‌కు రెండో ఓటమి

బెంగళూరు: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు ఖాతాలో రెండో ఓటమి చేరింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ 14–15, 12–15, 11–15, 15–4, 14–15) కాలికట్ హీరోస్ జట్టు చేతిలో ఓడిపోయింది.

సినిమా


• రామ్‌చరణ్

హైదరాబాద్ టు వైజాగ్ వయా కర్నూలు

దర్శకుడు శంకర్ సినిమాల్లో పాటలు విజువల్ ట్రీట్‌లా ఉంటాయి. భారీ ఖర్చుతో పాటలు చిత్రీకరించడం శంకర్ స్టయిల్. పైగా ఒకే పాటను వివిధ రకాల లొకేషన్స్‌లో తీస్తుంటారు. ప్రస్తుతం రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి సంబంధించిన పాటల చిత్రీకరణ అలానే జరుగుతోంది. ఈ చిత్రం కోసం రూ. 10 కోట్లకు పైగా బడ్జెట్‌తో న్యూజిల్యాండ్‌లో ఓ పాటను చిత్రీకరించారు. ఇప్పుడు మరో పాట చిత్రీకరణలో ఉన్నారు. ఈ పాటను తెలుగు రాష్ట్రాల్లోని డిఫరెంట్ లొకేషన్స్‌లో చిత్రీకరిస్తున్నారు. హైదరాబాద్‌లోని చార్మినార్ లొకేషన్‌లో ఈ పాట చిత్రీకరణ మొదలైంది. ఆ తర్వాత కర్నూలులోని కొండారెడ్డి బురుజు లొకేషన్‌లో, ఆ నెక్ట్స్ వైజాగ్‌లోని జగదాంబ సెంటర్‌లో చిత్రీకరణను ప్లాన్ చేశారు. కొండారెడ్డి బురుజు దగ్గర కొంత భాగం చిత్రీకరించి, వైజాగ్ షిఫ్ట్ అయింది యూనిట్. ఈ పాటను దాదాపు రూ. 5 కోట్ల బడ్జెట్‌తో తీస్తున్నారని టాక్. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి, శ్రీకాంత్, నవీన్ చంద్ర, ఎస్‌జే సూర్య కీలక పాత్రలు చేస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్న ఈ సినిమాకు సంగీతం: తమన్.

నా భర్త విడాకులకు నేను కారణం కాదు

\- హన్సిక


• హన్సిక, సోహైల్

గత ఏడాది డిసెంబరు 4న వ్యాపారవేత్త సోహైల్ కతురియా, హీరోయిన్ హన్సికల వివాహం జరిగిన విషయం తెలిసిందే. వీరి ప్రేమ, పెళ్లి గురించిన సంగతులతో 'లవ్ షాదీ డ్రామా' అనే వీడియో ఒకటి ఓ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ వీడియోలో హన్సిక పంచుకున్న విషయాల్లో సోహైల్ మొదటి పెళ్లి గురించిన అంశం ఒకటి. ''సోహైల్, నా పెళ్లి గురించిన విషయాలను రహస్యంగా ఉంచాలనుకున్నాను. నేను సెలబ్రిటీని కావడం వల్ల కాబోలు అవన్నీ బహిర్గతం అయ్యాయి. సోహైల్ విడాకులు తీసుకోవడానికి నేనే కారణమని వార్తలు వచ్చాయి. సోహైల్ పెళ్లి (మొదటి పెళ్లి)లో నేను పాల్గొన్న ఫోటోలను షేర్ చేసి, కొందరు నన్ను విమర్శించారు కూడా. నిజం చెప్పాలంటే సోహైల్ విడాకులకు నేను కారణం కాదు. నా భర్తకు గతంలో పెళ్లయిన విషయం నాకు తెలుసు. వారికి అధికారికంగా విడాకులు వచ్చాయి'' అని చెప్పుకొచ్చారు హన్సిక. అలాగే ''గతంలో నేనో రిలేషన్‌లో ఉన్నాను. ఈ విషయం అందరికీ తెలుసు. మళ్లీ అలాంటి బంధాన్ని కొనసాగించాలని లేదు. అందుకే పెళ్లి చేసుకున్నాను. సోహైల్ నా జీవితంలోకి వచ్చిన క్షణాలు నాకు ఎప్పటికీ ప్రత్యేకమే. ఇకపై నా భర్తతోనే నేను పబ్లిక్‌లోకి రావాలనుకుంటున్నాను'' అని కూడా పేర్కొన్నారు హన్సిక. ఇక తన మొదటి వివాహం విఫలం కావడానికి హన్సిక కారణం కాదని సోహైల్ కూడా పేర్కొన్నారు. 2014లో రింకీ బజాజ్‌ను పెళ్లాడారు సోహైల్. ''ఆ వివాహ బంధం చాలా కొద్ది కాలం మాత్రమే సాగింది'' అన్నారు సోహైల్. రింకీ, సోహైల్‌కి హన్సిక కామన్ ఫ్రెండ్ కావడంతో ఆ పెళ్లికి వెళ్లారామె. ఆ పెళ్లి వీడియోలో హన్సిక డ్యాన్స్ చేశారు కూడా. ఆ వీడియోను షేర్ చేసి, ఒక ఫ్రెండ్ వైవాహిక జీవితం ముగియడానికి కారణం హన్సిక అంటూ వచ్చిన వార్తలకు 'లవ్ షాదీ డ్రామా' ద్వారా స్పందించారు హన్సిక, సోహైల్.

ఆర్ఆర్ఆర్.. ఓ కనువిందు

\- స్టీవెన్ స్పీల్‌బర్గ్


• రాజమౌళి, స్టీవెన్ స్పీల్‌బర్గ్

'ఆర్ఆర్ఆర్' సినిమాని ప్రశంసించారు హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్. ఆయన దర్శకత్వంలో వచ్చిన హాలీవుడ్ చిత్రం 'ది ఫేబుల్‌మ్యాన్స్' గత ఏడాది నవంబరులో రిలీజ్ అయింది. ఈ చిత్రాన్ని ఈ నెల 10న రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఇండియాలో రిలీజ్ చేసింది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా స్టీవెన్ స్పీల్‌బర్గ్‌ను దర్శకుడు రాజమౌళితో ఆన్‌లైన్ వేదికగా ఇంటర్వ్యూ చేయించారు సంస్థ ప్రతినిధులు. ఈ ఇంటర్వ్యూలోని కొన్ని విషయాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా, ఈ ఇంటర్వ్యూ వేదికగా ఎన్టీఆర్, రామ్ చరణ్‌లు హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'ను మెచ్చుకున్నారు స్పీల్‌బర్గ్. ''దర్శకుడు రాజమౌళిని తొలిసారి కలుసుకున్నప్పటికి నేను 'ఆర్ఆర్ఆర్' సినిమా చూడలేదు. ఇటీవల ఈ సినిమా చూశాను. ఐ క్యాండీ (కనువిందు)గా అనిపించింది. అద్భుతంగా ఉంది'' అన్నారు స్పీల్‌బర్గ్. ఆ ప్రశంసలకు రాజమౌళి స్పందిస్తూ.. మీరు (స్టీవెన్ స్పీల్‌బర్గ్) సినిమా చూసినందుకు చాలా ఆనందంగా ఉందనీ, సంతోషంతో డ్యాన్స్ చేయాలనిపిస్తోందనీ అన్నారు. 'ది ఫేబుల్‌మ్యాన్స్'ను తాను చూశానని, నచ్చిందని కూడా రాజమౌళి పేర్కొన్నారు.

సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 12-2-2023

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



యాదవ/M.Tech/ C.Govt. Asst. Engineer (IOCL)/ 80,000/-pm/5'8" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8008965895 [HA-10306]

మాల క్రిస్టియన్ / M.Tech / C.Govt. PO(SBI)/ 90,000/-pm / 5'9" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10306]

మాల హిందూ/ M.Tech / C.Govt. Income Tax Inspector/ 1 Lakh PM/ 5'8" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10306]

పద్మశాలి/M.Tech, NIT / Govt. ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్/ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept. / 13 Lakhs PA/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 9908209244 [HA-13843]

వడ్డెర/కట్న ప్రసక్తిలేదు / B.Tech / C. Govt. ట్యాక్స్ ఆఫీసర్/ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept./80,000/-pm/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 8341650195 [HA-13843]

క్రిస్టియన్ మాల/కట్న ప్రసక్తిలేదు/M.Tech/ C. Govt. Asst. ఇంజినీర్ / రైల్వే / 90,000/-pm/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13843]

వడ్డెర/కట్న ప్రసక్తిలేదు / B.Tech / Govt. ల్యాండ్ సర్వేయర్ / రెవెన్యూ Dept./ 38,000/-pm, 6' ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10304]

యాదవ/కట్న ప్రసక్తిలేదు /B.Tech / Govt. Asst. ఇంజినీర్ / ఎలక్ట్రికల్ Dept. / 1.15 Lakh p/m, 6' ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-10304]

SC హిందూ మాదిగ/M.Tech/ Govt. ఎగ్జి॥ ఇంజినీర్/ BHEL/ 80,000/- pm, 5'10" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10304]

కమ్మ/M.Tech/ Govt. Asst.ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept./ 75,000/- pm, 5'11" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9963410191 [HA-10304]

రజక/కట్న ప్రసక్తిలేదు / B.Tech / C. Govt. బ్రాంచ్ మేనేజర్ / యూనియన్ బ్యాంక్/ 80,000/- pm, 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10304]

SC హిందూ మాల/కట్న ప్రసక్తిలేదు/ M.Tech / Govt. గెజిటెడ్ ఆఫీసర్/ ఇరిగేషన్ Dept. / 90,000/- pm, 6' ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10304]

2వ పెళ్లి/ 39yr/ Govt/ ఎంప్లాయ్ 2,50,000/- (PM) కుల ప్రసక్తి లేదు/ బాగా స్థిరపడిన అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. (పిల్లలు ఉన్న OK) సంప్ర: Ph: 9959815362 [H-793363]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 30, 5' 7", SWE, H1, 150 K, Rich, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, BE BITS, 28, 5' 10", SWE, 120 K Pounds, 5 Cr. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 23, 5' 8", Engineer, 40 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MTech (BITS), 28, 5' 9", SWE, 24 L P/A, 6 Cr, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS, MS, 25, 5' 5", Doctor, 30 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 23, 5' 8", 20 Crores, UK, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 4", Team Leader, 135 K, H1, Rich, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 23, 5' 6", 5 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి Business, BS, MS, 28, 5' 10", 25 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 6', SWE, 200 K, 15 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DNBSS, 27, 6', Doctor, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 39, 5' 8", Sr SWE, 60 L P/A, 15 Cr, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 23, 5' 4", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 4", SWE, 200 K, 2 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MHA, 28, 5' 4", Doctor, 5 Crores, UK. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 30, 5' 4", SWE, 11 L P/A, 5 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రజక/27y/ 5'7"/ B.Tech/ Govt. Job/ 24 L PA & 31y/5'5"/B.Tech/ AE/ Govt. Job/ 80K p/m వరులకు డిగ్రీ, PG వధువులు కావలెను. కోట్ల శ్రీనివాస్ మ్యారేజ్ బ్యూరో. Ph: 8106303155 [H-792974]

2వ పెళ్లి/కులప్రసక్తి లేదు/B.Tech/ Govt. A.E/APPDCL/70,000/-pm/ 5'8" ఎత్తు/ 45 సం॥ల పిల్లలు లేని సెటిల్డ్ వరునికి వధువు కావలెను. ఫోన్: 9550650024. [HA-13853]

కాపు, 2వ పెళ్లి, 59Y, Govt. ఎంప్లాయి./ 90,000/-pm, Own House, etc. గల వరునికి వధువు కావలెను. అర్జెంట్ ఫోన్: 9701605100. [HA-13853]

కాపు, మున్నూరు కాపు./33/5'5"/BHM హోటల్ మేనేజ్‌మెంట్ జాబ్/లండన్/30 Lakhs PA/ వెల్ సెటిల్ ఫ్యామిలీ వరుడికి ఇంటర్/డిగ్రీ/PG సాంప్రదాయ వధువు కావలెను. ఫోన్: 9846344474. [HA-13853]

క్రిస్టియన్ & SC మాదిగ/M.Tech, NIT / B.Tech, మెకానికల్ / C. Govt. A.E.E ONGC / 1,40,000/-pm/ 5'9" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను. ఫోన్: 9515755529, 9912280929. [HA-13852]

SC & క్రిస్టియన్ మాల/B.Tech, EEE / C.Govt. డిప్యూటీ మేనేజర్ / SBI / 80,000/-pm / 5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు ఫోన్: 9676995093. [HA-13852]

కాపు & మున్నూరు కాపు/B.Tech, MBA / C.Govt. డిప్యూటీ మేనేజర్ / SBI / 12 Lakhs. P.A / 5'9" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు ఫోన్: 9515755529. [HA-13852]

బెస్త/ B.Tech / C.Govt. Asst. మేనేజర్ / ఆంధ్రా బ్యాంక్ 78,000/-pm / 5'10" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను ఫోన్: 7288048678. [HA-13852]

నాయి బ్రాహ్మణ/ B.Tech / C.Govt. Asst. మేనేజర్ / SBI / 78,000/-pm / 5'10" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను ఫోన్: 9581317506. [HA-13852]

వడ్డెర / B.Tech / SWE / 30 Lakhs. P.A / 5'8" ఎత్తు / 29 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను ఫోన్: 9618579861. [HA-13852]

SC మాల/ఏకైక కుమారుడు/B.Tech/C.Govt. Jr. ఇంజినీర్/పవర్ గ్రిడ్ కార్పొరేషన్/1 లక్ష pm/ 5'10" ఎత్తు/29 సం॥ల వరునికి తగిన వధువు కావలెను ఫోన్: 8897389698. [HA-13852]

SC మాదిగ / B.E / C.Govt. ఎలక్ట్రికల్ ఇంజనీర్ / ONGC / 1,20,000/-pm / 5'11" ఎత్తు / 30 సం॥ల వరునికి వధువు కావలెను ఫోన్: 7032058965. [HA-13852]

రజక / B.Tech / C.Govt. Jr. ఇంజనీర్ / రైల్వే / 50,000/-pm / 5'9" ఎత్తు / 27 సం॥ల వరునికి తగిన వధువు కావలెను ఫోన్: 8897389698. [HA-13852]

రెడ్డి/45/5'7"/MBA/బిల్డర్/హైదరాబాద్‌ కోట్ల ఆస్తి గల రెడ్డి వరుడికి తగిన వధువు కావలెను.నో బ్రోకర్స్. డైరెక్ట్ వాట్సప్. ఫోన్: 9032744799. [HA-13853]

2వ పెళ్లి, గోల్డ్‌స్మిత్, CNB, 43, 5'6" ఇంటర్, 1,20,000/-pm/ 1cr. ప్రాపర్టీ ఓన్ హౌస్ & షాప్ వరునికి వధువు కావలెను. అర్జెంట్ ఫోన్: 6303293337, వాట్సప్: 8187053655 [HA-13853]


లేట్ మ్యారేజ్/ హిందు/ఇంటర్ caste/ 50y/Sr. బిజినెస్ అడ్వైజర్(స్టాక్ మార్కెట్) 5Cr ఆస్తి గల వరుడికి డిగ్రీ చదువుకున్న లేట్ మ్యారేజ్ వధువు కావలెను. Ph: 9618050335 [H-793363]

Reddy Now Hyd. 29/6'/ B.Tech , MS USA 20 Cr. * 28/6'/ B.Tech, IIT MS USA * 32/5'10"/ Residency USA. Cont: PP REDDY: 9391198332 [HA-2517]

Reddy 2nd Marriage 34/5'10"/ B.Tech, MS USA * 42/5'11"/ B.Tech, MS USA Citizen * 42/5'7"/ 500K PM/ Citizen - PP REDDY: 9391198332 [HA-2517]

Vice President & MD Software Company USA MS $220K Khamma 27 Years. 5'10" Needs Suitable Bride. Cont:9444817468 [NA-21595]

వరుడు కావలెను



రెడ్డి 40yrs/5'4"/ కుల పట్టింపులేదు/MA, English/ Govt ఎంప్లాయ్ 70K (PM) వెల్ సెటిల్డ్, బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: Ph: 8008474869 [H-793363]

NO CASTE BAR/1, 2వ 1కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరుడు కావలెను. ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారి కోసం మాత్రమే Ph: W: 7794960803 [H-793703]

కుల పట్టింపులేదు/45yr/ 5'3"/లేట్ మ్యారేజ్ Govt టీచర్ 80K (PM) సింగిల్ సెటిల్డ్ గల వధువుకు 1వ, 2వ విడో గల వరుడు కావలెను సంప్ర: Ph: 7286031653 [H-793363]

యాదవ/ B.Tech / C. Govt. Asst. Manager (Canara Bank)/ 50,000/-pm/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8008965895 [HA-10306]

మాల క్రిస్టియన్/ B.Tech / C. Govt. Officer (Income Tax)/ 55,000/-pm/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870 [HA-10306]

క్రిస్టియన్ మాల / 50 లక్షల ఆస్తి / ఏకైక కుమార్తె/ M.Sc-Agri/ Govt. అగ్రికల్చర్ ఆఫీసర్/ A.E.O/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13843]

క్రిస్టియన్ మాల / B.Tech / SWE/ 30,000/-pm/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన SWE/Govt. ఎంప్లాయి వరుడు కావలెను. Ph: 7396369922 [HA-13843]

వాల్మీకి బోయ/ఏకైక కుమార్తె/ B.Tech / Govt. AEE/ ఇరిగేషన్ Dept./ 45,000/-pm/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [HA-10304]

ముదిరాజ్/ ఏకైక కుమార్తె / B.Tech / Govt. Jr. Asst./ ట్రాన్స్‌కో/ 40,000/-pm/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-10304]

క్రిస్టియన్ మాదిగ/B.Tech / C. Govt. డిప్యూటీ మేనేజర్/ SBI బ్యాంక్/ 85,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-10304]

క్రిస్టియన్ మాల/ M.Com / C. Govt. అకౌంటెంట్ ఆఫీసర్/ FCI/ 60,000/-pm/ 5'5" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-10304]

ఆర్యవైశ్య/23y/ 5'3"/ 30 వేలు/ 20 లక్షలు & 28y/ 5'4"/ 45 వేలు/ 35 లక్షలు & రెండో పెళ్లి/35y/ 5'2"/ 50 వేలు/ 40 లక్షలు & 43y/ 5'1"/ 25 వేలు/ 65 లక్షలు/ జి. సుబ్రహ్మణ్యం గుప్త/ "మాసేవ". PH/WA: 9291503949 [H-792933]

రెండో పెళ్లి/కుల పట్టింపులేదు/ 54y/ 5'2"/ Govt./ 90 వేలు/ 2 కోట్లు & 45y/ 5'4"/ 80 వేలు/ ఒక కోటి & 36y/ 5'3"/ 35 వేలు/60 లక్షలు/ "మాసేవ". PH/WA: 9291503949 [H-792933]

బలిజ/కాపు/నాయుడు/24y/ 5'3"/ 30 వేలు / 50 లక్షలు & 29y/ 5'5"/ 45 వేలు/ 35 లక్షలు & రెండో పెళ్లి/34y/ 5'4"/ 75 వేలు/80 లక్షలు & 42y/ 5'2"/ 45 వేలు/ 65 లక్షలు/"మాసేవ". PH/WA: 9346333580 [H-792933]

మాల/22y/ 5'2"/ 25 వేలు/ 20 లక్షలు & 27y/ 5'3"/ 40 వేలు/ 30 లక్షలు & మాదిగ/25y/ 5'1"/ 55 వేలు/50 లక్షలు & 32y/ 5'4"/ 40 వేలు/ 70 లక్షలు/"మాసేవ". PH/WA: 9346333580 [H-792933]

రెడ్డి/23y/ 5'5"/ 80 వేలు/ 90 లక్షలు & 27y/ 5'4"/ 55 వేలు/ 60 లక్షలు & రెండో పెళ్లి/33y/ 5'3"/ 65 వేలు/70 లక్షలు & 38y/ 5'2"/ 40 వేలు/ 38 లక్షలు/"మాసేవ". PH/WA: 9346333580 [H-792933]

కాపు/నాయుడు/విడో/60/తక్కువ చదువు / సొంతబిజినెస్/ 2 ఇళ్ళు/2 ఎకరముల పంట పొలము కల సాంప్రదాయ వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 8179141662 [H-793274]

రెడ్డి/విడో/59y/ 5'5"/ V.Fair/ Govt. (H.M) రిటైర్డ్/ పెన్షనర్/సొంత ఇల్లు, ఆంధ్రాలో పొలాలు/ కోట్ల ప్రాపర్టీ/ పిల్లలులేని వెల్‌సెటిల్డ్ సాంప్రదాయ వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తిలేదు. Ph: 7093717220 [H-793274]

బ్రాహ్మణ్/52y/విడో/ B.Ed./ సొంత ఇల్లు/ ఫ్యామిలీ పెన్షనర్/ 3 ఎకరాల ల్యాండ్ కల వధువుకి కుల, ఆస్తి పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9121433952 [H-793274]

కమ్మ/విడో/ 50Y/ 5'8"/ ప్రొఫెసర్ ఆంధ్ర Hydలో/ సొంతబిజినెస్/ రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (ఇల్లరికం, వారికే ప్రాధాన్యత (నో బ్రోకర్స్) Ph: 7799083500, 7386660643 [H-793274]

2వ పెళ్లి/35yr / Govt / ఎంప్లాయ్ 2,00,000/- (PM) కుల ప్రసక్తి లేదు/ బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్న OK) సంప్ర: Ph: 9502046384 [H-793363]

2వ పెళ్లి/ కుల ప్రసక్తి లేదు/40yr/M.Sc/M.Ed Govt లెక్చరర్ 1 లక్ష (PM) 5 కోట్ల ఆస్తి గల పిల్లలు లేని తెల్లని అందమైన వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్న OK) సంప్ర: Ph: 7396213324 [H-793363]

కుల పట్టింపులేదు/విడో/45y/Dept. of PR & RD/ 1L pm/ Own House/ 10 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9701385407 [H-787499]

రెండో పెళ్ళి/విడో/55y/ Guntur/ లెక్చరర్/ Own House Rents కోట్ల ప్రాపర్టీ గల పిల్లలులేని ఏ బాధరబందీలేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. (పిల్లలున్నా OK). Ph: 8519803423 [H-787499]

కుల పట్టింపులేదు/విడో/48y/Govt. Job/ VRS/ Own Business well settled/ Own House/ 12 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ఆస్తి కలిగిన అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. (ఇల్లరికం/పిల్లలున్నా OK). Ph: 9177631661 [H-787499]

కుల ప్రసక్తిలేదు/విడో/44y/Dept. of NPPA/ 1L pm/ Own House 18 ఎ॥ తోటలు/ కోట్ల ప్రాపర్టీ కలిగిన ఆర్థికంగా వెల్‌సెటిల్, అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8885985513 [H-787499]

FC/53y/ విడో/ 5'3"/ Fair / Own Business/ సొంత ఇల్లు గల సాంప్రదాయమైన వధువుకి వరుడు కావలెను. (CNB). Ph: 9346327887 [H-792974]

కమ్మ/Unmarried/ 28y/ 5'4"/ USA Bank Job/ చేపల చెరువులు, కొబ్బరి తోటలు, కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9515117629 [H-792974]

రెడ్డి /Unmarried/ 29y/ 5'4"/ Architecture in USA/ Phyrolysis Industries/ కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 7382055839 [H-792974]

SC/ 25 / 5'5" / MBBS, MD Gynic, AIIMS Well Settled వధువుకి తగిన వరుడు కావలెను. No Brokers ఫోన్: 9493285326. [HA-13853]

రెడ్డి, విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు, A:30, Q:డిగ్రీ, బిజినెస్‌లు గల అందమైన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 9100717575. [HA-13853]

BC / 39 / 5'2" / డిగ్రీ, విడో, బ్యాంక్ పెన్షనర్, 6 L P.A / Hydలో సొంత ఫామ్ హౌస్, 25 cr స్థిరాస్తి గల ఫెయిర్ వధువుకు బాదరబందీ లేని ప్రొఫెషనల్ వరుడు కావలెను. ఫోన్: 9573943211, 9846929647. [HA-13853]

బ్రాహ్మణ/25/5'3"/ఇంటర్ * 28 / 5'2"/ B.Sc * 30 / 5'3" ఇంటర్ * 27/5'3"/MBA వధువులకు వరులు కావలెను. జాబ్, బిజినెస్ ok పురోహితులకు సం॥ధాలు కలవు ఫోన్: 7815999246. [HA-13853]

రెడ్డి అమెరికా, డివోర్స్ 31 సం॥లు, సాఫ్ట్‌వేర్ * రెడ్డి డివోర్స్, 35 సం॥లు, యూరప్‌లో జాబ్ * రెడ్డి, 42 సం॥లు, లేట్ పెళ్లి, జాబ్, తగిన వరులు కావలెను. ఫోన్: 6304826162. [HA-13853]

రెడ్డి/27 yrs/5'4"/ B.Tech/ కలర్: Fair/ సాఫ్ట్‌వేర్ జాబ్/85K PER Month: అందమైన వధువుకి వరుడు కావలెను. any Caste అయినా Ok. Ph: 7995825318 [H-793703]

OC Caste/ 40yrs/ 5'2"/ MBA/ కలర్: Fair/ Govt జాబ్/ 70K per Month. అందమైన వధువుకి వరుడు కావలెను. any Caste అయినా Ok. Ph: 8500427582 [H-793703]

FC/విడో/60yrs/V.Fair/డిగ్రీ/5'4"/ సొంత ఇల్లు & రెంట్స్/ House wife/50k/- pm/ 2 ఎకరాల పంట పొలం కల వధువుకి కుల పట్టింపులేని మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 9059150892 [H-793703]

2వ పెళ్లి / B.Tech / Govt. Jr. Asst / కలెక్టరేట్ ఆఫీస్ / 40,000/-pm / 5'2" ఎత్తు / 28 సం॥ల వధువుకు వరుడు కావలెను ఫోన్: 9963757612. [HA-13852]

Reddy 26/ 5'5"/ B.Tech, MS USA/ Very Fair/ 50 Cr. * 28/ 5'5"/ BDS US Public Health H1. PP REDDY: 9391198332 [HA-2517]

Reddy 25/ 5'5"/ MD (Radiology) 2nd Yr. * 27/ 5'5"/ V. Fair, B.Tech/SWE Hyd* 25/ 5'5"/ MD (Gen). PP REDDY: 9391198332 [HA-2517]

Reddy 2nd Marriage 32/ 5'4"/ MBBS Govt. Dr. * 32/ 5'6"/ B.Tech/ SWE/ V.Fair * 25/ 5'4"/ B.Com. PP REDDY: 9391198332 [HA-2517]

★

SC మాల హిందు/డైవర్సీ/37 సం.లు, సెంట్రల్ గవర్నమెంట్ టీచర్ సెటిల్డ్ వధువుకు తగిన గవర్నమెంట్ టీచర్ గవర్నమెంట్ లెక్చరర్ గల వరుడు కావలెను. డైరెక్ట్. 7013362957 [HA-13817]

వేదికలు



వడ్డెర వరుడు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-10303]

క్రైస్తవ వివాహ పరిచయ వేదిక www.indiachristianmatrimony.com 10,000 మంది ప్రొఫైల్స్‌తో ప్రతీ శనివారం వివాహ వేదిక @ అమృత వాణి, Sec'bad. Ph: 8885073555, 8885428555 [H-793274]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజీ దుర్గ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. Ph: 8555980066 / 6302543297 [H-787499]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజినీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-792974]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-10309]

Kamma-Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-10309]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/Blue Trend Matrimonial (P) Ltd. [HA-10309]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-10309]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-10309]

15 రో॥ అన్ని కులముల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com © 94920 33897, 94904 16355, 94407 85888 W [B-937]

Registration Free. మీకు తగిన సంబంధాలు ఉంటేనే Subscription తీసుకోండి. 25 సంబంధాలు కేవలం రూ. 500/- మాత్రమే. www.jeelakarrabellam.com, 98497 44707 [G-955]

40 సంవత్సరాలుగా వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ కాకతీయ మ్యారేజెస్. kaakateeya.com. Ph: 9342939345, 9383 999 999. [HA-10053]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd వేర్/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-793251]

ఫ్రీ రిజిస్ట్రేషన్. అన్ని కులాల వారికి 1వ/2వ/లేటు తగిన సంబంధాలు చూడబడును. స్త్రీలకు ప్రత్యేకం. ధ్రువ మ్యారేజెస్. 9949395407 [H-787368]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt./ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ PG/ NRI/ PVT/ బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 8712384555 [HA-28721]

మాల, మాదిగ : IAS, IPS, IRS, IRTS, ES, Group-I, II, Bank P.O, USA, UK, SWE, B.Tech (IIT), MBA (IIM), Govt. Officer, MBBS, MD. Cont. Cell : 73969 15712. [M-6470]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-906]

మాదిగ వివాహ పరిచయ వేదిక. 12-2-23, 12-6PM, ముందుగా రిజిస్టర్ చేసుకున్న వారి ప్రొఫైల్ హాల్‌లో డిస్‌ప్లే చేస్తాము. # సికింద్రాబాద్ స్టేషన్. 9347046175 [H-793265]

బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం (Online) 2/04/23న Bhavanimatrimony, Hyd, Free Registration. Ph: 9704656103/ 9533608887 (Whatsapp No.) [HA-863]

రెడ్డి పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి U.S.A, కెనడా, లోకల్, నాన్‌లోకల్ Dubbaka Matrimony. Ph: 9059290726 [H-793261]

కేవలం డాక్టర్ వధూవరుల పరిచయ వేదిక అన్ని కులాలకు మరియు కేవలం ఆర్యవైశ్య పరిచయ వేదిక ఫోన్ నెంబర్లు, చిరునామా ఇవ్వబడును. 05-02-23 & 26-02-23, 1116/- భోజనం ఫ్రీ మొదటి 30 మందికి మాత్రమే 9705135074. [Z-0992955]

ఉపాధి పనులకు భారీగా కూలీల హాజరు

- పీఆర్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా

సాక్షి, హైదరాబాద్: ప్రతి గ్రామ పంచాయతీలో రోజూ సగటున 50 మంది కూలీలకు తగ్గకుండా.. జిల్లావ్యాప్తంగా పదివేలమంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని అధికారులను పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. ఈనెల 20 లోగా పది లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులన్నీ నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీకి ఫిబ్రవరి, మార్చి నెలలు అనుకూలంగా ఉన్నందున పెద్ద సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. శనివారం పీఆర్ డైరెక్టర్ హనుమంతరావుతో కలిసి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, డీఆర్డీవోలు, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను మార్చి 25 లోగా పూర్తి చేసి వివరాలను ఎఫ్‌టీవోలో నమోదు చేయాలని ఆదేశించారు.

మత్స్యకారులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి

అసెంబ్లీ వద్ద టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్ ఆందోళన

సాక్షి, హైదరాబాద్: తమకు రూ.10 లక్షల కవరేజీతో హెల్త్‌కార్డులు ఇవ్వాలని మత్స్యకారులు చేపట్టిన ఆందోళన అసెంబ్లీ సమీపంలో ఉద్రిక్తతకు దారి తీసింది. మత్స్యకారులను ఆదుకోవాలంటూ టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమాన్ని పోలీసులు ముందుగా అంచనా వేయలేకపోయారని చెపుతున్నారు. అనూహ్యంగా ఆటోలో అసెంబ్లీ ముందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, మత్స్యకారులు ప్రభుత్వానికి వ్యతి రేకంగా నినాదాలు చేశారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మెట్టు సాయి కుమార్ మాట్లాడుతూ మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, రూ.10 లక్షల కవరేజీతో హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



అసెంబ్లీ వద్ద మెట్టు సాయికుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

దీన్‌దయాళ్ బాటలోనే మోదీ సర్కారు: కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ సిద్ధాంత కర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రపంచానికి ఏకాత్మతా మానవతావాదం సిద్ధాంతాన్ని చాటారని పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ నివాళి అర్పించారు. దీన్‌దయాళ్ బాటలోనే ప్రధాని మోదీ నడుస్తూ ఆయన సిద్ధాంతాలను పాటిస్తున్నారని తెలిపారు. వీటి స్ఫూర్తితోనే మోదీ సర్కార్ అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. దీన్‌దయాళ్ చూపిన మార్గంలోనే దేశాన్ని విశ్వగురువుగా మోదీ మారుస్తున్నారని లక్ష్మణ్ పేర్కొన్నారు. సిద్ధాంత వేత్తలు శ్యామాప్రకాశ్ ముఖర్జీ, దీన్‌దయాళ్ త్యాగాల ఫలితంగానే శ్రీనగర్ లాల్‌చౌక్‌లో నేడు జాతీయ జెండా ఎగరేస్తున్నామన్నారు. శనివారం రాష్ట్ర కార్యాలయంలో దీన్‌దయాళ్ బలిదాన దివస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్, ఇతర నేతలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

పంటలు ఎండి.. కడుపు మండి..

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తాళం వేసిన రైతులు

ఇల్లెందు రూరల్: విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో.. అధికారులను అడిగేందుకు సబ్‌స్టేషన్‌కు వెళ్తే.. అక్కడెవరూ లేకపోవడంతో ఆగ్రహించిన రైతులు విద్యుత్ కార్యాలయానికి తాళం వేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మాణిక్యారంలో శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. మాణిక్యారం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం మొక్కజొన్న ఏపుగా పెరిగే దశలో ఉంది. వరి నాట్లు కూడా ఇటీవలే పూర్తయ్యాయి. ఈ తరుణంలో రెండు పంటలకు నీరు అధికంగా అవసరం. కానీ రోజుకు ఆరు గంటలపాటు.. అది కూడా రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తుండటంతో రైతులు చేలవద్దే పడిగాపులు కాస్తున్నారు. వారం రోజులుగా తీవ్ర విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో అధికారులను ప్రశ్నించేందుకు పలువురు రైతులు సబ్‌స్టేషన్‌కు వెళ్లగా అక్కడ సమాధానం చెప్పేందుకు ఎవరూ లేరు. ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో ఆగ్రహించిన రైతులు సబ్‌స్టేషన్ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. దీనిపై విద్యుత్ ఏఈని వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రోజుకు ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతులు వెళ్లిపోయిన అనంతరం వచ్చిన సిబ్బంది తాళం పగులగొట్టి విధులు నిర్వర్తించారు.



భద్రాద్రి జిల్లా మాణిక్యారం సబ్‌స్టేషన్ కార్యాలయానికి తాళం వేస్తున్న రైతు

కేటీపీఎస్ కోల్ ప్లాంట్‌లో ప్రమాదం

- బాయిలర్ ఫ్లాష్ ఓవర్ కావడంతో మంటలు
- ఏఈ, ఇద్దరు ఆర్టిజన్ కార్మికులకు తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏఈ విజయ్

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ కోల్ ప్లాంట్‌లో బ్రేకర్లు అమరుస్తుండగా షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి ముగ్గురికి గాయాలయ్యాయి. శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కేటీపీఎస్‌లోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఏడో దశ కోల్ ప్లాంట్‌లో ఎంటీసీ కంట్రోల్ బోర్డ్ వద్ద ఏఈ విజయ్ ఆధ్వర్యాన ఆర్టిజన్లు మల్లికార్జున్, వరదరాజు బ్రేకర్లు అమరుస్తున్నారు. అయితే బ్రేకర్ల కండక్టర్ సరిగా అతుక్కోకుండానే విద్యుత్ ఆన్ చేయడంతో మంటలు చెలరేగాయి. మంటలు బయటకు ఎగిసిపడటం(బాయిలర్ ఫ్లాష్ ఓవర్)తో ఏఈతోపాటు మరో ఇద్దరు కార్మికులకు ముఖం, ఛాతీ, చేతులు కాలిపోయాయి. అప్రమత్తమైన తోటి సిబ్బంది వెంటనే కేటీపీఎస్ ఆస్పత్రికి తీసుకెళ్లగా...ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఈ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ...బ్రేకర్ అమరుస్తుండగా కనెక్టర్ల నుంచి మంటలు రావడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేపడతామన్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎంపీ నామా నాగేశ్వరరావు జెన్‌కో డైరెక్టర్లతో మాట్లాడి గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందజేయాలని ఆదేశించారు.

రెండో రోజూ రికార్డు స్థాయి విద్యుత్ డిమాండ్

- 11వ తేదీన 14,649 మెగావాట్ల గరిష్ట డిమాండ్
- 10న 14,169 మెగావాట్లు నమోదు
- వ్యవసాయ డిమాండ్ పెరగడమే కారణం
- ఈ వేసవిలో డిమాండ్ 15,500 మెగావాట్లకు చేరే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వరుసగా రెండో రోజు విద్యుత్ డిమాండ్ కొత్త రికార్డు సృష్టించింది. శనివారం మధ్యాహ్నం 12.32 గంటల ప్రాంతంలో డిమాండ్ 14,649 మెగావాట్లకు ఎగబాకి కొత్త రికార్డు నమోదు చేసింది. శుక్రవారం ఉదయం 8.02 గంటలకు రాష్ట్రంలో నమోదైన 14,169 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ రికార్డును శనివారం నమోదైన రికార్డు చెరిపివేసింది. 2022 మార్చి 29న నమోదైన 14,160 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ రాష్ట్రంలో ఇప్పటి వరకు అత్యధికం కాగా, గత రెండు రోజులుగా అంతకు మించిన పీక్ డిమాండ్ నమోదైంది. ఎండలు తీవ్రం అవుతుండడంతో రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ వినియోగం భారీగా పెరిగిపోయింది. రైతులందరూ ఒకేసారి బోరుబావులను ఆన్ చేస్తుండడంతో ఉదయం వేళల్లో రాష్ట్ర విద్యుత్ డిమాండ్ అమాంతంగా పెరిగిపోతోందని తెలంగాణ ట్రాన్స్‌కో అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఒకేసారి రైతులందరూ వ్యవసాయ మోటార్లను ఆన్ చేసేందుకు వీలు లేని విధంగా ఇకపై మరింత నియంత్రణతో వ్యవసాయ విద్యుత్‌ను సరఫరా చేసే అవకాశం ఉందని సమాచారం. దీంతో మరో నాలుగైదు రోజుల్లో గరిష్ట విద్యుత్ డిమాండ్‌లో భారీ పెరుగుదల నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉందని చెపుతున్నారు. ప్రస్తుత వేసవిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,500 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

గొత్తి కోయలకూ 'పోడు' పట్టాలివ్వాలి

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల

నర్మెట: పోడు భూములు సాగు చేసుకుంటున్న ఇతర ఎస్టీలతోపాటు గొత్తి కోయలకు కూడా వెంటనే పట్టాలు ఇవ్వాలని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొత్తి కోయలు అటవీ అధికారులను హత్య చేయడాన్ని తాను సమర్థించడం లేదని, అయితే వారు కూడా చాలా కాలం నుంచి పోడు చేసుకుని జీవిస్తున్నందున వారికి కూడా పట్టాలివ్వాలని అన్నారు. షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్ర శనివారం జనగామ జిల్లా నర్మెట, తరిగొప్పుల మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా నర్మెట మండలం ఆగాపేటలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, తన కుటుంబ సభ్యులే భూకబ్జాలకు పాల్పడుతుంటే సీఎం కేసీఆర్ నోరు మెదపడంలేదని, ఇదేనా బంగారు తెలంగాణ అని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ బీఆర్ఎస్ నేతల కబ్జాలకే ఉపయోగపడిందని మండిపడ్డారు. వైఎస్సార్ పాలనలో 9 రకాల నిత్యావసర సరుకులను పేదలకు రేషన్‌ద్వారా అందిస్తే.. కేసీఆర్ బెల్ట్ షాపులను ఏర్పాటు చేసిన ఘనత దక్కించుకున్నారని ఎద్దేవా చేశారు. తన పాదయాత్ర 3,700 కిలోమీటర్ల మైలురాయి దాటిన సందర్భంగా తరిగొప్పులలో ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న షర్మిల

యాదాద్రిలో 15 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు


యాదాద్రి కొండపై అనుబంధ శివాలయం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి కొండపై శ్రీపర్వత వర్ధిని సమేత రామ లింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శివాలయంలో ఈ నెల 15వ తేదీన స్వస్తివచనంతో ఉదయం 10.30 గంటలకు ఉత్సవాలను ఆచార్యులు ప్రారంభిస్తారు. 16వ తేదీన భేరీపూజ, అగ్నిప్రతిష్ఠ, 17వ తేదీన రాత్రి 7గంటలకు శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, 18వ తేదీ మహా శివరాత్రి సందర్భంగా అభిషేకాలు, రాత్రి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకాలు, 19న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్ష బిల్వార్చన, రాత్రి శ్రీరామలింగేశ్వరస్వామి రథోత్సవం, 20వ తేదీన మధ్యాహ్నం పూర్ణాహుతి, రాత్రి డోలోత్సవంతో ఉత్సవాలు పూర్తవుతాయి. 17వ తేదీన శివ కల్యాణోత్సవంలో పాల్గొనే వారికి రూ.516 (ఇద్దరికి), 18వ తేదీ మహాశివరాత్రి రోజు అభిషేకానికి రూ.300, రాత్రి జరిగే శతరుద్రాభిషేకానికి రూ.516 (ఇద్దరికి), 19వ తేదీన లక్ష బిల్వార్చనలో పాల్గొనేందుకు రూ.516 (ఇద్దరికి) టికెట్ రుసుము ఉంటుందని అధికారులు వెల్లడించారు.

'ఉడుకు బెల్లం'కు రంగినేని సాహిత్య పురస్కారం



సిరిసిల్ల కల్చరల్: రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా జాతీయస్థాయిలో అందజేస్తున్న రంగినేని ఎల్లమ్మ స్మారక సాహిత్య పురస్కారానికి 2022 సంవత్సరానికి చింతకింది శ్రీనివాసరావు రచించిన 'ఉడుకు బెల్లం'కథాసంపుటి ఎంపికైంది. మార్చిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పురస్కార కమిటీ సమన్వయకర్త మద్దికుంట లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు కింద రచయితకు రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు వెల్లడించారు.

యాదాద్రి జిల్లాలో శిలాయుగపు చిత్ర కళ

ప్యారారం గ్రామంలో ఆదిమానవుల వర్ణ చిత్రాలు 8 వేల సంవత్సరాల నాటివిగా గుర్తింపు



బొమ్మలరామారం: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలో ఆదిమానవుడు గీసిన వర్ణ చిత్రాలు బయటపడ్డాయి. మండలంలోని ప్యారారం గ్రామంలోని చిత్తారిగుట్టపైన ఆదిమానవుడి రంగుల కాన్వాస్‌ను కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు అహోబిలం కరుణాకర్, మహమ్మద్ నసీరుద్దీన్, కొరవి గోపాల్, మహమ్మద్ అన్వర్ పాషాలతో కలిసి విశ్రాంత పురావస్తు అధికారి, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి శనివారం పరిశీలించారు. చిత్తారిగుట్ట అని పిలువబడే ఒక రాతి ఆవాసపు గోడ, కప్పు భాగంలో మధ్య రాతియుగం, కొత్తరాతి యుగపు మూపురం ఉన్న ఆరు ఎద్దు బొమ్మలు, ఒక అడవి పంది, రెండు జింకలు, ఇద్దరు మనుషుల బొమ్మలను గుర్తించారు. ఎర్రజాజు రంగుతో రేఖా చిత్ర రీతిలో గీచిన ఈ బొమ్మలు ఆనాటి మానవుల చిత్ర కళా నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయన్నారు. చిత్తారిగుట్ట దిగువన సూక్ష్మ రాతి పనిముట్లు, సూక్ష్మ రాతి పరికరాలు, ఒక కొత్తరాతి యుగపు రాతి గొడ్డలి, గొడ్డళ్లను అరగదీసిన గుంటలను కనుగొన్నారు. ఈ ఆధారాల వల్ల ఈ వర్ణ చిత్రాలు క్రీస్తు పూర్వము 8 వేల సంవత్సరాల కిందటివని తెలుస్తుందని శివనాగిరెడ్డి వెల్లడించారు. అదే రాతి ఆవాసంపైన పూర్తిగా రంగుతో నింపిన తొలియుగపు స్త్రీ బొమ్మ, మధ్య యుగాలనాటి శృంగార భంగిమలో గల రెండు జంటల చిత్రాలు కూడా ఉన్నాయన్నారు. పురావస్తు ప్రాధాన్యత గల ఈ వర్ణ చిత్రాలను భావితరాలకు అందించాలని శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. బొమ్మలరామారం మండలానికి ఆ పేరు రావడానికి కారణం ఇదేనని వివరించారు.

కొత్తగా ఐదు కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శనివారం 3,521 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఐదుగురు వైరస్ బారిన పడ్డారు. ఒక్కరోజులో కరోనా నుంచి ఐదుగురు కోలుకున్నారు. ప్రస్తుతం 23 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు.




హైదరాబాద్ వేదికగా శనివారం జరిగిన ఫార్ములా 'ఇ' రేసుకు వచ్చిన మహీంద్రా అధినేత ఆనంద్ మహీంద్రకు నాటునాటు స్టెప్స్ నేర్పిస్తున్న హీరో రాంచరణ్ ● సతీమణి శైలిమతో కలిసి రేసును తిలకిస్తున్న మంత్రి కేటీఆర్





కేటీఆర్ తనయ అలేఖ్య, కుమారుడు హిమాన్షు, మహేష్‌బాబు కుమారుడు గౌతం




సినీ నటులు నాగ చైతన్య, నాగార్జున, అఖిల్

హుస్సేన్ సాగర్ తీరంలో ఇ- కార్ రేస్ హోరెత్తింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోటారు క్రీడా ప్రియులను కొన్ని గంటల పాటు హైదరాబాద్ వైపు దృష్టి మళ్లించింది. ప్రత్యక్షంగా వీక్షించిన వేలాది మంది సందర్శకులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తింది. శనివారం నెక్లెస్ రోడ్డులోని స్ట్రీట్ సర్క్యూట్‌లో జరిగిన ప్రతిష్టాత్మక ఫార్ములా- ఇ అంతర్జాతీయ కార్ రేసింగ్ పోటీలకు సాధారణ ప్రేక్షకులతో పాటు సినీ, రాజకీయ, క్రీడా తదితర రంగాలకు చెందిన ప్రముఖులు సైతం పెద్ద సఖ్యలో హాజరయ్యారు. పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాల ప్రాధాన్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమే లక్ష్యంగా భారత్‌లోనే మొదటిసారిగా నగరంలో జరిగిన ఫార్ములా-ఇప్రిక్స్ పోటీలు విజయవంతంగా ముగిశాయి.

–సాక్షి, హైదరాబాద్

సంతోషమే 'పూర్తి' బలం!

ఆనందంగా ఉన్నామనే భావన విజయపథం వైపు నడిపిస్తుందంటున్న మానసిక నిపుణులు

- సంతోషానికి ఓ సూచిక పెట్టి వరల్డ్ హ్యాపీనెస్ ఇండెక్స్ రిపోర్ట్ విడుదల
- 2022లో మొత్తం 146 దేశాల్లో భారత్‌కు 136వ ర్యాంక్
- విదేశాలకు, భారత్‌కు వర్తించే అంశాల్లో తేడాలే తక్కువ ర్యాంక్‌కు కారణమని వెల్లడి
- వ్యక్తిగతంగా కంటే సమూహం, సమష్టి ఆనందం ఉన్నతస్థాయిలో నిలుపుతుందని వివరణ



సాక్షి, హైదరాబాద్: 'సంతోషమే సగం బలం' అన్న సామెత ఎప్పటి నుంచో ఉన్నదే. కానీ ప్రస్తుత జీవన పరిస్థితులు, కొత్త అలవాట్లు, కెరీర్ సమస్యల నేపథ్యంలో మనిషికి 'సంతోషమే పూర్తి బలం' అన్నట్టుగా మారిపోయింది. సంతోషమనేది మనిషి జీవితంలో ఒక ముఖ్యమైన సానుకూల భావన అని.. ఆనందంగా ఉండేవారు మంచి మానవ సంబంధాలు కలిగి ఉంటారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సంతోషంగా ఉండేవారు తక్కువగా ఒత్తిళ్లకు గురవుతారని.. ఇతరుల కంటే అధిక సృజనాత్మకత కలిగి ఉండటంతోపాటు ఇతరుల పట్ల దాతృత్వాన్ని, ఉదారతను ప్రదర్శిస్తారని వివరిస్తున్నారు. ఇలాంటి వారు తోటివారి నుంచి సామాజికంగా తోడు పొందుతూ.. మంచి ఆరోగ్యంతో ఎక్కువకాలం జీవిస్తారని చెప్తున్నారు. అసలు తాము సంతోషంగా ఉన్నామనే భావనే.. చాలా మందిని తమ జీవితంలో అనేక ప్రయత్నాలు, చొరవ వైపు నెట్టి, విజయం దిశగా నడిపిస్తుందని విశ్లేషిస్తున్నారు. సమాజంలో లేదా కుటుంబంలో పెద్దల అంచనాలను చేరుకోలేకపోతే అసంతృప్తికి దారితీస్తుందని.. పెద్దగా సమస్యలు లేకపోయినా ఇంకేదో కావాలని కోరుకుంటూ నిరాశ, నిస్పృహలకు గురవుతున్నవారు పెద్ద సంఖ్యలో ఉన్నారని మానసిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

హ్యాపీనెస్‌కు ఓ ఇండెక్స్.. మన పరిస్థితి భిన్నం..

గ్లోబల్ హ్యాపీనెస్ కౌన్సిల్ మొదటగా ప్రపంచ దేశాలకు సంబంధించి హ్యాపీనెస్ ఇండెక్స్‌ను రూపొందించింది. 2012 నుంచి దాదాపు 150 దేశాలకు సంబంధించి పలు అంశాల ప్రాతిపదికన ఏటా 'వరల్డ్ హ్యాపీనెస్ ఇండెక్స్' నివేదికను వెలువరిస్తోంది. తలసరి జీడీపీ, సాంఘిక మద్దతు, వ్యక్తిగత స్వేచ్ఛ, అవినీతి స్థాయిలు, సేవాభావం, దాతృత్వం, ఆరోగ్యకర జీవన అంచనాలు, ఆనందానికి సంబంధించి ఆ దేశ ప్రజలు ఏమనుకుంటున్నారు అన్న అంశాలను ఇందుకు పరిగణనలోకి తీసుకుంటోంది. ఈ హ్యాపీనెస్ ఇండెక్స్‌లో భారత స్కోర్, ర్యాంక్ ఏమంత గొప్పగా ఉండటం లేదు. హ్యాపీనెస్ ఇండెక్స్ రిపోర్ట్–2022లో మొత్తం 146 దేశాలకుగాను భారత్ 136 ర్యాంకు సాధించింది. ఆయా దేశాలకు, ఇండియాకు వర్తించే విషయాల్లో తేడాలు, సారూప్యతలు భిన్నంగా ఉండటం కూడా ఇందుకు ఒక కారణమని నిపుణులు చెప్తున్నారు. అంతేగాకుండా మనదేశంలో సంతోషం–సంపద మధ్య బలహీనమైన సహ సంబంధం (కోరిలేషన్) కొరవడటమూ కారణమని ప్రముఖ ఆర్థికవేత్త, రచయిత్రి జయశ్రీ సేన్‌గుప్తా అభిప్రాయపడ్డారు. దేశంలో అసమానతల పెరుగుదల, ధనికులు తమ ఇళ్లలో ఆర్భాటంగా చేసే పెళ్లిళ్లు, ఫంక్షన్లు వంటివి సామాన్య ప్రజల్లో అసంతృప్తికి కారణం అవుతాయని చెప్పారు. మితిమీరిన పట్టణీకరణ, నగరాలు ఇరుకుగా మారడం, ఆహారభద్రత, ధరల పెరుగుదల వంటివి కూడా దీనిని ప్రభావితం చేస్తాయన్నారు.

సమష్టి ఆనందంతోనే ఉన్నత స్థాయికి..

ప్రపంచంలో ఎవరినైనా జీవితంలో ఏది ముఖ్యమని ప్రశ్నిస్తే.. సంతోషంగా ఉండటమేననే సమాధానం వస్తుంది. అందరూ ఆనందంగా ఉండాలనే కోరుకుంటారు. కానీ సంతోషమైనా, ఆనందమైనా ఎలా వస్తుందనేది ముఖ్యం. వ్యక్తిగత స్థాయి కంటే కూడా సమూహ, సమష్టి ఆనందం ఉన్నతస్థాయిలో నిలుపుతుంది. సంతోషం, సంతృప్తి, ఆనందం అనేవాటిని మనకు మాత్రమే పరిమితం చేసుకోకుండా విశాల సమాజానికి, వర్గానికి కలిగేలా చేయడం ద్వారా ఒక సార్థకత ఏర్పడుతుంది. అయితే అపరిమితమైన ఆశలు, ఆశయాలు, నెరవేర్చుకోలేని కోరికలు సరికాదు. జీవితం–చేస్తున్న పని మధ్య తగిన సమతూకం సాధించడమూ ముఖ్యమే. మనకు నచ్చిన ఆహారం తినడం నుంచి నిర్దేశించుకున్న లక్ష్యాలు, అంచనాలు చేరుకోవడం వరకు సంతోషానికి మార్గాలు ఎన్నో. ఒక్కొక్కరి అలవాట్లు, పద్ధతులు, ఆలోచనా ధోరణులు, పెరిగిన వాతావరణం వంటివాటి ఆధారంగా ఈ మార్గాలు మారుతూ ఉంటాయి.

– డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, డైరెక్టర్, ఆశా హాస్పిటల్స్

శారీరక, సామాజిక అవసరాల నుంచి..

అమెరికాకు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ అబ్రహం మాస్లో 1970 దశకంలో చేసిన సిద్ధాంతీకరణల ప్రకారం..

- మనిషి జీవితం ప్రధానంగా ఆహారం, నీరు, శృంగారం, నిద్ర వంటి ప్రాథమిక శారీర అవసరాలపై ఆధారపడి ఉంటుంది. ఇవి సంతోషాన్ని ప్రభావితం చేస్తాయి.
- శారీరక భద్రత, ఉద్యోగం, కుటుంబం, ఆరోగ్యం, ఆస్తుల భద్రత, ప్రేమ, తమదనే భావన, లైంగికపరమైన దగ్గరితనం, ఆత్మగౌరవం, విశ్వాసం, ఇతరులను గౌరవించడం, స్వీయ వాస్తవికత, నైతికత ఆనందాన్ని కలిగిస్తాయి.
- సామాజికంగా తెలిసిన వారితో స్నేహసంబంధాలు, ప్రేమ, బంధుత్వాల సాధనతోనూ చాలా మంది సంతోషపడి సంతృప్తి చెందుతారు.

తొమ్మిదో నిజాంగా నవాబ్ రౌనఖ్ యార్ ఖాన్

మజ్లిస్–ఎ–షబ్జాదేగన్ సొసైటీ ప్రకటన



సనత్‌నగర్ (హైదరాబాద్): అసఫ్ జాహీ వంశం తొమ్మిదో నిజాంగా నవాబ్ రౌనఖ్ యార్ ఖాన్ ఎంపికయ్యారు. ఈ మేరకు మజ్లిస్–ఎ–షబ్జాదేగన్ సొసైటీ ప్రతినిధులు శనివారం ప్రకటించారు. ఎనిమిదో నిజాం నవాబ్ మీర్ బర్కత్ అలీఖాన్ మృతి అనంతరం తమ కుటుంబ సంప్రదాయాల ప్రకారం తొమ్మిదో నిజాంను ఎంపిక చేయడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలిపారు. అమీర్‌పేటలోని మ్యారీగోల్డ్ హోటల్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు షెహజాదా మీర్ ముజ్తాబా అలీఖాన్, ఉపాధ్యక్షుడు మీర్ నిజాముద్దీన్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ మొయిజుద్దీన్ ఖాన్ వివరాలను వెల్లడించారు. 4,500 మంది నిజాం కుటుంబ సభ్యులతో కూడిన సొసైటీ పక్షాన తమ సమస్యలను ప్రభుత్వానికి సమర్థవంతంగా నివేదించగలరన్న పూర్తి విశ్వాసంతో తొమ్మిదో నిజాంగా నవాబ్ రౌనఖ్ యార్‌ఖాన్‌ను ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు. విదేశాల్లో ఉంటున్న నిజాం వారసులకంటే స్థానికంగా ఉంటూ తమ ప్రయోజనాలను కాపాడగలిగిన వ్యక్తినే తమ కుటుంబ పెద్దగా తాము ప్రకటించుకున్నామన్నారు. ఈ సందర్భంగా అసఫ్ జాహీ వంశపారపర్యంగా వస్తున్న వస్తువులను సమావేశంలో ప్రదర్శించారు. వీటిని తొమ్మిదో నిజాంగా బాధ్యతలు చేపట్టే సమయంలో నవాబ్ రౌనఖ్ యార్ ఖాన్‌కు అందజేస్తారు.



రూ.లక్షల విలువచేసే చేతికర్రలు

అసఫ్ జాహీల వంశపారంపర్యంగా వస్తున్న చేతికర్రల విలువ వింటే నోరెళ్ల బెట్టాల్సిందే. ఆనాటి నుంచి ఇప్పటివరకు మూడు చేతికర్రలను భద్రంగా ఉంచుతూ కొత్తగా బాధ్యతలు చేపట్టే నిజాంకు అందిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో ఒకటి మొదటి నిజాం ప్రభువు ప్రత్యేకంగా తయారుచేసుకున్నారు. నాణ్యమైన చెక్కతో ఫిరోజ్–హుస్సేనీ డైమండ్ పొదగబడిన ఈ కర్ర విలువ అక్షరాలా రూ.30 లక్షలు. పైభాగంలో గుండ్రని నోబ్ కలిగి చుట్టూరా 5 బ్రాస్ లైన్లతో ఉంటుంది. మరొకటి టిప్పు సుల్తాన్ నుంచి నిజాం ప్రభువులు పొందారు. రోజ్‌వుడ్‌తో వివిధ రకాల డిజైన్లతో దీనిని రూపొందించారు. దీని విలువ కూడా 30 లక్షల వరకు ఉంటుంది. ఇంకో చేతికర్ర తాజ్‌మహల్ సృష్టికర్త షాజహాన్‌నుంచి అందుకున్నారు. ఇది ఏనుగు దంతంతో రూపొందించింది. దీని విలువ రూ.15 లక్షలు ఉంటుందని సొసైటీ ప్రతినిధులు వివరించారు.

లోక్ అదాలత్‌లో రూ.కోటి పరిహారం కేసు పరిష్కారం

తెలంగాణలో ఇదే ప్రథమమని వెల్లడించిన న్యాయవాది

ఖమ్మం లీగల్: ఖమ్మం జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో రోడ్డు ప్రమాదం కేసుకు సంబంధించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు చొరవతో కక్షిదారులకు రూ.కోటి పరిహారం లభించింది. టాటా ప్రాజెక్టు లిమిటెడ్ కంపెనీలో డిప్యూటీ మేనేజర్‌గా ఉన్న గంగుల త్రినాథ్ 2019 మేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో అయన తల్లిదండ్రులు రూ.కోటి నష్టపరిహారం కోరుతూ న్యాయవాది రామిశెట్టి హరిప్రసాద్ ద్వారా ఖమ్మం కోర్టులో 'గో డిజిట్' బీమా కంపెనీపై కేసు దాఖలు చేశారు. మృతుడి భార్యను కూడా ప్రతివాదిగా చేర్చి పరిహారంలో ఆమెకు వాటా కేటాయించాలని దావా దాఖలు చేశారు. కేసులో మృతుడి భార్య తరఫున ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీమా కంపెనీ తరఫున బండారుపల్లి గంగాధర్ వాదనలు విన్నవించారు. ఈ క్రమంలో జిల్లా జడ్జి శ్రీనివాసరావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావేద్‌పాషా ఇరుపక్షాల మధ్య రాజీకి ప్రతిపాదించి కొద్దిరోజులుగా చర్చిస్తున్నారు. అయితే, బీమా కంపెనీ బాధ్యులు రూ.కోటి పరిహారానికి అంగీకరించకపోవడంతో జిల్లా న్యాయమూర్తి ఒప్పించే ప్రయత్నం చేశారు. చివరకు శనివారం జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ సమావేశం జరుగుతుండగా.. రూ.కోటి పరిహారం చెల్లించడానికి బీమా కంపెనీ అంగీకరించిందనే సమాచారం అందింది. దీంతో జిల్లా న్యాయమూర్తి లోక్ అదాలత్ ప్రిసైడింగ్ అధికారి హోదాలో రూ.కోటి మేర పరిహారంతో లోక్ అదాలత్ అవార్డు జారీ చేశారు. కాగా, ఇంత పెద్దమొత్తంలో పరిహారం లోక్ అదాలత్‌లో లభించడం తెలంగాణలో ఇదే ప్రథమమని బీమా కంపెనీ న్యాయవాది తెలిపారు.

ఒకేరోజు 3,30,866 కేసుల పరిష్కారం

లోక్ అదాలత్‌కు భారీ స్పందన ● రికార్డు స్థాయిలో రూ.255 కోట్ల చెల్లింపులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ఒకేరోజు రికార్డు స్థాయిలో 3,30,866 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో



ప్రి–లిటిగేషన్ కేసులు 9,262.. వివిధ కేటగిరీల్లోని పెండింగ్ కేసులు 3,21,604 ఉన్నాయి. బాధితులకు రూ.255.48 కోట్ల పరిహారం చెల్లింపులకు ఉత్తర్వులు వెలువడ్డాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.నవీన్‌రావు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ టి.వినోద్‌కుమార్ రాష్ట్రవ్యాప్తంగా లోక్ అదాలత్‌ను పర్యవేక్షించారు.

హైకోర్టులో 365 కేసులు..

హైకోర్టు పరిధిలో జరిగిన అదాలత్ కార్యక్రమంలో జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి, జస్టిస్ జి.శ్రీదేవి, మాజీ న్యాయమూర్తి జస్టిస్ జీవీ సీతాపతి పాల్గొన్నారు. హైకోర్టులో 365 కేసులు పరిష్కారమయ్యాయి. రూ.26.5 కోట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇక జిల్లా కోర్టుల్లో స్థానిక న్యాయమూర్తులు కేసులను పరిష్కరించారు.

బాలభీముడు @ 5.8 కేజీలు

ఏపీ ప్రభుత్వాస్పత్రిలో మగశిశువు జననం



గుంతకల్లు: అనంతపురం జిల్లా గుంతకల్లు వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో ఒక మహిళ 5.8 కేజీల బరువున్న మగ శిశువుకు జన్మనిచ్చింది. కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన నాగిరెడ్డి భార్య తేజస్వినిని మూడో కాన్పులో భాగంగా శనివారం ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాన్పు కష్టమయ్యే అవకాశం ఉన్నందున వెంటనే గుంతకల్లు లేక ఆదోనికి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. ఈ మేరకు ఆమెను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ప్రసూతి వైద్యురాలు సుజాత ఆధ్వర్యంలో దాదాపు గంట పాటు శ్రమించి సాధారణ కాన్పు చేశారు. పుట్టిన మగబిడ్డ 5.8 కేజీల బరువున్నాడు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు డాక్టర్ సుజాత తెలిపారు. హైరిస్క్ అయినప్పటికీ ఎటువంటి సమస్య రాకుండా సాధారణ కాన్పు చేసినందుకు వైద్యురాలికి తేజస్విని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

33,60,301 మందికి 'కంటి వెలుగు'



సాక్షి, హైదరాబాద్: కంటి వెలుగు అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందని ప్రభుత్వం తెలిపింది. ఇప్పటి వరకు మొత్తం 33,60,301 మందికి కంటి పరీక్షలు చేశామని వెల్లడించింది. ఇందులో 6,76,732 మందికి రీడింగ్ గ్లాసెస్ ఇచ్చామని, 4,60,775 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ కోసం రిఫర్ చేశామని, 22,22,669 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని తేలిందని వివరించింది. ఇక రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాల్లోనూ రికార్డు స్థాయిలో కంటి పరీక్షలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించగలమని వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు అంటున్నారు. గ్రామాలు, మున్సిపల్ వార్డులతోపాటు సచివాలయం, శాసనసభ, డీజీపీ కార్యాలయం, విద్యాసంస్థలు, కార్యాలయాల్లో, భారీ సమూహాలు ఉండే ప్రాంతాల్లోనూ కంటి వెలుగు శిబిరాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. మారుమూల గ్రామాల వద్దకే అత్యాధునిక పరికరాలతో, అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులతో నిర్వహించే కంటి వెలుగు క్యాంపులకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తున్నారు. నేత్ర సంబంధిత వ్యాధులకు తగు వైద్య సలహా తీసుకోవడం, కంటి అద్దాలు పొందడం, అవసరం ఉన్న వారు రెఫరల్ గ్లాసులు పొందుతున్నారని శనివారం సమాచారశాఖ ఒక ప్రకటనలో వివరించింది.

నిరుపేదల కళ్లలో వెలుగు..

నల్లగొండ పట్టణం సమీపంలోని భాస్కర్ల బావి గ్రామానికి చెందిన దర్జీ మేరోళ్ల మురళికి కొన్నాళ్లుగా చూపు సరిగ్గా కనపడేది కాదు. దీనితో రోజులో కేవలం రెండు మూడు గంటలు మాత్రమే పనిచేసేవాడు. ఈ నేపథ్యంలో గ్రామంలోనే ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరానికి వెళ్లి పరీక్ష చేసుకోగా 2.5 పాయింట్ రీడింగ్ గ్లాసులు అక్కడికక్కడే అందచేశారు. ఈ కంటి వెలుగు అద్దాలతో రోజూ పది గంటలకు పైగా పనిచేస్తూ అధిక ఆదాయాన్ని పొందుతున్నానని ఆనందంతో చెప్పాడు. అదేవిధంగా సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి గ్రామానికి చెందిన డి.చంద్రకళ అనే మహిళకు కూడా.. ఇదే మాదిరిగా కండ్లు మసక మసకగా కనిపిస్తుంటే కంటి వెలుగు ద్వారా చూపు సక్కగైందని సంతోషం వ్యక్తం చేసింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.